



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త






epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 98 పేజీలు: 8+16 వెల: 6.50






కోల్‌కతాలోని బ్రిగేడ్ పెరేడ్ గ్రౌండ్స్‌లో సువేందు అధికారి ప్రమాణ స్వీకారానికి ముస్తాబవుతున్న వేదిక

# బెంగాల్ సిఎంగా సువేందు

>> హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నప్పటికీ ప్రజలు బిజెపిపై విశ్వాసం ఉంచారని, తమ ప్రభుత్వం ఏర్పాటు కాగానే చొరబాటుదారులు, గోవుల అక్రమరవాణాకు పూర్తిగా కళ్లెం వేస్తామని స్పష్టం చేశారు. 'సోనార్ బంగ్లా లక్ష్య సాధన దిశగా పనిచేయడం, బెంగాల్ ప్రజల అంచనాలను నిలబెట్టడం మన బిజెపి కార్యకర్తలందరికి బాధ్యత. కవిగురు రవీంద్రనాథ్ ఠాగూర్ కలలు గన్న భయంలేని, ఆత్మగౌరవంతో తలెత్తుకుని జీవించే బెంగాల్ వైపు నేడు మన ప్రయాణం సాగుతోంది' అని అమిత్‌షా అన్నారు. సువేందు అధికారిని బిజెపి లెజిస్లేటివ్ పార్టీ నేతగా అమిత్‌షా ప్రకటించారు. 55 ఏళ్ల అధికారి, ప్రస్తుతం రద్దయిన గత అసెంబ్లీలో ప్రతిపక్ష నాయకుడిగా సేవలందించారు. ఒకప్పుడు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీకి అత్యంత నమ్మకమైన అనుచరుడిగా ఉన్న అధికారి, 2021 అసెంబ్లీ ఎన్నికలకు కొన్ని నెలల ముందు, 2020లో బిజెపిలో చేరారు. 2021లో, అసెంబ్లీలో 77 స్థానాలను గెలుచుకోవడం ద్వారా బిజెపి బెంగాల్‌లో ప్రధాన ప్రతిపక్షంగా అవతరించింది. ఐదేళ్ల తర్వాత, ఈ ఎన్నికల్లో 207 స్థానాలను గెలుచుకుని ఆ పార్టీ అధికారంలోకి దూసుకువచ్చింది.

**నేడు ప్రమాణస్వీకారం:**

ఈనెల 9వ తేదీ (శనివారం) ఉదయం 11:00 గంటలకు కోల్‌కతాలోని చరిత్రాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ప్రమాణస్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోడీ, అమిత్ షా, బిజెపి జాతీయ నేతలు, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు.

**ఇద్దరు డిప్యూటీ సిఎంలు?:**

పాలనలో సమతుల్యత కోసం ఇద్దరు ఉపముఖ్యమంత్రులను నియమించాలని బిజెపి హైకమాండ్ నిర్ణయించినట్లు తెలుస్తోంది. మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ఒక డిప్యూటీ సిఎం పదవిని మహిళా నేతకు (బహుశా అగ్నిమిత్ర పాల్) కేటాయించే అవకాశం ఉంది. ప్రాంతీయ సమీకరణలు దృష్టిలో పెట్టుకుని ఉత్తర బెంగాల్, గిరిజన ప్రాంతాలకు కేబినెట్‌లో పెద్దపీట వేయనున్నారని సమచారం.

# 'సర్'ను ఎదుర్కొందాం

>> ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఇరాన్, ఇరాక్ యుద్ధంతో విమాన ఇంధన ఛార్జీలు పెరిగాయని అన్నారు. దీంతో హజ్ యాత్రికులపై ఎలాంటి భారం పడకుండా ఆ భారాన్ని రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోందని చెప్పారు. అలాగే సంక్షేమంలో మైనారిటీల వాటాను వారికి అందిస్తున్నామని తెలిపారు. విదేశీ విద్య విషయంలోనూ మైనారిటీలకు స్కాలర్షిప్‌లు అందిస్తున్నామని తెలిపారు. ఉద్యోగాల్లో, సంక్షేమ పథకాల్లో మైనారిటీలకు దక్కాల్సిన వాటాను వారికి అందిస్తున్నామని అన్నారు. గత ఏడాది హజ్ యాత్రకు వెళ్లి బస్సు ప్రమాదంలో 44 మంది మృతి చెందగా, ప్రతీ మృతుడి కుటుంబానికి రూ.5 లక్షల పరిహారం ఇచ్చి రాష్ట్ర ప్రభుత్వం ఆ కుటుంబాలను ఆదుకుందని గుర్తు చేశారు. సంక్షేమంలో మైనారిటీల వాటాను వారికి అందిస్తున్నామని, ఉద్యోగాలలో, సంక్షేమ పథకాలలో మైనారిటీలకు దక్కాల్సిన వాటాను వారికి అందిస్తున్నామని చెప్పారు. విదేశీ విద్య విషయంలోనూ మైనారిటీలకు స్కాలర్షిప్ లు అందిస్తున్నాం, వైట్ కాలర్ జాబ్స్ కంటే ప్రస్తుతం బ్లూ కాలర్ జాబ్స్‌కు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు. అమెరికా కంటే జర్మనీ, జపాన్ దేశాల్లో ఉద్యోగ అవకాశాలు ఎక్కువగా అందుబాటులో ఉన్నాయని, అందుకే ఐటీఐలను ఏటీసీలుగా అప్ గ్రేడ్ చేసి యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తున్నామని చెప్పారు.

**మైనారిటీ విద్యార్థుల కోసం ప్రత్యేక డిగ్రీ కళాశాలలు: సిఎం**

మైనారిటీ విద్యార్థుల కోసం ఉమ్మడి జిల్లా కేంద్రాల్లో ప్రత్యేక డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలని.. వాటిలో నైపుణాభివృద్ధి, ఎఐ శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. సంప్రదాయ కోర్సులు కాకుండా వారి జీవనోపాధికి ఉపయోగపడే శిక్షణ ఇప్పించాలన్నారు. మైనారిటీ సంక్షేమ శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సచివాలయంలో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ప్రతిభావంతులైన బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఇస్తున్నట్లే మైనారిటీ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించాలని, ఇందుకోసం ప్రత్యేకంగా ఒక కార్యక్రమం ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. గ్రూప్1, గ్రూప్2, గ్రూప్3కి ఎంపికైన మైనారిటీ అభ్యర్థుల్లో ఆసక్తి ఉన్న వారిని ఎంపిక చేసి మైనారిటీ సంక్షేమ శాఖలో బాధ్యతలు అప్పగించి... ఆ శాఖ పరిధిలో చేపట్టే అన్ని కార్యక్రమాలపై పూర్తి అవగాహన కలిగించేలా వారిని తీర్చిదిద్దాలని సీఎం ఆదేశించారు. విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించే కార్యక్రమానికి గ్రూప్స్‌కు ఎంపికైన వారిని, క్రీడాకారులను ఆహ్వానించి విద్యా, క్రీడల ప్రాధాన్యతను వారికి తెలియజేయాలని సూచించారు. ఇమామ్, మోజమ్‌లకు ఇచ్చే గౌరవ పారితోషికాలను క్రమం తప్పకుండా విడుదల చేయాలని అధికారులను సిఎం ఆదేశించారు. మైనారిటీ పాఠశాలల్లో బోధనలో ఏఐకు ప్రాధాన్యమివ్వాలని సీఎం సూచించారు. భూ లభ్యత ఉన్న చోట ఖబరస్తాన్‌లకు స్థలాలను కేటాయిస్తామని సీఎం తెలిపారు. డీజిల్, పెట్రోల్ ఆటోలను ఎలక్ట్రిక్ ఇంజిన్లతో రీట్రోఫిట్టింగ్ చేయడం ద్వారా ఆటోడ్రైవర్లకు ఇంధన ఖర్చులు లేకుండా చేసి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఒక ప్రణాళిక రూపొందిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్‌లో భాగంగా గుడితో పాటు మసీద్, చర్చి, గురుద్వారా నిర్మాణాలు చేపట్టాలని అధికారులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఆయా మతాలకు సంబంధించిన సంస్కృతుల అధ్యయనం, భారత దేశ విశిష్టతను, తెలంగాణలోని గంగా జమునా తెహజీబ్‌ను తెలియ జేసేలా ఆ కట్టడాలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు.

# అభివృద్ధిలో కొడంగల్ అగ్రగామి

>> వేణుగోపాలస్వామి, దౌల్తాబాద్‌లో వెంకటేశ్వర స్వామిఆలయాలను అభివృద్ధికి నిధులు ఇచ్చామని వెల్లడించారు. మాజీ ఎమ్మెల్యేలు నందారం వెంకటయ్య, గురునాథ్‌రెడ్డి, నందారం సూర్యనారాయణ కొడంగల్ వేంకటేశ్వర ఆలయం అభివృద్ధికి చాలా తాపత్రయ పడినా అప్పటి పాలకులు నిధులు మంజూరు చేసేందుకు వెనకంజ వేశారన్నారు. తిరుమల తిరుపతి ఆగమశాస్త్ర సలహాదారులు దివంగత సుందర వరదాచార్యులు సూచనల ప్రకారమే కొడంగల్ ఆలయం అభివృద్ధి చేపడతామని రేవంత్ తెలిపారు. తిరుమల తిరుపతి పద్ధతుల్లోనే కొడంగల్ స్వామివారి ఆలయంలో పూజలు జరిపిస్తామన్నారు. అధికారం చేపట్టిన తర్వాత రాష్ట్రం పురోగతి దిశగా నడుస్తోందని సిఎం చెప్పారు. రాష్ట్రంలో రైతు రుణమాఫీ, సన్నబియ్యం, రైతు భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు, ఫీజు రీఎంబర్‌మెంట్ వంటి సంక్షేమ కార్యక్రమాలు అమలవుతున్నాయని వివరించారు. పేదల విద్య, వైద్యం కోసం అనేక కార్యక్రమాలు ప్రవేశపెట్టామని తెలిపారు. వివిధజిల్లాల విద్యార్థులు ఉన్నత విద్యకు కొడంగల్ వైపు వచ్చే పరిస్థితి తీసుకువచ్చామని ఆయన వివరించారు. ప్రస్తుతం నారాయణపేట-కృష్ణా జలాల పథకం శరవేగంగా సాగుతోందని తెలిపారు. ఏడాదిన్నర లోపు పథకాన్ని పూర్తి చేసి కృష్ణా జలాలను పంటలకు అందిస్తామని స్పష్టం చేశారు. కృష్ణా లిఫ్ట్ పథకం కోసం మంత్రి శ్రీహరి కేవలం నెలరోజుల్లోనే భూసేకరణ ప్రక్రియను పూర్తి చేశారని కొనియాడారు. కృష్ణాజలాల పథకానికి ఎలాంటిఅడ్డంకులు లేవన్నారు. వికారాబాద్- కృష్ణా రైల్వే లైన్ దాదాపు పూర్తి కావస్తోందని సీఎం తెలిపారు. కొడంగల్ పరిసరాల్లో సిమెంట్ కర్మాగారం పనులు సాగుతున్నాయని, స్థానికులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామని చెప్పారు. మెడికల్, ఇంజనీరింగ్, ఏటీసీ సెంటర్, నర్సింగ్, పాలిటెక్నిక్, సైనిక్ స్కూలు ఇలా విద్యాసంస్థలు కొడంగల్‌కు వచ్చాయని తెలిపారు. యేడాదిన్నరలో ఎడ్యుకేషన్ హబ్ పనులు పూర్తవుతాయని చెప్పారు. లగచర్లలో 2300 ఎకరాల్లో ఇండస్ట్రియల్ పార్కు పనులు చేపడుతున్నామని సీఎం ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహా, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు రామ్మోహన్‌రెడ్డి, బీ.మనోహర్‌రెడ్డి, కలెక్టర్ దీపక్ తివారీ, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాత, మాజీ ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్, రాష్ట్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి తథ్యం

>> రాజకీయ ప్రయోజనాల కోసమే ప్రాజెక్టును మేడిగడ్డ వైపు మళ్లించారని మండిపడ్డారు. ఈ మేరకు కుమరంభీం జిల్లా కౌటాల మండలంలోని తుమ్మిడిహెట్టి ప్రాజెక్టు స్థలాన్ని మంత్రులు శుక్రవారం సందర్శించారు. పర్యటనలో భాగంగా ప్రాణహిత నదికి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి, జలహారతి ఇచ్చారు. తుమ్మిడిహెట్టి ప్రతిపాదిత స్థలాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. బరాజ్ ఎత్తు, సామర్థం, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పనులు, మహారాష్ట్రలో ఉన్న శివిని గ్రామ పరిధిలోని ముంపు పరిధి, అటవీ, పర్యావరణ అనుమతులు, తదితర అంశాలపై సాగునీటి పారుదల శాఖ అధికారులతో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ... తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణహిత బ్యారేజీ నిర్మాణం రైతులకు ఒక వరమని అన్నారు. బ్యారేజీని నిర్మించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా రైతుల దశను మార్చుతామన్నారు. ఏళ్లుగా ఎదురుచూస్తున్న ప్రాణహిత బ్యారేజీ నిర్మించేందుకు కాంగ్రెస్ సర్కార్ సిద్ధమవుతోందని చెప్పారు. గత బీఆర్ఎస్ పాలకులు పక్కనబెట్టిన ప్రాణహితచేవెళ్ల ప్రాజెక్టుకు తుమ్మిడిహెట్టి బరాజ్ పునరుజ్జీవం పోయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి 2008లో రూ.38,500 కోట్ల అంచనా వ్యయంతో 16 లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో డా. బీఆర్ అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టుకు భూమిపూజ చేశారని గుర్తుచేశారు. అప్పట్లోనే 106 కి.మీ మేర కెనాల్ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి 71.5 కి.మీ మేర భూసేకరణ కూడా పూర్తి చేశారని, 46 కి.మీ మేర పనులు కూడా పూర్తయ్యాయని వెల్లడించారు. కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పక్కనబెట్టి, కాళేశ్వరం పేరుతో లక్షల కోట్లు ఖర్చు చేసి ఖజానాకు భారీ గండి కొట్టిందని మంత్రులు మండిపడ్డారు. గ్రావిటీ ద్వారా నీటిని మళ్లించే అవకాశం ఉన్నా పంపుల ద్వారా నీటిని ఎత్తిపోయడంతో ఆర్థిక భారం పెరగడమే కాకుండా విద్యుత్ బిల్లులు కూడా భారంగా మారాయని ధ్వజమెత్తారు. మేడిగడ్డ ప్రాజెక్ట్ పిల్లర్లు కుంగిపోవడంతో ఇప్పుడు ఆ నీటిని వాడుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తుమ్మిడిహెట్టి బరాజ్ నిర్మిస్తే ఒక్క యూనిట్ విద్యుత్ ఖర్చు లేకుండా గ్రావిటీ ద్వారా శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుకు నీటిని తరలించవచ్చని, తద్వారా సిర్పూర్, ఆసిఫాబాద్, బెల్లంపల్లి, చెన్నూరు రైతాంగానికి మేలు జరుగుతుందని స్పష్టం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల మేర బరాజ్ నిర్మాణానికి అంగీకరించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరనున్నట్లు మంత్రులు చెప్పారు. మహారాష్ట్రలోని శివిని గ్రామానికి ఎలాంటి ముంపు సమస్య ఉండదని, భూములు కోల్పోయే వారికి మెరుగైన పరిహారం, సదుపాయాలు కల్పిస్తామని, ఈ ప్రాజెక్టు వల్ల రెండు రాష్ట్రాల్లోనూ భూగర్భ జలాలు పెరుగుతాయని వివరించారు.

**కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు చొరవ తీసుకోవాలి...**

కేంద్రంలో అధికారంలో బిజెపికి చెందిన రాష్ట్ర ఎంపిలు, ఎమ్మెల్యేలు చొరవ చూపాలని మంత్రులు జూపల్లి, వివేక్ కోరారు. ఈ నెల 10న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనకు రానున్న నేపథ్యంలో రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు, బిజెపి ఎంపిలు ప్రాణహిత ప్రాజెక్టు అంశాన్ని ప్రధాని దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. వికసిత్ భారత్ అని నినదించే కేంద్ర ప్రభుత్వం, పెద్ద మనసుతో తెలంగాణ రైతుల పక్షాన నిలబడి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి నిర్మాణ విషయమై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ప్రభుత్వం తరఫున రాష్ట్ర నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారని మంత్రులు తెలిపారు. వచ్చే వారం మహారాష్ట్ర ముఖ్యమంత్రితో భేటీ జరగనుందని, బ్యారేజ్ ఎత్తుపై చర్చించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాల దృష్ట్యా చేపడుతున్న ఈ ప్రాజెక్టు విషయంలో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు మానుకోవాలని మంత్రులు హితవు పలికారు. సాగునీటిరంగాన్ని గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు గడ్డం వినోద్, పాల్వాయి హరీష్‌బాబు, కలెక్టర్ హరిత, ఎస్పి నిఖితపంత్ తదితరులు పాల్గొన్నారు.

# దారుణ హత్య

>> కలిసి నివసిస్తున్నారు. వినయ్ రంజన్ రే చికిత్స కోసం పది రోజుల క్రితం బెంగళూరు వెళ్లారు. కాగా ఇంట్లో అతని భార్య తనూజ రంజన్, ఇద్దరు కుమార్తెలు ఇంట్లోనే ఉన్నారు. నేపాల్‌కు చెందిన కల్పన కొద్ది నెలల క్రితం వీరి నివాసంలో పనికి చేరి అదే ఇంట్లో ఒక చిన్న గదిలో ఉంటుంది. తనూజ రంజన్ మొదటి అంతస్థులో ఉంటుండగా ఆమె ఇద్దరు కుమార్తెలు రెండో అంతస్థులో ఉన్నారు. కాగా గురువారం రాత్రి దాదాపు 1.30 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి తలుపు తీసుకొని బయటకు వచ్చిన కల్పన ఇంటి పక్కన ఉన్న పార్కు వైపు చూసి సైగలు చేసింది. దీంతో మాస్కులు ధరించి చేతిలో ఇనుప రాడ్లు పట్టుకున్న ముగ్గురు 30 ఏళ్లలోపు అగంతకులు మొదటి అంతస్థులోకి వెళ్లారు. కల్పనతో కలిసి ఇంట్లోకి ప్రవేశించారు. దాదాపు 3 గంటల ప్రాంతంలో కల్పనతోపాటు వచ్చిన ముగ్గురు అగంతకులు కలిసి రెండు బ్యాగులతో పార్కు వైపు నుంచి పారిపోయారు. ఉదయం 9.30 నుండి 10 గంటల సమయంలో ఇంట్లో వంటమనిషిగా పనిచేసే నాగమణి ఇంట్లోకి వచ్చి చూసింది. అప్పటికే ఇంట్లోని అన్ని గదులు చిందరవందరగా ఉండటంతోపాటు బీరువా తలుపులు తెరిచి కనిపించాయి. యజమానురాలైన తనూజ రంజన్ మంచంపై విగతజీవిగా పడిపోయి కనిపించింది. దీంతో పై అంతస్థులో ఉన్న కుమార్తెలకు ఆమె ఈ విషయాన్ని తెలియజేసింది. వెంటనే వారు ఆమెను అపోలో ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మాజీ అదనపు డిజిపికి పర్సనల్ సెక్యూరిటీ అధికారిగా ఉన్న సాయి సంఘటన జరిగిన విషయాన్ని 100 ద్వారా సమాచారం ఇవ్వడంతో జూబ్లీహిల్స్ పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకున్నారు. తొలుత జూబ్లీహిల్స్ డివిజన్ అదనపు డిసిపి శ్రీకాంత్, ఇంఛార్జి ఎసిపి సామల వెంకటరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశారు. దీంతో నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ ఆసుపత్రికి వెళ్లారు. జరిగిన సంఘటనపై ఆరా తీశారు. అదే సమయంలో జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్‌లోని నివాసం వద్దకు డిజిపి సీవీ ఆనంద్, ఇంటిలిజెన్స్ డీజీ విజయ్‌కుమార్, డీజీ శిఖాగోయల్, ఐపీఎస్‌లు తఫ్సీర్ ఇక్బాల్, శ్వేత తదితరులు విచ్చేసి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. వీరితోపాటు ఖైరతాబాద్ నియోజకవర్గం ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం అక్కడికి వచ్చారు. అనంతరం అక్కడికి చేరుకున్న నగర పోలీసు కమిషనర్ సజ్జనార్ మీడియాతో మాట్లాడారు. ఇంట్లో పనిచేసే కల్పన మరో ముగ్గురితో కలిసి ఈ దారుణానికి పాల్పడిందన్నారు. ఇంట్లోకి వచ్చిన వారు ముందుగా ఆమె కాళ్లు, చేతులు కట్టేసి కేకలు వేయకుండా నోట్లో గుడ్డలు కుక్కారన్నారు. దీంతో ఆమె శ్వాస ఆడక మృతి చెంది ఉంటారని భావిస్తున్నామన్నారు. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్నామని, నిందితులను ఖచ్చితంగా పట్టుకుంటామన్నారు. ఇప్పటికే ఆధారాలు సేకరించామని, ప్రాథమికంగా ఉన్న సమాచారం మేరకు నేపాలి ముఠానే ఈ పనికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. నేపాలి పనిమనుషుల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.




శుక్రవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ జైపూర్‌లో జరిగిన సంయుక్త కమాండర్ల సదస్సుకు హాజరైన దృశ్యం

# అదే సస్పెన్స్!

>> మద్దతు లేఖలను గవర్నర్‌కు ఇవ్వకపోవడంతో కేవలం 116 వద్దనే విజయ్‌మెజార్టీ నిలిచిపోయింది. ఇదిలా ఉంటే టిటివిదినకరన్ పార్టీ ఎఎంఎంకె తాము విజయ్‌కు మద్దతివ్వలేమని ఎఐఎడిఎంకెను ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించాలంటూ గవర్నర్‌ను కలిసి లేఖ ఇచ్చారు. తాము టివికెకు ఎట్టిపరిస్థితుల్లోను మద్దతివ్వమని, ఎఐఎడిఎంకెకు మద్దతిస్తామంటూ దినకరన్‌ప్రకటించడం తంబిల రాజకీయాల్లో మరో మలుపు తిరిగినట్లయింది. కాగా సిపిఐ, సిపిఎం, విసికె ఈ మూడు పార్టీలుకూడా ఇప్పటివరకూ డిఎంకె కూటమిలోనే కొనసాగాయి. తీరా మద్దతు పరంగా టివికెపట్ల ఆసక్తిచూపాలంటే వాటికి ఇరకాటంగా మారింది. ఇపుడు కేవలం ఇద్దరు ఎమ్మెల్యేల మద్దతుపైనే టివికె విజయ్ భవిష్యత్తు ఆధారపడి ఉంది. తొలుతచోటుచేసుకున్న పరిణామాల్లో విజయ్‌తోపాటు పార్టీసీనియర్లు కూడా సంప్రదింపులు జరపడంతో విసికె మొగ్గుచూపింది. అయితే తమకు ఉప ముఖ్యమంత్రి పదవి కావాలని పట్టుబట్టడంతో కథ అడ్డం తిరిగింది. అయితే ప్రభుత్వంలో అత్యంత కీలక మంత్రిపదవి ఇస్తామని టివికె సర్దుబాటుకు ప్రయత్నించినా విసికె మంకుపట్టుతో గవర్నర్‌కు లేఖను పంపించలేదని తెలుస్తోంది. విసికె తమ నేత సీనియర్‌నాయకుడు తోల్ తిరుమావలన్‌కు డిప్యూటి సిఎం పోస్టు ఇవ్వాలని రవికుమార్ ఒత్తిడి తీసుకువచ్చారు. మరికొందరు నాయకులు పార్టీ విడియో సమావేశంలో టివికెకు మద్దతివ్వాలని అయితేకేబినెట్‌లో స్థానాలుండాలని పార్టీ డిప్యూటి ప్రధాన కార్యదర్శి వన్ని ఆరసుకు కేబినెట్‌పదవి ఇవ్వాలని కోరుతున్నారు. అలాగే రానున్న కొత్త ప్రభుత్వం దళిత పరిరక్షణకు కృషిచేసేదిగా ఉండాలని మరికొందరు చెపుతుంటే తిరుమావలన్‌ను తిరుచ్చి ఈస్ట్ స్థానంనుంచి పోటీకి టివికెసైతం తమనేతకు మద్దతివ్వాలని పట్టుబడుతున్నారు. ఇపుడు విజయ్ ప్రమాణ స్వీకారం కేవలం ఒకే ఒక్క ఎమ్మెల్యే మద్దతువద్ద నిలిచిపోయింది. ముఖ్యంగా విసికె, ఎంఎంకె, ఐయుఎంఎల్ ఎమ్మెల్యేలు మెజార్టీ మద్దతిస్తే తమకు సరిపోతుందని భావించిన విజయ్‌కు ఈపార్టీలు మొండిచెయ్యిచూపించాయి. ఇదిలా ఉంటే ఐయుఎంఎల్ పార్టీనుంచి గెలిచిన ఎమ్మెల్యే షాజహాన్ తమ పార్టీ టివికెకు మద్దతివ్వడంలేదని, తాము ఎవ్వరికీ మద్దతు లేఖలుఇవ్వలేదని, తమ పార్టీ డిఎంకెతోనే కొనసాగుతుందని స్పష్టంచేయడంతో ఈపార్టీకూడా టివికెకు మద్దతు అంశంలో వెనక్కు తగ్గిందనే చెప్పాలి.

**సందిగ్ధంలోప్రమాణస్వీకారం...**

ముందు సరిపడే ఎమ్మెల్యేలు మద్దతు తమకు ఉందన్న భావనతో టివికె అధినేత విజయ్‌ప్రమాణస్వీకారం ఉంటుందని, జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియంలో ఉదయం 11 గంటలకు ప్రమాణస్వీకార కార్యక్రమం ఉంటుందని పార్టీనేతలుప్రకటించారు. అయితే గవర్నర్ కార్యాలయంనుంచి తమకు మద్దతు లేఖలు అందలేదని, ఈనేపథ్యంలో తాము ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానించలేమని లోక్‌భవన్ స్పష్టత ఇవ్వడంతో విజయ్‌ప్రమాణస్వీకారం రెండోసారి మళ్లీ సందిగ్ధంలోపడింది. శనివారం నాటికయినా స్పష్టత వస్తుందనేది టివికెనేతల్లోను అనుమానాలు చెలరేగుతున్నాయి.

**తమిళనాట పరిణామాల్లో మా ప్రమేయం లేనేలేదు...బిజెపి**

ఇదిలా ఉంటే తమిళనాడులోకొనసాగుతున్న తాజా పరిణామాల్లో తమ ప్రమేయం ఎంతమాత్రం లేదని టివికె గవర్నర్లమధ్య నెలకొన్న ప్రతిష్టంభన కేవలం మెజార్టీ నిరూపణతోనే తేలిపోతుందని బిజెపి చెపుతోంది. తీర్పు భిన్నంగా వచ్చిందని, టివికెకు మెజార్టీ తగ్గిందని, విజయ్ తన మెజార్టీ నిరూపించుకున్న పక్షంలో గవర్నర్ రాజ్యాంగపరంగా ఆమోదిస్తారని, ఇందులో ఎలాంటి సందేహంలేదని బిజెపి రాష్ట్రప్రతినిధి నారాయణ్ తిరుపతి ప్రకటించారు. తమిళనాడు ప్రస్తుత పరిణామాలను తమ పార్టీకి అంటగట్టడం భావ్యం కాదని అన్నారు. గవర్నర్‌ను ఎలా నడుచుకోవాలో బిజెపి మార్గనిర్దేశంచేస్తోందన్న వ్యాఖ్యలు అర్ధరహితమని ఆయన కొట్టిపారేసారు. రాష్ట్రంలో ఎన్నికలు ప్రజాస్వామ్య బద్ధంగాజరిగాయని, టివికె విజయ్‌కు ఎక్కువ సీట్లు వచ్చాయని, ప్రతి సందర్భం కూడా ప్రజాస్వామ్యబద్ధంగానే జరుగుతుందని, గవర్నర్‌పై రాజకీయ పార్టీ ఎలా ఒత్తిడి తెస్తుందని నారాయణ్ పేర్కొన్నారు. ఇవన్నీ అవగాహనలేని వ్యాఖ్యలని కొట్టివేసారు.

## వారం - వర్జ్యం

09-05-2026, శనివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
వైశాఖమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, కృత్తిక కార్తె
సప్తమి మ.1.59
శ్రవణ రా.11.21
వర్జ్యం : రా.3.35-తె.5.17
దు.తె.5.38-ఉ.7.17
శుభసమయం : ఉ.8.30-9.30
రాహుకాలం - ఉ.9.00-10.30

## వార్తాఫలం

**మేషం:** మీ వ్యక్తిగత విషయములను బయటకు వెల్లడి చేసే వ్యక్తులతో జాగ్రత్తగా ఉండుట మంచిది. ఆరోగ్యం జాగ్రత్త.

**వృషభం:** ఆలోచనలతో మీ మనస్సును ఆందోళనకు గురి చేయకండి. మిత్రుల నుండి ముఖ్య సమాచారం అందుకుంటారు.

**మిథునం:** పెద్దలతో సంభాషించునప్పుడు సంయమనమును పాటించండి. విందు, వినోదాలలో పాల్గొంటారు. వస్త్రలాభం.

**కర్కాటకం:** ఆర్థిక సంబంధిత విషయముల మీద మీ దృష్టిని కేంద్రీకరించవలసి వస్తుంది. ఉద్యోగులకు బదిలీలు.

**సింహం:** మీ కార్యాచరణకు సంబంధించిన ప్రణాళికలు పలువురితో ముడిపడి ఉండడం వలన పురోభివృద్ధి వేగం ఉండదు.

**కన్య :** ప్రతికూల వాతావరణంలో అనుకూల ఫలితాలు సాధించడానికి ఎంతో కృషి చేస్తారు. కొత్త మిత్రుల పరిచయాలు.

**తుల:** ఎంతో కృషి చేసి నామమాత్రపు ఫలితాలు సాధించడానికి ఎంతో కృషి చేస్తారు. నూతన విద్యావకాశాలు కలవు.

**వృశ్చికం:** ఉద్యోగములో కొందరు స్వార్థపరులు మీపై చేసే దుష్ప్రచారము వలన మానసిక ప్రశాంతతను కోల్పోతారు.

**ధనుస్సు:** వాహనముల మరమ్మత్తులకు గాను అధిక ధనవ్యయము సంభవము. భూవివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మకరం:** కోర్టు సంబంధమైన వ్యవహారములలో మధ్యవర్తుల సహాయ సహకారములను పొందుతారు. వాహన సౌలభ్యం.

**కుంభం:** వ్యక్తిగత విషయములలో సంయమనము పాటించండి. భవిష్యత్తులో సుఖపడాలంటే కష్టించక తప్పదని భావిస్తారు.

**మీనం:** చేపట్టిన పనులలో ఆటంకాలు తొలగి ఊపిరి పీల్చుకుంటారు. కుటుంబ సభ్యుల నుండి బయటపడతారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# మూసీ.. మన బాధ్యత

>> రూపురేఖలు మారడమే కాకుండా, పరివాహక ప్రాంత ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతాయని, ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుత ప్రాజెక్టు సాకారం అవుతుందని, 'అభివృద్ధి ప్రజా హితం'రెండూ సమాంతరంగా సాగాలని కేబినెట్ సబ్ కమిటి అధికారులకు దిశ నిర్దేశం చేసింది. శుక్రవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన మూసీ పునర్జీవం ప్రాజెక్టు కేబినెట్ సబ్ కమిటి సమావేశం ప్రజాభవన్‌లో జరిగింది. మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్‌లతో కలిసి డిప్యూటి సిఎం ఉన్నత స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో ప్రాజెక్టు పురోగతి, నిధుల సమీకరణ, నిర్మాణ పనులకు సంబంధించిన క్యాలెండర్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నారు. మూసి పునర్జీవన ప్రాజెక్టు 5దశల్లో 55 కిలోమీటర్ల వరకు అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని, దీనిలో భాగంగా ఫేజ్ 1 సుమారు రు.7,055 కోట్ల వ్యయంతో చేపట్టనున్న ఈ ప్రాజెక్టుకు ఆసియా అభివృద్ధి బ్యాంక్ (ఏడిబి) నుంచి నిధులు సమకూర్చుకునేందుకు సాంకేతిక, ఆర్థిక చర్చలు విజయవంతంగా ముగిశాయని అధికారులు మంత్రులకు వెల్లడించారు. ఫేజ్ 1లో భాగంగా హిమాయత్ సాగర్ నుంచి బాపుఘాట్, ఉస్మాన్ సాగార్ నుంచి బాపుఘాట్ 21 కిలోమీటర్ల మేరకు నిర్మాణ పనులను ఏటువంటి ప్రభావం లేని తొలి ఐదు కిలోమీటర్ల పనులను వెంటనే ప్రారంభించాలని మంత్రులు అదేశించారు. మూసీ పునర్జీవనంలో భాగంగా నదిలో ఉన్న చెత్త చెదరాన్ని తొలగించి, పరిశుభ్ర పర్చడం, హైడ్రాలజీ ప్రకారంగా రివర్ బెడ్ ప్రొఫైలింగ్ చేయడం, వరద నియంత్రణ కోసం రిటైనింగ్ వాల్స్ నిర్మాణం, నదికి రెండు వైపులా రోడ్ల నిర్మాణం, నదికి రెండు వైపులా ప్రధాన మురుగు నీటి కాలువల నిర్మాణాం, నాలాలు ఏర్పాటు, నీటి నిల్వ కోసం బ్యారేజీల నిర్మాణం, రివర్ ఫ్రంట్ అభివృద్ధి చేయడం జరుగుతుందని రూపొందించిన డిపిఆర్‌ను మూసి ప్రాజెక్టుమేనేజింగ్ డైరెక్టర్ ఈ.వి నర్సింహ్మారెడ్డి మంత్రులకు వివరించారు. ఈస్ట్‌టువెస్ట్ కారిడార్‌లో భాగంగా నార్సింగి - గౌరెల్లి వరకు 55 కిలోమీటర్ల మేర ఎలివేటేడ్ కారిడార్ నిర్మాణం చేయనున్నామని, ఉప్పల్ భగాయత్ నుంచి గౌరెల్లి వరకు విస్తరణపై డిపిఆర్ తయారీ దశలో ఉందని పవర్ పాయింట్ ప్రజేంటేషన్ ద్వారా వివరించారు. మీర్ ఆలం ట్యాంకు పురోగతి పనులను వివరించారు. గాంధి సరోవర్ ప్రాజెక్టు ఏర్పాటుకు కావాల్సిన భూమిని రక్షణ శాఖ నుంచి బదలాయింపు చేసుకునే అంశంపై చర్చించారు. పర్యావరణానికి సంబంధించిన అన్ని అనుమతులను తీసుకొని ప్రాజెక్టును ముందుకు తీసుకువెళ్లాలని డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క అధికారులను అదేశించారు, మూసి ప్రాజెక్టు పునర్జీవనం వల్ల కలిగే ఉపయోగాల గురించి నగరంలో విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. బస్టాండ్లు, మెయిన్ రోడ్లు హోర్డింగ్స్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. సినిమా థియేటర్‌లో కూడ వీడియోలను ప్రదర్శించే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్థిక, అనుమతులు, విభాగాల మధ్య సమన్వయం కోసం ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, ఎక్కడా జాప్యం లేకుండా ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. రాజధాని అభివృద్ధిలో ఈ ప్రాజెక్టు ఒక మైలురాయిగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు అమలుకు సంబంధించి ప్రభుత్వం స్పష్టమైన గడువును నిర్ణయించిందని వెల్లడించారు. అన్ని రకాల అనుమతులు, విధానపరమైన ప్రక్రియలు పూర్తి చేసుకుని 2026 ఆగస్టు నాటికి పనులు ప్రారంభించాడానికి లక్ష్యంగా పెట్టుకోవాలన్నారు. ఈ బృహత్తర ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి పూర్తిచేయాలన్నారు.. దీనికి సంబంధించిన పూర్తి క్యాలెండర్‌ను సమర్పించాలని ఉపముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. టైంలైన్ నిర్దేశించుకొని స్పష్టమైన పురోగతి కనిపించే విధంగా పనుల నిర్మాణం జరుగాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ప్రజాభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని ఎవరికి ఏలాంటి ఇబ్బంది కలుగకుండ నిర్మాణ పనులను సత్వరమే ప్రారంభించి ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించారు. నిర్మాణ పనుల్లో సాంకేతికపరమైన అంశాలలో ఐఐటి, జెఎన్‌టియూ సంస్థలనుంచి తగిన సహాకారం తీసుకోవాలనిసూచించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని నిర్మాణ పనులకు ఎటువంటి ఆటంకాలు కలుగకుండ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పని సరిగా పాటించే విధంగా నిరంతర పర్యవేక్షణ ఉండాలన్నారు.

**రబ్బర్ డ్యాం నమూనాల పరిశీలించిన మంత్రులు**

మూసీ పునర్జీవం ప్రాజెక్టులో టూరిజం అభివృద్ధిలో భాగంగా నదిలో పలు చోట్ల చెక్ డ్యాంల తరహాలో రబ్బర్ డ్యాంలను ఏర్పాటు చేయనున్నారు. వీటి నిర్మాణాల వల్ల నీటి నిల్వను పెంచడం, జలక్రీడలు, మరియు బోటింగ్ సదుపాయాలకు ఉపయోగపడుతుంది. ఒబెర్ మేయర్ స్పిల్ వే గేట్ టెక్నాలజీ రూపొందించిన రబ్బర్ డ్యాం నమూనాను ప్రజా భవన్‌లో మంత్రులు ఆసక్తిగా తిలకించారు. నాసిక్, ముంబాయి నగరాల్లో ఈ టెక్నాలజీ సంస్థ నిర్మాణం చేసిన రబ్బర్ డ్యాంలను పరిశీలించి తగిన అధ్యయనం చేసిన తరువాత నివేధిక ఇవ్వాలని అధికారులను మంత్రులు అదేశించారు. ఈ సమవేశంలో మెట్రో పాలిటన్ ఏరియా అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, డిప్యూటి సిఎం సెక్రటరీ కృష్ణా భాస్కర్, వాటర్ బోర్డు ఎం.డి అశోక్ రెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# లేకుంటే నీటి ఉద్యమమే..

>> వస్తే హారతులు ఇచ్చి పూజలు చేయడం మానేసి పాలమూరు ప్రాజెక్టుకు ప్రత్యేక హోదా అడగాలని భారతీయ జనతా పార్టీ నాయకులను మరోవైపు డిమాండ్ చేశారు. ఇలా అన్ని పార్టీలకు సమన్యాయం చేస్తూ కవిత దుమ్ము దులిపేశారు. భారీ ఎత్తున జనం హాజరైన బహిరంగ సభలో ఆమె ముచ్చటగా మూడు పార్టీలను టార్గెట్ చేయడం విశేషం.

**పాలమూరు నుంచే పాదయాత్ర..**

లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించకుంటే పాలమూరు జిల్లాలో ఇక్కడి నుంచి తన పాదయాత్ర మొదలవుతుందని ఆమె హెచ్చరించారు. ముఖ్యమంత్రి కొడంగల్‌కు వచ్చి గొప్పలు పలుకుతున్నారని, అసలు పాలమూరు బిడ్డనని, నల్లమల పులిబిడ్డనని చెప్పుకునే ఆయన జిల్లాకు ఏం చేశారో చెప్పాలని నిలదీశారు. మహిళలకు తులం బంగారం ఇస్తామని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని చెప్పి బిచ్చగాళ్ళని చేశాడని ధ్వజమెత్తారు. తెలంగాణలో అత్యంత ఎత్తున ఉన్న లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ నింపితే రంగారెడ్డి జిల్లాలో నాలుగు లక్షల ఎకరాలకు, పాలమూరు జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉంటుందని, కానీ చుక్క నీరు లేకుండా చేసిన పాపం 12 ఏళ్లుగా పాలిస్తున్న ఆ రెండు ప్రభుత్వాలదేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. సాగునీటి విషయంలో ఎప్పటికప్పుడు కాలయాపన చేస్తున్న కాంగ్రెస్ పార్టీని కిలోమీటర్ గొయ్యి తీసి బొంద పెట్టాలని తీవ్రవాఖ్యలు చేశారు. 12 వేల కోట్ల బిల్లులు మోటార్లకు, పంపులకు కేటాయించామన్నారు.. మరి ఆ నిధులు ఏమయ్యాయని కాంగ్రెస్ పార్టీని ప్రశ్నించారు.

**అరుణమ్మా.. హారతులు వద్దు..**

ప్రధానమంత్రి ఈ నెల 10వ తేదీన తెలంగాణకు వస్తున్న నేపథ్యంలో పాలమూరు ఎంపీ అరుణమ్మ, అదేవిధంగా బిజెపి నాయకులు హారతులు ఇచ్చి పూజలు చేయడం మాని పాలమూరుకు ప్రత్యేక హోదా అడగాలని కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. లేదంటే పాలమూరు ప్రజలు పొలిమేర దాటేదాకా నిన్ను తరిమి కొడతారని హెచ్చరించారు.

# థాయిలాండ్‌లో కొత్త కరోనా వైరస్ గుర్తింపు

**బ్యాంకాక్, మే 8:** థాయిలాండ్ శాస్త్రవేత్తలు కొత్త కరోనా వేరియంట్‌ను గుర్తించారు. మనుషులకు సులువుగా ఈ వైరస్ సంక్రమించే ప్రమాదం ఉందని ఇటీవల జర్నల్‌సెల్‌లో ఈ పరిశోధన ఫలితాలనుప్రకటించారు. అయితే ఇప్పటికిప్పుడు మానవాళిలో ఈవైరస్ ఉందని చెప్పలేమని, ప్రస్తుతం జంతువుల్లో సోకిన వైరస్ వివరాలను పరికిస్తే రానున్న కాలంలో మానవాళికి సైతం సోకే ప్రమాదం ఉందని శాస్త్రవేత్తలు వెల్లడించారు. అంతర్జాతీయ పరిశోధకుల బృందం టోక్యో యూనివర్సిటీలో ఈపరిశోధనలు నిర్వహించారు. అనేక గబ్బిలాలనుంచి కరోనా వైరస్‌లను గుర్తించిన శాస్త్రవేత్తలు ఇవన్నీ థాయిలాండ్‌లో వ్యాప్తిలో ఉన్నట్లు వెల్లడించారు.

వీటిలో కొత్తగా గుర్తించిన వైరస్‌లు కొన్ని ప్రత్యేకపరిస్థితుల్లో మానవాళికి సైతం వేగంగా సోకే ప్రమాదం ఉందని వెల్లడించారు. కరోనా వైరస్‌కు సంబంధించిన వైరస్‌లాగే ఉందని కూడా వెల్లడించారు. కరోనా వైరస్‌ల సబ్‌గ్రూప్‌నే సార్బేకోనా వైరస్‌లని చెపుతుంటారు. సహజంగానే కొన్నివైరస్‌లు వన్యప్రాణుల్లో కొన్ని సంవత్సరాలనుంచి ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు.

ఆగ్నేయాసియాలో ఈ వైరస్‌లు ఎక్కువగా గబ్బిలాలనుంచి సోకకుతున్నట్లు తెలుస్తోంది. ప్రత్యేకించి థాయిలాండ్ లావోస్ ప్రాంతంలో ఈ కొత్త వైరస్‌లు ప్రభలుతున్నట్లు గుర్తించారు.



ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

epaper.vaartha.com WWW.VAARTHA.COM

వరంగల్ : fb.com/vaartha Digital

Published from Warangal, Karimnagar, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-5-2026 శనివారం సంపుటి: 32 సంచిక: 98 పేజీలు: 8+16 వెల: 6.50


హాంటా వైరస్.. చాలా సీరియస్!

కట్టుబాట్లను కాదని అక్కా తమ్ముళ్ల వివాహం

# అదే సస్పెన్స్!



## ఇంకా 2సీట్ల దూరంలోనే..

- అర్ధరాత్రి దాటేదాకా కొనసాగిన హైడ్రామా • విజయ్ ప్రమాణ స్వీకారానికి గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సాయంత్రం సమాచారం
- అంతలోనే ఇవ్వలేదంటూ వార్తలు • మెజారిటీ మార్కుకు సంఖ్య చేరలేదని వెల్లడి • ప్రమాణ స్వీకార కార్యక్రమం లేదని అర్ధరాత్రి ప్రకటన
- తాము మద్దతు ఇవ్వడంలేదన్న ఐయుఎంఎల్ • డిప్యూటీ సిఎం పదవి కావాలన్న విసికె
- గంటగంటకు మారిన రాజకీయంతో ఎడతెగని ఉత్కంఠ



శుక్రవారం సాయంత్రం చెన్నైలోని లోక్‌భవన్‌లో గవర్నర్ అర్లేకర్‌తో భేటీ అయిన టివికె చీఫ్ విజయ్, ఎమ్మెల్యేలు

**చెన్నై, మే 8:** తమిళనాట రాజకీయాలు గంటగంటకు మారిపోతున్నాయి. విజయ్‌కు మద్దతిస్తామని ప్రకటించిన చిన్నపార్టీలు ఇపుడు ముఖం చాటేస్తున్నాయి. మూడు పర్యాయాలు గవర్నర్‌ను కలిసిన విజయ్ తనకు మెజార్టీ ఉందని లేఖలు ఇచ్చినప్పటికీ గవర్నర్ సంతృప్తి ప్రకటించలేదు. మరో ఇద్దరు తక్కువగా ఉన్నారని, 118 మార్కు వచ్చిన తర్వాత మాత్రమే ప్రభుత్వం ఏర్పాటుకు ఆహ్వానిస్తామని లోక్‌భవన్ కార్యాలయం స్పష్టంచేయడంతో విజయ్ ప్రమాణస్వీకారం శనివారం దాదాపుగా లేనట్లేనని తేలిపోయింది. ముందుగా సిపిఐ, సిపిఎం పార్టీలు మద్దతిస్తామని ప్రకటించాయి. విజయ్‌నేరుగా ఆ పార్టీల కార్యాలయాలకు వెళ్లి వారిని కలిసారు. తాము బయటినుంచి మద్దతిస్తామని మతశక్తులు రంగప్రవేశం చేయనీయకుండా ఉండేందుకే టివికెకు మద్దతిస్తామని ఈ రెండుపార్టీలుప్రకటించాయి. అయితే తాము డిఎంకె కూటమిలోనే ఉంటామని చెప్పిన వామపక్షాలు టివికెకు బయటినుంచి మద్దతిస్తామని స్పష్టంచేసాయి. అలాగే మరో రెండుస్థానాలున్న విసికె కూడా మద్దతిస్తున్నట్లు ముందుప్రకటించి తర్వాత ముఖం చాటేసింది. అదేవిధంగా రెండుస్థానాలు గెలిచిన ఐయుఎంఎల్ కూడా తాము టివికెకు మద్దతివ్వడం లేదని ప్రకటించడంతో తమిళనాడు రాజకీయ స్వరూపం ఒక్కసారిగా మారిపోయింది. విసికె, ఐయుఎంఎల్‌పార్టీలు తమ >>2

# 'సర్'ను ఎదుర్కొందాం

## తెలంగాణలోనూ ఓట్లు తొలగించేందుకు పన్నాగం

### ఇసి చర్యలను ఐక్యంగా ప్రతిఘటిద్దాం

## సంక్షేమంలో మైనారిటీలకు తగిన వాటా ఇస్తున్నాం

### హజ్ యాత్రికుల బస్సుల ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే8:** రాష్ట్రంలో 'సర్' పేరుతో ఓట్లు తొలగించాలని చూస్తున్నారని, ఇతర రాష్ట్రాల్లో జరిగినట్లు మన రాష్ట్రంలో జరగనివ్వద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. మనందరం కలిసికట్టుగా దీనిని ఎదుర్కోవాలని కోరారు. నాంపల్లి హజ్ హౌజ్‌లో శుక్రవారం హజ్ యాత్రికుల బస్సుల ప్రారంభోత్సవంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. తొలుత మంత్రి అజారుద్దీన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్, టిజిఎంఆర్ఇఐఎస్ ప్రెసిడెంట్ ఫహీముద్దీన్ ఖురేషి, హజ్ కమిటీ చైర్మన్ గులామ్ అఫ్జల్ బియాబని, వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా హుస్సేనీ, టిజిఎంఎఫ్‌సి చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, ఉర్దూ అకాడమీ ప్రెసిడెంట్ తాహెర్ బిల్ హమద్, తదితరులు ముఖ్యమంత్రికి ఘన స్వాగతం పలికారు. అనంతరం హౌజ్ హౌస్ వద్ద హజ్ యాత్రికుల బస్సులను జెండా ఊపి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి >>2



శుక్రవారం కొడంగల్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన సిఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో మంత్రులు దామోదర, వాకిటి శ్రీహరి తదితరులు

## అభివృద్ధిలో కొడంగల్ అగ్రగామి

### తలమానికంగా లగచర్ల పారిశ్రామికవాడ : బహిరంగసభలో సిఎం రేవంత్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, మే 08, ప్రభాతవార్త :** అభివృద్ధిలో దేశంలోనే కొడంగల్ అగ్రగామిగా నిలుస్తోందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుతం శంకుస్థాపన చేసిన పనులను 2027 డిసెంబరు నాటికల్లా పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం మాదిరిగా కొడంగల్ శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయాన్ని రూ.110 కోట్లతో పునర్ నిర్మిస్తున్నామని చెప్పారు. శుక్రవారం పలు అభివృద్ధి పనులకుశంకుస్థాపన చేసిన అనంతరం బహిరంగసభలో సిఎం మాట్లాడారు. ఒకప్పుడు ఒక్క విద్యుత్ సబ్‌స్టేషన్ మంజూరు కోసం నానా తంటాలు పడ్డామని ఆయన గుర్తు చేశారు. ప్రస్తుతం సరిపడా కొత్త సబ్‌స్టేషన్‌లు మంజూరు చేసే అధికారం తమకు ఉందని స్పష్టం చేశారు. కొడంగల్ ప్రజల ఆశీర్వాదంతోనే ముఖ్యమంత్రి పదవి వరకు ఎదిగానని తెలిపారు. పేదల తిరుపతిగా పేరుగాంచిన కొడంగల్ వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు కోస్గిలో >>2



## పుదుచ్చేరి పీఠంపై మళ్లీ రంగస్వామి

### ఎన్‌డిఎ శాసనసభాపక్ష నేతగా ఎన్నిక



## బెంగాల్ సిఎంగా సువేందు

### నేడు కోల్‌కతాలో ప్రమాణం

### హాజరు కానున్న ప్రధాని, కేంద్రమంత్రులు

**కోల్‌కతా, మే 8:** అన్ని ఊహాగానాలకు తెరదించుతూ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి అభ్యర్థిగా సువేందు అధికారిని భారతీయ జనతా పార్టీ ఎంపిక చేసింది. శుక్రవారం కోల్‌కతాలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన బిజెపి శాసనసభా పక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సువేందు పేరు ప్రతిపాదనకు రాగా, కొత్తగా ఎంపికైన ఎమ్మెల్యేలు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతో పశ్చిమబెంగాల్ బిజెపి శాసనసభాపక్ష నేతగా సువేందు అధికారిని కేంద్రం హోం మంత్రి అమిత్‌షా ప్రకటించారు. 'కాబోయే సిఎం'గా సువేందును అభివర్ణించారు. సోనార్ బంగ్లా కలల సాకారానికి కొత్త ప్రభుత్వం పనిచేస్తుందని చెప్పారు. తృణమూల్ కాంగ్రెస్, లెఫ్ట్ పార్టీలను ఓడిస్తూ తీర్పునిచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. బెంగాల్ ఎన్నికల్లో పలు బెదిరింపుల, >>2

# మూసీ.. మన బాధ్యత

### నదీ పునరుజ్జీవమంటే ప్రక్షాళన కాదు.. సామాజిక బాధ్యత

### పరీవాహక ప్రాంత జీవన ప్రమాణాలు మెరుగుపడాలి

### 5 దశల్లో 55 కి.మీ మేర అభివృద్ధి పనులు

### కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిసిఎం భట్టి



శుక్రవారం ప్రజాభవన్‌లో జరిగిన మూసీ పునర్జీవ ప్రాజెక్టు కేబినెట్ సబ్‌కమిటి సమావేశంలో డి.సిఎం భట్టి, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే8:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మక లక్ష్యంతో చేపట్టిన మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్టు కేవలం ఒక నది ప్రక్షాళన మాత్రమే కాదు, అది ఒక సామాజిక బాధ్యత అని కేబినెట్ సబ్ కమిటీ స్పష్టం చేసింది. అభివృద్ధి అంటే మనుషులను దూరం చేయడం కాదు, వారిని భాగస్వాములను చేయడమేనని చాటిచెబుతూ అధికారులకు కీలక మార్గదర్శకాలను జారీచేసింది. ప్రజల్లో ఉన్న ప్రతి అనుమానాన్ని నివృత్తి చేసి, వారిలో పూర్తి స్థాయి విశ్వసనీయత కల్పించేలా అధికారుల కార్యాచరణ ఉండాలని సబ్ కమిటీ ఆదేశించింది.ప్రాజెక్టు రూపకల్పనలో భాగంగా ఇప్పటికే ఉన్న నిర్మాణాలపై అతి తక్కువ ప్రభావం పడేలా ఆలైన్ మెంట్‌ను మార్చుకోవాలని కమిటీ సూచించింది. మూసీ పునరుజ్జీవనం ద్వారా నగరం >>2



శుక్రవారం జిల్లేడు చౌదరిగూడా బహిరంగ సభలో మాట్లాడుతున్న కవిత

## దసరా దాకా టైం.. లేకుంటే నీటి ఉద్యమమే..

- సిఎంకు టిఆర్ఎస్ చీఫ్ కవిత వార్నింగ్.. • ప్రధాని మోడీకి హారతులు ఇవ్వడం కాదు.. పాలమూరుకు ప్రత్యేక హోదా అడగాలని డిమాండ్

**జిల్లెడు చౌదరిగూడ, షాద్‌నగర్, మే 08,(ప్రభాతవార్త):** రేవంత్ రెడ్డీ.. నీకు నాలుగు నెలలు టైం ఇస్తున్నాను.. దసరా కల్లా లక్ష్మీదేవి పల్లి రిజర్వాయర్ పనులు పూర్తి కావాలి.. లేదంటే మరో నీటికి ఉద్యమం మొదలవుతుంది.. అది ఇక్కడి నుంచే ప్రారంభమవుతుంది.. అంటూ టిఆర్ఎస్ అధినేత కవిత లక్ష్మీదేవి పల్లి వేదిక దగ్గర నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఘాటుగా హెచ్చరించారు. శుక్రవారం జిల్లేడు చౌదరి గుడా మండలంలో జరిగిన బహిరంగసభలో ఆమె మాట్లాడుతూ పదేళ్ల బీఆర్ఎస్, రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ వేల కోట్లు ఖర్చు చేస్తున్నామని చెప్తున్నారు తప్ప ఎకరా పొలానికికూడా నీరు ఇవ్వలేకపోతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధానిమోడీ తెలంగాణకు >>2

## హైదరాబాద్‌లో ఘాతుకం



హత్యకు గురైన తనూజ (ఫైల్)


# మాజీ పోలీసు అధికారి భార్య దారుణ హత్య

### జూబ్లీహిల్స్‌లో నేపాలీ గ్యాంగ్ కిరాతకం

### ఇంట్లో పనిమనిషే సూత్రధారి

### ఘటనా స్థలం పరిశీలించిన డిజిపి, ఇతర ఉన్నతాధికారులు

### నిందితులకోసం గాలిస్తున్న పోలీసు బృందాలు



నిందితురాలు కల్పన

**జూబ్లీహిల్స్, మే 8, ప్రభాతవార్త:** మాజీ అదనపు డిజిపి వినయ్ రంజన్ రే భార్య తనూజ రంజన్(62) దోపిడి దొంగల ముఠా చేతిలో దారుణహత్యకు గురయ్యారు. ఇంట్లో పనిచేస్తున్న నేపాలి పనిమనిషి సూత్రధారిగా మొత్తం నలుగురి ముఠా అర్ధ రాత్రి దాటిన తరువాత ఈ ఘాతుకానికి పాల్పడింది. ఇంట్లోని బంగారు ఆభరణాలు, డబ్బుతో ఈ ముఠా పరారైంది. సంఘటన వివరాల్లోకి వెళితే.. జూబ్లీహిల్స్ ప్రశాసన్‌నగర్ రోడ్ నంబరు 7లోని ప్లాట్ నంబరు 46లో మాజీ అదనపు డిజిపి వినయ్ రంజన్ రే తన భార్య, ఇద్దరు కుమార్తెలతో >>2



శుక్రవారం మాజీ పోలీసు అధికారి వినయ్ రంజన్ నివాసంలో పరిశీలన జరుపుతున్న డిజిపి ఆనంద్, సిపి సజ్జనార్ , డిజి మహేష్ భగవత్

## హైదరాబాద్ చేరిన తమిళనాడు ఎమ్మెల్యేలు

### చివరి నిమిషంలో కాంగ్రెస్ క్యాంప్ రాజకీయం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,మే8:** తమిళనాడులో ప్రభుత్వ ఏర్పాట్లపై కొనసాగుతున్న ఉత్కంఠ ఇప్పుడు తెలంగాణ గడ్డకు చేరింది. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ సమీకరణాల నేపథ్యంలో. తమ ఎమ్మెల్యేలను కాపాడుకునేందుకు తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అప్రమత్తమైంది. ఇందులో భాగంగా ఆ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలందరినీ ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. తమిళనాడులో కొత్త ప్రభుత్వం కొలువుదీరే వరకు ఈ ఎమ్మెల్యేందరూ హైదరాబాద్‌లోని ఒక ప్రముఖ రిసార్ట్‌లో బస చేశారు. ఇప్పటికే నటుడు విజయ్ నేతృత్వంలోని టీవీకే పార్టీకి కాంగ్రెస్ అధికారికంగా మద్దతు ప్రకటించింది. తమిళనాడులో మెజారిటీ నిరూపించుకోవడానికి ఒక్కో ఎమ్మెల్యే మద్దతు అత్యంత కీలకంగా మారింది. ఈ క్రమంలో ఇతర పార్టీలు తమ ఎమ్మెల్యేలకు గాలం వేసే అవకాశం ఉందన్న ఆందోళనతో కాంగ్రెస్ అధిష్ఠానం ఈ క్యాంప్ రాజకీయం మొదలు పెట్టింది. ప్రస్తుతం తమిళనాడులో ఏ పార్టీకి స్పష్టమైన మెజారిటీ లేకపోవడం, ఐయుఎంఎల్ వంటి పార్టీలు మద్దతు ఉపసంహరించుకోవడం వంటి పరిణామాలతో కాంగ్రెస్ జాగ్రత్త పడుతోంది. విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కావడానికి అవసరమైన సంఖ్యా బలాన్ని కాపాడుకోవడమే లక్ష్యంగా ఎమ్మెల్యేలను ఇక్కడికి తరలించినట్లు సమాచారం. లోక్‌భవన్‌లో ప్రభుత్వ ఏర్పాటు ప్రక్రియ పూర్తి అయ్యి, బలపరీక్ష ముగిసే వరకు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు హైదరాబాద్‌లోనే ఉంటారని తెలుస్తోంది.

## రెండు రోజులు పిడుగుల వానలు

### హెచ్చరించిన వాతావరణ కేంద్రం

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:**ద్రోణి ప్రభావంతో రానున్న రెండు రోజులపాటు (శని, ఆదివారం) రాష్ట్రంలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పిడుగులు పడే ప్రమాదం ఉందని హెచ్చరించింది. గంటకు 40 నుండి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ద్రోణి ప్రస్తుతం మధ్యప్రదేశ్‌లోని నైరుతి ప్రాంతం నుండి విదర్భ, మరత్వాడ, అంతర్గత కర్నాటక, రాయలసీమ, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు సగటు సముద్రమట్టం నుండి 0.9 కి మీ ఎత్తులో కొనసాగుతోందని వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు రోజులపాటు వర్షాలతోపాటు పిడుగులు పడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణశాఖ అధికారులు సూచించారు. వర్షాల సమయంలో చెట్ల కింద నిలబడొద్దని, అవసరం లేకుంటే బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు. పంటల సంరక్షణ విషయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని రైతులకు సూచించారు. ఇక.. రానున్న మూడు రోజుల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు ఇంచుమించు ఇదే స్థాయిలో కొనసాగే అవకాశంఉంది. ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, నిజామాబాద్, కొమురంభీం జిల్లాల్లో దాదాపు నలభైఐదు డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కావొచ్చని వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 12న ఉమ్మడి నల్గొండ, ఖమ్మం మినహా మిగతా జిల్లాల్లో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు అవుతాయని హెచ్చరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఎండ వేడి దృష్ట్యా ప్రజలు వీలైనంత వరకు మధ్యాహ్నం వేళలో బయటకు రావొద్దని సూచించింది.



శుక్రవారం తుమ్మిడిహెట్టి వద్ద జలహారతి ఇస్తున్న మంత్రులు జూపల్లి, వివేక్ తదితరులు

# తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజి తథ్యం

- గ్రావిటీ ద్వారానే పొలాలకు నీరు • మహారాష్ట్రలో ముంపు ప్రభావం 5 వేల ఎకరాలే • కేంద్రం తెలంగాణ రైతులకు చేయూతనివ్వాలి
- ప్రాజెక్టు స్థలాన్ని పరిశీలించిన మంత్రులు జూపల్లి, వివేక్

**హైదరాబాద్/ కౌటాల, మే8, ప్రభాతవార్త;** గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు మళ్లించి రైతులకు తీరని అన్యాయం చేసిందని మంత్రులు జూపల్లి కృష్ణారావు, వివేక్ వెంకటస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. తుమ్మిడిహెట్టి వద్ద 150 నుంచి 152 మీటర్ల ఎత్తులో బ్యారేజీని నిర్మించడం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. మహారాష్ట్ర అనుమతితోనే పూర్తిస్థాయిలో ప్రాజెక్టు నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. 152 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మిస్తే మహారాష్ట్రలో కేవలం 5 వేల ఎకరాలు మాత్రమే ముంపుకు గురయ్యే అవకాశముందని తేల్చి చెప్పారు. అయినప్పటికీ గత బీఆర్ఎస్ ప్రభుత్వం కేవలం >>2

వార్త

మూర్ఖుని హృదయం నాలుక మీద ఉంటుంది. వివేకవంతుని నాలుక హృదయంలో ఉంటుంది.

న- ఫ్రాంక్లిన్

# 'కడగండ్ల సాగు'

మానవుడు ఎంత సాంకేతిక పరిజ్ఞానం సంపాదించినా, ఇతర రంగాల్లో మరింత అభివృద్ధి సాధించినా ప్రకృతి ముందు తలవంచని పరిస్థితుల నుండి బయటపడలేకపోతున్నాడు. లేకుంటే ఏమిటి? తీవ్రమైన ఎండలతో అల్లాడుతూ గుక్కెడు మంచినీటి కోసం ఎదురుచూస్తూ ఎండవేడిమిని తట్టుకోలేకదేశ వ్యాప్తంగా ఎందరో ప్రజలు పరలోకానికి పయనం కడుతుంటే మరొకపక్క అకాల వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితి మరింత క్లిష్టంగా తయారవుతున్నది. కొన్ని జిల్లాల్లో ఏకంగా నలభైఆరు డిగ్రీలు దాటినట్టు వార్తలు అందుతున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఎలా ఉంటుందోనని వాతావరణ శాస్త్రజ్ఞులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇలాంటి ఉపద్రవాలు సంభవించిన ప్పుడు వ్యవసాయరంగానికి అపార నష్టం జరుగుతు న్నది. ఈదురుగాలులతో కూడిన అకాల వర్షాల వల్ల తెలంగాణలో ఆరుగురు అన్నదాతలు మృతిచెందినట్లు సమాచారం. అర్ధరాత్రి ఆకస్మికంగా ఉరుములు, మెరుపులతో, ఈదురుగాలులతో కురిసిన వర్షానికి మంచిర్యాల జిల్లా లక్సెటిపేట మండలం గంపలపల్లి గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు నాగయ్య, అభిరాంలు ధాన్యం కుప్పపై టార్పలేన్ కప్పేందుకు వెళ్లి అసువులు బాశారు. మరో రైతు ధాన్యం కుప్పల వద్దనే కాలం చేశాడు. ఈ అకాల వర్షాలు రైతులను కోలుకోకుండా చేస్తున్నాయి. ప్రస్తుతం యాసంగి వరి కోతలు ముమ్మరంగా సాగుతున్న ఈ సమయంలో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కుప్పలు కుప్పలుగా పేరుకుపోయాయి. కిలోమీటర్ల కొద్దీ రోడ్లపక్కనే పోసి కొనేవారి కోసం ఎదురు చూస్తున్నారు. ఎందుకోఏమో కానీ రైతు పచ్చగా ఉంటే చూసి ఓర్వలేక పగబట్టి పిచ్చిబట్టి పంతం పూని ప్రకృతి దెబ్బమీద దెబ్బకొడుతున్నట్లుగా ఉంది. ఈసారి జనవరి, ఫిబ్రవరి నుండే ఈ అకాలవర్షాల దాడిఆరంభమైందనే చెప్పొచ్చు. ఇప్పుడు, అప్పుడు అని కాదు. ఎప్పుడు పడితే అప్పుడు అకాల వర్షాలు రైతులపై విరుచుకుపడుతున్నాయి. కలియుగం అంటే ఇదే కాబోలు. మనుషులతోపాటు కాలం కూడా మారిపోతున్నదేమోననిపిస్తున్నది. రుతువులను బట్టి కాలాలు, వాటి అనుగుణంగా సాగు చేయాల్సిన పంటలను దృష్టిలో ఉంచుకొని విధి విధానాలను రూపొందించుకుంటారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూపొందిస్తున్న వ్యవసాయ ప్రణాళికలు, పథకాలు వీటికి తగి నట్లుగానే తయారు చేస్తారు. రైతులు తమ అనుభవాలను బట్టి ఏయే పంటలు ఎప్పుడు వేయాలో ముందే ప్రణాళిక వేసుకుంటారు. ఈ ప్రణాళికలన్నీ ఆయా రుతువులను బట్టి రూపొందించుకుంటారు. ఒక రకంగా చెప్పాలంటే రైతుల జీవన విధానం రుతుపవనాల మీదనే ఆధారపడి ఉంది. ఇప్పటికీ భారతదేశంలో అరవై శాతం మందికిపైగా రైతులు ఈ రుతువుల పైనే ఆధారపడి వ్యవసాయం చేస్తున్నారు. ఇక సుడిగుండాలు, వాయుగుండాలు, తుఫానులు ఏర్పడడం కొత్తకాదు. వాటి వల్ల వర్షాలు కురవడం, జనజీవనాన్ని అతలాకు తలం చేయడంవంటివి రైతులకు తెలియని కావు. ఇదంతా ఖరీఫ్ సీజన్‌లో మాత్రమే జరుగుతుండడం సర్వసాధారణం. అలాగే రబీసీజన్‌కు సంబంధించి కూడా వేసవిలో మే చివరి వారంలో రోహిణికార్తె ముందో వెనుకో వడగండ్ల వానలు, గాలిదుమారాలు వచ్చి పంటలను నష్టం చేయడం విన్నాం, కన్నాం. అందుకే పంటలు మే రెండు వారానికి ఇంటికి చేర్చుకునే విధంగా రైతులు ప్రణాళికలను తయారు చేసుకుంటారు. ఇటు వ్యవసాయశాఖ కానీ, అటు నీటిపారుదలశాఖ కానీ అందుకు అనుగుణంగానే కార్యాచరణ రూపొందిస్తాయి. కానీ ఇప్పుడు అకాల వర్షాలు ఎప్పుడుపడితే అప్పుడు రావడంతో వారికి కూడా అంతుపట్టకుండాపోతున్నది. ఈ అకాల వర్షాలు ఒక్క తెలంగాణ జిల్లాలోనే కాదు, అటు ఆంధ్రప్రదేశ్ ఆ మాట కొస్తే దేశవ్యాప్తంగా కూడా విరుచుకుపడుతున్నాయి. ఇందుకు పాలకులు కూడా సమర్థ ప్రణాళికతో రైతులను ఆదుకునేందుకు అడుగులు వేయడం లేదేమోననిపిస్తున్నది. ముఖ్యంగా కొనుగోళ్ల విషయంలో పాలకులు చేస్తున్న నిర్లక్ష్యం రైతులకు మరింత కడగండ్లు వస్తున్నాయి. తెలం గాణలో వరిసాగు ఎంత జరిగిందో, ఎన్ని లక్షల టన్నుల దిగుబడి వస్తుందో అధికారవర్గాలకు తెలియంది కాదు. కానీ కొనుగోలుకు అందుకు తగినట్టుగా ప్రణాళికలు చేసుకోక పోవడం వల్లనే పరిస్థితి మరింత క్లిష్టంగా మారి రైతుల వ్యధ అరణ్యరోదనంగా మారిపోతున్నది. వరి పంటే కాదు, మొక్కజొన్న రైతుల పరిస్థితి కూడా ఇందుకు భిన్నంగా లేదు. రోడ్లపైనే ఎండబోసుకొని, ఎప్పుడు కొంటారా అని కొనేవారి కోసం ఎదురుచూడా ల్సిన దుర దృష్టపు పరిస్థితులు నెలకొన్నాయి. రాత్రిపగలు కాపలా ఉండాల్సి వస్తున్నది. ఈ బాధలు భరించలేక ప్రైవేట్ వ్యాపారులో ఏదో ఒక ధరకు తెగనమ్ముకుంటు న్నారని వెళ్లిపోతున్నారు. ఇక మామిడి తోటల రైతుల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. కరోనా ప్రభావంతో లాక్‌డౌన్ ప్రకటించడంతో దాదాపు రెండేళ్లపాటు మామిడి పంటలను అమ్ముకోలేక రోడ్లపై పారబోయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇప్పుడు ఈ అకాల వర్షాలు, వడగండ్లు కోలు కోకుండా చేశాయి. ఇప్పటికే కొందరు మామిడి రైతులు తమ తోటలను నరికివేస్తున్నారు. ఇలాగే పరిస్థితి కొన సాగితే మామిడికి తిలోదకాలిచ్చే పరిస్థితులు ఇంకెతో దూరం లేదని చెప్పొచ్చు. కోట్లాది మంది రైతు కుటుంబాల జీవనోపాధికి సంబంధించిన వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం సమంజసంకాదు. నిరంతరం రాజకీయ వ్యూహ, ప్రతివ్యూహాలు, ఎత్తులు, పై ఎత్తులతో కాలం గడపకుండా రైతుల సంక్షేమం కోసం త్రికరణశుద్ధిగా కృషి చేయాల్సిన తరుణమిది.

# మాటలు దాటని 'అవినీతి వేటు'

**అప్పులు తెచ్చుకున్న నిధులు అవినీతిపరుల పాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. వారుతెచ్చిన, తెస్తున్న లక్షలాది కోట్ల రూపాయల అప్పులో వడ్డీతోసహా ప్రతిపైసా ప్రజలే చెల్లించాలనే వాస్తవాన్ని పాలకులు విస్మరించరాదు. చీకట్లో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతేపోయారు. ప్రజల కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతినైనా నియంత్రించకపోతే అప్రతిష్టపాలవు తారు. పాలకులు ఈ విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాన్యులు ప్రతిచిన్న విషయానికి ఆఫీసుల చుట్టూతిరగకుండా చూడగలిగితే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. పారదర్శకతను మరింత పెంచితే అవినీతిని కొంత అదుపు చేయవచ్చు. అవినీతిని నియం త్రించకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పుతెచ్చినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని వేల కోట్ల రూపాయలు వసూలు చేసినా, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.**

దామెర్ల సాయిబాబ

శతకోటి దరిద్రాలకు అనంతకోటి ఉపాయాలంటారు. అవినీతిని అరికట్టేందుకు ఎన్ని చట్టాలు చేస్తున్నా, మరెన్ని చర్యలు తీసుకుంటున్నా ఏదో ఒక రూపంలో అవినీతి పెరుగుతున్నదే తప్ప తగ్గడం లేదు. పాలకులు ఎంతగా అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు చేపట్టేకొద్దీ అవినీతి అంతగా పెరిగిపోతున్నది. అవినీతి, అభివృద్ధి కలిసి పయనించలేవు. అభివృద్ధి ముందుకు అడుగు వేస్తుంటే అవినీతి వెనక్కి గుంజుతుంటుంది. దేశవ్యాప్తంగా అవినీతిని అరికట్టేందుకు కేంద్ర పాలకులు పెద్ద ఎత్తునే చర్యలు చేపడుతున్నట్లు చెబుతున్నా క్షేత్రస్థాయిలో వాస్తవాలు వేరుగా ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. అవినీతి రక్కసిని అదుపు చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలుగు రాష్ట్రాల నేతలు ప్రకటనల మీద ప్రకటనలు గుప్పిస్తున్నారు. అవినీతిని కూకటి వేళ్లతో పెకిలించివేసేందుకు నడుం బిగించినట్లు చెప్పుకుంటున్నారు. అవినీతి రకరకాలుగా విస్తరిస్తున్నది. అందులో ఒక రకం మూడో మనిషికి కనపడదు. ఇచ్చిపుచ్చుకునే చేతులురెండూ అదృశ్యంగానే ఉంటాయి. ఆ అదృశ్యహస్తాలు మూడో నేత్రానికి దృశ్యమానమయ్యే అవకాశం ఉండదు. సమయం, సందర్భాన్ని బట్టి వదంతులు, ఆరోపణలు, నిజానిజాలు, వ్యక్తిగత గుణగణాలను బట్టి, ప్రస్తుత పరిస్థితులను బట్టి, వనరుల తాహతును బట్టి ఎవరికి వారు ఊహాజనితమైన నిర్ణయానికి రావాల్సిందే. అంతేకానీ అది ఫొటోలతోనో, ప్రత్యక్ష సాక్షులతోనో రుజువు చేయడం సామాన్యులకు సాధ్యమయ్యే పనికాదు. లంచాలు ఇచ్చినవారు తాము ఇచ్చినట్లు చెప్పరు. తీసుకున్నవారు తాము తీసుకున్నట్లు చెప్పరు. ఎవరైనా ఆరోపించినా ఇద్దరూ కలిసి ఖండిస్తారు. ఈ అవినీతి అరికట్టడానికి అధికారగణం కొంత కష్టపడాల్సి ఉంటుంది. కానీ మరో రకం అవినీతి బాహాటంగా, ప్రజల ముందు వికృతరూపం ధరించి నాట్యం చేస్తున్నా పాలకులు పట్టించుకోకపోవడం దురదృష్టకరం. ఈ అవినీతే ప్రభుత్వాన్ని అప్రతిష్టపాలు చేసేది. గతంలో పాలించిన నేతలు కొందరు ఇలా అప్రతిష్టపాలైన విషయం అందరికితెలిసిందే. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే ఏ పాలకులైనా వారి చెంతనే చేరిపోతారు. ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో కొన్ని ప్రభుత్వ విభాగాల్లో ఈ అవినీతి అదుపులేకుండాపోతున్నది. ప్రభుత్వం నిబంధనలు విధించే కొద్దీ, చట్టాలు మార్చే కొద్దీ కొత్త పథకాలు ప్రవేశపెట్టే కొద్దీ వాటిని ఎలా లాభదాయకంగా మార్చుకోవాలనే విషయంలో కొందరు అధికారులు ఆరితేరిపోతున్నారు. ప్రధానంగా రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్, పోలీసు, వైద్య ఆరోగ్య వంటి ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్న శాఖల్లో అవినీతి పెరగడం ప్రభుత్వానికి అప్రతిష్ట తెచ్చిపెడుతున్నది. దీనికి తగ్గట్టుగా పాలకుల్లో కొందరు ఈ విషయంలో మాటలు చెప్తున్నారే తప్ప చేతల్లో నిక్కచ్చిగా వ్యవహరించకపోవడం వల్ల ఈ అవినీతిపరులకు అడ్డూ అదుపు లేకుండాపోతున్నది. దిగజారుతున్న ఈ మానవ విలువల పరిస్థితుల పట్ల నిజాయితీపరులైన అధికారుల వేదన మౌన రోదనగా మిగిలిపోతున్నది. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అవినీతి నిరోధకశాఖ అంటూ నిఘా, తనిఖీ విభాగాలు పెంచుకుపోతున్నారే తప్ప అక్కడ సమర్థులు, అంకితభావం కలిగిన అధికారులను నియమించడంలో విఫలమవుతున్నారే మోననిపిస్తున్నది. ఒకవేళ అక్కడక్కడ


## ఒక్క మాట

నియమించినా వారిని స్వతంత్రంగా వ్యవహరించనీయకుండా కొందరు నేతలు మోకాలొడ్డుతున్నట్లు కూడా ఆరోపణలున్నాయి. అన్నింటికంటే ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో లక్షలాదిమంది రైతులు భూసంబంధమైన చిన్నచిన్న సమస్యల పరిష్కారం కోసం ఏళ్లతరబడి రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ప్రభుత్వం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాలకు ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి తమ బాధలను లిఖిత పూర్వకంగా అందచేసుకుంటున్నారు. అయినా ఫలితం లేకుండా పోతున్నది. ఎక్కడికి వెళ్లి రైతులను కదలించినా రైతులు తమ బాధలను కథలుకథలుగా చెప్పుకుంటున్నారు. ఒక్క రెవెన్యూ శాఖలోనే కాదు మిగిలిన శాఖల్లో కూడా పరిస్థితి ఇందుకు భిన్నంగా లేదు. చివరకు ప్రాణాలు కాపాడాల్సిన వైద్యరంగంలో కూడా ఈ పరిస్థితి పరాకాష్ఠకు చేరింది. ధర్మాస్పత్రుల్లో ఉచిత చికిత్స కరవైపోతున్నది. కొన్ని ఆస్పత్రుల్లో చివరకు శవాన్ని అప్పగించేందుకు కూడా డబ్బులు డిమాండ్ చేసి వసూలు చేసుకుంటున్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ కార్య క్రమాల్లో అవినీతి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పేదలకు ఇచ్చే ఎన్ని లక్షల బోగస్ రేషన్ కార్డులు అనర్హుల చేతుల్లో ఉన్నాయో చెప్పలేం. పాలకులకు తెలిసినా వాటిని తొలగించలేని నిస్సహాయక స్థితి. అదేకాదు కరవులు వచ్చినా, వరదలు వచ్చినా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా అవినీతిపరుల పాలిట కల్పతరువుగా మారుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఉన్నారు. ఊదురుగొట్టం వాడు ఊదుతూ ఉంటే చల్లార్పుగొట్టం వాడు చల్లార్పుతున్నట్లు లంచగొండి అధికారులను వలవేసి పట్టుకుంటున్నా, కేసులు పెడుతున్నా చట్టంలో ఉన్న లొసుగులుతోనో, రాజకీయ పలుకుబడితోనో కేసుల నుండి బయటపడి పాతమార్గంలోనే పయనిస్తున్నారు. రాజకీయ అండ ఉంటే ఎంతటి అవినీతికి పాల్పడినా తమకు ఎలాంటి ఇబ్బందులు ఉండవనే ధైర్యం ఈ లంచగొండి అధికారుల్లో పెరిగిపోతున్నది. అవినీతి నిరోధక శాఖ అధికారులు కూడా చిన్నచిన్న ఉద్యోగులనే వలవేసి పట్టు కుంటున్నారే తప్ప 'పెద్ద చేపల' జోలికి వెళ్లే సాహసం చేయడం లేదనే విమర్శలను కొట్టివేయలేం. అందుకు వారికి ఉన్న ఇబ్బందులు వారికి ఉన్నాయి. ఈ అవినీతిని నియంత్రించాలన్న చిత్తశుద్ధి పాలకులకు ఉంటే ఉన్నత స్థాయి నుంచే ప్రక్షాళన ప్రారంభించాలి. పెద్దపెద్ద పదవుల్లో కీలక స్థానంలో ఉన్న ఒకరిద్దరు అధికారులు, రాజకీయ నేతలను కట్టడి చేయగలిగితే కిందిస్థాయిలో కొంత జంకు ఏర్పడుతుంది. గతంలోఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాజకీయ అవినీతి అరికట్టేందుకు ఒక ప్రయత్నం జరిగింది. ఆ ప్రభావం కొంతకాలం కిందిస్థాయి వరకు కొనసాగింది. ఇంతకుముందు అవినీతి లేదని కానీ కొత్తగా వచ్చిందని కానీ చెప్పడం లేదు. పెరిగిపోతుండటంతోనే ఆందోళన వ్యక్తమవుతున్నది. మరొకపక్క తెలుగు రాష్ట్రాల ఆర్థిక పరి స్థితి అంతంత మాత్రంగానే ఉంది. ఉద్యోగులకు నెలనెలా జీతభత్యాలు చెల్లించేందుకే నిధులు వెతుక్కోవాల్సిన పరిస్థితి. పిట్టను కొట్టా పొయ్యిలో పెట్టా అన్నట్టుగా ఉంది. మరొక పక్క ఇప్పటికే లక్షలాది కోట్ల రూపాయలు అప్పులు తెచ్చారు. వేలాది కోట్ల రూపాయలమేర వడ్డీ చెల్లిస్తున్నారు. ఇలా అప్పులు తెచ్చుకున్న నిధులు అవినీతిపరుల పాలుకాకుండా చూడాల్సిన బాధ్యత పాలకులపై ఉంది. వారుతెచ్చిన, తెస్తున్న లక్ష లాది కోట్ల రూపాయల అప్పులో వడ్డీతోసహా ప్రతిపైసా ప్రజలే చెల్లించాలనే వాస్తవాన్ని పాలకులు విస్మరించరాదు. చీకట్లో మూడోకంటికి తెలియకుండా జరుగుతున్న అవినీతిని అరికట్టలేకపోతేపోయారు. ప్రజల కళ్లముందు బాహాటంగా జరుగుతున్న అవినీతినైనా నియంత్రించకపోతే అప్రతిష్టపాలవుతారు. పాలకులు ఈ విషయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి సామాన్యులు ప్రతిచిన్న విషయానికి ఆఫీసుల చుట్టూ తిరగకుండా చూడగలిగితే చాలా వరకు సమస్యలు పరిష్కారమవుతాయి. పారదర్శకతను మరింత పెంచితే అవినీతిని కొంత అదుపు చేయవచ్చు. అవినీతిని నియంత్రించకుండా ఎన్ని లక్షల కోట్లు అప్పుతెచ్చినా పన్నుల రూపేణా ప్రజల ముక్కుపిండి ఎన్ని వేల కోట్ల రూపాయలు వసూలు చేసినా, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినా ఆశించిన ఫలితాలు చేకూరవు.



లోకులు తొందరగా నిందిస్తారు. అంతే త్వరగా అభినందిస్తారు కూడా. అందువల్ల ఇతరులు నిన్ను గురించి అనుకునే మాటలకు అంత విలువ ఇవ్వొద్దు.

రామకృష్ణ పరమహంస



జీవితంలో విజయాలకు చాలా ఉపాయాలున్నాయి. కానీ మనం 'పని' చెయ్యనిదే అవి పనిచేయవు.

షేక్స్పియర్

## ప్రజావాక్కు



### వెంకన్న ఆస్తిలో సగం ఇవ్వాలి

నిన్న కర్ణాటకలో తొమ్మిదేళ్ళ అమ్మాయిని వెంకటేశ్వర స్వామి బొమ్మకు ఇచ్చి పెళ్లిచేశారు. పెళ్లి అయిన అమ్మాయికి భర్త ఆస్తిలో సగం వాటా రావాలి కదా!కనుక ఆ బాలికకు వేంకటేశ్వర స్వామికి ఉన్న వేలకోట్ల ఆస్తిలో సగం వాటా ఇవ్వటం న్యాయబద్ధం. 1970 దశకంలో ప్రకాశం జిల్లాలో బండ్లమ్మ అనే ఒక దొంగ మాత కూడా వెంకటేశ్వర స్వామిని పెళ్లి చేసుకొన్నది. తరువాత గర్భం వస్తె తీసి వేయించుకున్నది అని కూడా ఆరోజుల్లో పెద్ద ప్రచారం జరిగింది. టీటీడీ వారు ఈ విషయం పై స్పందించాలి. ఎవరంటే వారు ఇలా వెంకన్నను పెళ్లి చేసుకుంటే వెంకన్న పరువు పోదా!కనుక టీటీడీ వారు స్పందించాలి. వాటా అయినా ఇవ్వాలి లేదా ఇలాంటివి చెయ్యకూడదు , మా స్వామికి ఎలాంటి బాధ్యత లేదు అని ఐనా ప్రకటించాలి. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ప్రభుత్వాలు బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.

- నార్నె వెంకటసుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### పెరుగుతున్న వాయుకాలుష్యం

పట్టణాలు నగరాల్లో రోజురోజుకు పెరుగుతున్న వాయు, ధ్వని, నీటి, ఆహారకాలుష్యం ప్రాణాంతకమవుతున్నాయి. పెరుగుతున్న నగరజనాభాతోపాటు విపరీతంగా పెరుగుతున్న ప్రాణాంతక జబ్బులకు కారణం కాలుష్యంవాహనాలు వాయు కాలుష్యానికి ముఖ్యకారణం. దానికి తోడు వాహనాల నుండి విడుదల అయ్యేపొగ మీద సరైన నియంత్రణ లేకపోవడం.. వీధుల్లో వ్యర్థాలను తగులబెట్టడం మరో ముఖ్యమైన కారణం. పబ్లిక్ స్థలాల్లో ధూమపానం కూడా ఒకటి. మన భాగ్యనగరం కూడా ఢిల్లీతో కాలుష్యంలో పోటీ పడుతోంది. వాయు నాణ్యత నగరంలో విపరీతంగా పడిపోతుంది.

- టి. మురళీమోహన్, హైదరాబాద్

### పదవులు కల్పించాలి

2026-2027విద్యాసంవత్సరంలో నూతనవిద్య సంస్కరణలో భాగంగా 1 వ తరగతి నుండి 12 వ తరగతి వరకు ఒకే గొడుగు కిందికి తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తుంది. ఈసందర్భంగాతెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేత నియమించబడిన అన్నిరకాల జూనియర్ లెక్చరర్స్ కు గెజిటెడ్ హోదా కల్పించి 11 వ తరగతి మరియు 12 వ తరగతి క్లాసులను బోధించే విధంగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ ఆదేశాలు జారీ చేయాలి.

-రాపాక రవీందర్, జనగాం

### ప్లాస్టిక్ రహిత సమాజం సాధ్యమేనా?

ప్లాస్టిక్ రహిత సమాజం దిశగా అడుగులు వేయడం ప్రస్తుత కాలంలో అత్యవసరమైన కర్తవ్యం. మానవ నిర్మిత ఆవిష్కరణలలో ప్లాస్టిక్ అత్యంత ప్రమాదకరమైనదిగా మారింది. వాడుకలో సౌలభ్యంకోసం మనంవినియోగించే ప్లాస్టిక్ సంచులు, కప్పులు, సీసాలు భూమిలోకలిసిపోవడానికి వందల సంవత్సరాల సమయం పడుతుంది. ఈ విచ్చలవిడి వినియోగం పర్యావరణ వ్యవస్థను అతలాకుతలం చేస్తోంది. నగరాలలో మురుగునీటి కాలువలు పూడిపోవడానికి ప్లాస్టిక్ వ్యర్థాలే ప్రధాన కారణం. దీనివల్ల వర్షకాలంలో వరదలు సంభవించి జనజీవనం స్తంభిస్తోంది. ప్లాస్టిక్ కవర్లు తినడం వల్ల పశువులు, జలచరాలు మృత్యువాత పడుతున్నాయి. కాల్చడం వల్ల వెలువడే విషవాయువులు ఊపిరితిత్తుల వ్యాధులకు, క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. ప్లాస్టిక్ సూక్ష్మకణాలు ఆహార గొలుసు ద్వారా మానవ శరీరంలోకి ప్రవేశించి తీవ్ర ఆరోగ్య సమస్యలను సృష్టిస్తున్నాయి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### పదవీ విరమణ వయసు తగ్గించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వ ఉద్యోగుల, ఉపాధ్యాయుల పదవీ విరమణ వయస్సు గురించి తీసుకున్న నిర్ణయం ఆహ్వానించదగ్గది. ప్రభుత్వ ఉద్యోగులు ఉపాధ్యాయులు పదవి విరమణ వయస్సు గతంలో ఏభైఎనిమిది సంవత్సరాలు ఉండేది. తర్వాత అరవై సంవత్సరాలుగా మార్చారు. ఓల్డ్ పెన్షన్ స్కీంలో పెన్షన్స్ ఇవ్వలేని కారణంగా అరవై రెండు సంవత్సరాలు గామాజీ మంత్రి జగన్మోహన్ రెడ్డి పెంచారు. పదవి విరమణ వయస్సు ఓల్డ్ పెన్షన్ స్కీం వలన ప్రభుత్వానికి భరించడానికి ఇష్టం లేని ఆర్థికభారం అవుతుంది. ఆనేపథ్యంలో ముప్పై మూడు ఏళ్ల సర్వీసు లేదా అరవై రెండు సంవత్సరాలు వయస్సు గానిర్ణయించి కొంతమందిని పదవి విరమణ చేయించాలని ప్రభుత్వం నిర్ణయించుకున్నట్టుగా కనిపిస్తూ ఉంది.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### బిసిలపై దృష్టి సారించాలి

బిసి కుటుంబాలు చాలా వరకు దిగువ స్థాయి ఆదాయంలోనే ఉంటారు. వృత్తులు బాగా పడిపోయిన తర్వాత కుటుంబ ఆదాయం బాగా తగ్గినది. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు కొన్ని పథకాలుపెడుతున్న కూడా బిసిలు నిరుద్యోగులుగా ఉంటున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల ఎంపికలో ఏ మాత్రం రిజర్వేషన్ ఇచ్చినా అది సమంజసమే. పోటీ పరీక్షల ఎంపికలో పరీక్ష ఫీజురాయితీ ఇవ్వాలి.

- బి.మేఘనాదం, విశాఖపట్నం

# ఆత్మగౌరవానికి ప్రతీక లేబర్ అడ్డాలు

వాసంశెట్టి సుభాష్


లేబర్ అడ్డాలు (కార్మిక కూడళ్లు) కేవలం పనికోసం వేచి చూసే ప్రదేశాలు కావు, అవి శ్రమజీవుల ఆత్మగౌరవానికి, స్వాభిమానానికి ప్రతీకలు. కార్మికుల కష్టజీవుల చెమట, కండరాల నుండి చైతన్యం వస్తుందని, భావించే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వారి ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు లేబర్ అడ్డాల ఏర్పాటుకు శ్రీకారంచుట్టారు. రాష్ట్రంలోని 80 లక్షల మంది అసంఘటిత కార్మికుల సమస్యలకు పరిష్కార మార్గంగా, వారిని గౌరవప్రదమైన జీవనంవైపు నడిపించే కేంద్రాలుగా ఈ అడ్డాలు మారబోతున్నాయి. తెల్లవారుజామునే లేచి, ఎండనక, వాననక పని కోసం రోడ్డెక్కి, ఆత్మవిశ్వాసంతో కష్టపడే శ్రామికుల నైతిక బలం ఈ అడ్డాలు. ఎవరికీ తలవంచకుండా, సొంత శ్రమతో వచ్చిన డబ్బుతో కుటుంబాలను పోషించుకునే కార్మికుల ఆత్మగౌరవానికి ప్రతీకగా ఈ అడ్డాలు నిలుస్తాయి. అంతేకాదు కూలీల్లో స్వాభిమానం పెరగడంతోపాటు వారికి తగినంత స్వేచ్ఛ కూడా లభిస్తుంది. అట్టడుగు వర్గాల కార్మికులు, కూలీలు ఒకచోట చేరినప్పుడు వారి సమస్యలను చర్చించుకుంటూ, సమాజంలో ఒకరికొకరు మద్దతుగా నిలవడంతో పాటు సామాజిక చైతన్యానికి ఈ లేబర్ అడ్డాలు ఎంతగానో దోహదపడతాయి. కూటమి ప్రభుత్వం కార్మికుల ఆత్మగౌరవాన్ని కాపాడేందుకు లేబర్ అడ్డాల వద్ద ఆధునిక వసతులు, విశ్రాంతి గదులు కల్పించాలని నిర్ణయించడం వారి గౌరవాన్ని పెంచడమే కాదు. అడ్డా కూలీలకు అవి ఆధునిక ఆశ్రయాలు అనడంలో సందేహంలేదు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మాటల్లో చెప్పాలంటే, 'ఆత్మ గౌరవం లేని జీవితం వ్యర్థం. ఆత్మ గౌరవంతో జీవించాలంటే మనిషి కష్టాలనుఅధిగమించాల్సి ఉంటుంది'. ఒకప్పుడు నోట్లోకి నాలుగు వేళ్ళు వెళ్ళాలంటే కూలీ చేయాల్సిందే. ఉన్న ఊరిలో ఉపాధిలేక పట్టణాలకు వలసపోయి అడ్డా కూలీలుగా మారిన ఉదంతాలు కోకొల్లలు. గ్రామాల నుంచి పని కోసం నగరంలోని కూలీ అడ్డాకు తరలి వచ్చే వారు. కూలీ దొరికిన రోజుదొరికేది. దొరకని రోజుపస్తులే. అడ్డ కూలీల బ్రతుకులు నిత్యం పోరాటంతో కూడుకునేవి. తెల్లవారుజామునుంచే పట్టణాలలోని అడ్డాల వద్ద వేలాది మంది కార్మికులు కూలి పనుల కోసం పడిగాపులు కాసేవారు. తెల్ల చొక్కా వేసుకుని బైక్ పై, కారుపై వచ్చిన వ్యక్తుల వద్దకు వందలాది కూలీలు పరుగున వచ్చి సార్ పని ఉందా.. సార్ పని ఉందా.. ఏదైనా చేస్తాం, వస్తాం మీవద్దకు అంటూ బతిమిలాడుకుని పనికి వెళ్ళే పరిస్థితులను ముఖ్యమంత్రి స్వయంగా గమనించారు. ప్రతిపక్షనాయకుని హోదాలో రాష్ట్రంలో పర్యటించినప్పుడు కుటుంబాన్ని పోషించడానికి ఆ కష్ట జీవులు పడుతున్న తపనను చూసిన దృశ్యాలు ఆయన కండ్ల ముందు కదలాడుతున్నాయి. శ్రమ కోసం పాకులాడే పనిలోనే శ్రామికుడు నిమగ్నమైనప్పుడు మూడు పూటల తిండి కోసం తాను పడుతున్న నరకయాతనకు ఫుల్‌స్టాఫ్ పెట్టాలనే ఆలోచనముఖ్యమంత్రి మదిలో మెదిలింది. నిరుపేద కుటుంబాలు మనుషులుగా తల ఎత్తుకుని బతికినప్పుడే కదా అభివృద్ధి అని ఆయన భావించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఈ కూలీలకు ఏదో ఒక ప్రయోజనం చేకూర్చి వారిలో ఆత్మగౌరవాన్ని పెంపొందించే దిశగా కార్యాచరణ ప్రణాళికకు రూపకల్పన ప్రారంభించింది. ఆ ప్రణాళికకు అనుగుణంగా భవన నిర్మాణ కార్మికులు పనుల కోసం రోజూ ఉదయం రోడ్లపక్కన ఇకవేచి చూసే పని లేకుండా కూటమి ప్రభుత్వం లేబర్ అడ్డాలు(చౌక్‌లు)కుశ్రీకారం చుట్టింది. ప్రయోగాత్మకంగా రాష్ట్రంలోని 15 నగరాల్లో ఈ అడ్డాలను నిర్మిస్తున్నారు. కేవలం ఇవి అడ్డాలేకాదు రాబోయే రోజుల్లో వీటిని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చనున్నారు. స్కిల్డ్, అన్ స్కిల్డ్ కార్మికులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులిస్తారు. తద్వారా వీరికి ప్రత్యేకశిక్షణ ఇచ్చి స్కిల్డ్ లేబర్‌గా తయారు చేస్తారు. ఇప్పటికే నైపుణ్యం ఉన్న వారికి కూడా మరింత శిక్షణ ఇచ్చి హైపవర్ స్కిల్డ్ లేబర్ గా గుర్తిస్తారు. తద్వారా కార్మికుల సంక్షేమం, జీవితాలను సమూలంగా మార్చాలన్నది ఆయన ఉద్దేశం. అంతే కాకుండా అత్యాధునిక పనిముట్లతోపాటు ఈఎస్ఐ ఆస్పత్రుల ద్వారా మెరుగైన వైద్యం అందిస్తారు. ముఖ్యమంత్రి ఆలోచనలకనుగుణంగా పదిహేను నగరాల్లో ప్రయోగాత్మకంగా లేబర్ అడ్డాలను అభివృద్ధి చేస్తారు. కార్మికులసేవలు అవసరమైన ప్రజలు నేరుగా లేబర్ చౌక్‌కు వెళ్ళి సంప్రదించొచ్చు. రాష్ట్ర వ్యాప్తంగా 20లక్షల మంది భవన నిర్మాణ కార్మికులున్నారు. ఇప్పటివరకు వీరంతా ప్రధాన కూడళ్లలో రోజు ఉదయమే చేరి అక్కడి నుంచి పనులకు వెళ్ళుతుంటారు. ఈ 15 నగరాల్లో ఏర్పాటు కానున్న లేబర్ అడ్డాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.15 లక్షలు చొప్పున ఖర్చు చేస్తారు. వీటిలో తాగునీటి సదుపాయం, పురుషులు, మహిళలకు వేర్వేరుగా మరుగుదొడ్లు ఏర్పాట్లు చేస్తారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సరికొత్త ప్రయోగం లేబర్ అడ్డాలు విజయవంతమై కార్మికుల జీవితాల్లో వెలుగు క్రాంతులు ప్రసరించాలని ఆశిద్దాం.

# అధిక ఉష్ణోగ్రతలు,ఉక్కపోత ఎల్‌నినో ప్రభావమేనా?



ఎం.నారాయణ స్వామి

రెండువేల ఇరవైఆరు ఎల్‌నినో ప్రభావం భారత్ పైనఉందా? అంటే ఉందని సీనియర్ సైంటిస్టులు చెబుతున్నారు. ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలో ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల ఏర్పడే ఒకవాతావరణ పరిణామం. ఇది ప్రపంచవ్యాప్తంగా వాతావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ప్రత్యేకంగా భారతదేశం వంటి దేశాల్లో వర్షపాతం మీద పెద్ద ప్రభావం ఉంటుంది. రాబోయే కాలంలో వర్షపాతం తగ్గే అవకాశం ఉంది. ఎల్‌నినో సమయంలో సాధారణంగా భారతదేశంలో ఋతుపవనాలు బలహీనంగామారుతాయి. వర్షాలు తగ్గేఅవకాశం ఉంది. ఉష్ణోగ్రతలు పెరగడం, ఎండలు ఎక్కువగా ఉండటమే కాకుండా, ఉష్ణోగ్రతలు సాధారణం కంటే పెరిగే అవకాశం ఉంటుంది. వేసవిలో గాలివేడి ఎక్కువగా రావచ్చు. వర్షాలు తగ్గితే పంటల దిగుబడి తగ్గుతుంది. నీటి కొరత పెరుగుతుంది. రైతులకు ఆర్థిక ఇబ్బందులు రావచ్చు. రిజర్వాయర్లు, చెరువుల్లో నీటి స్థాయి తగ్గుతుంది. తాగునీరు, సాగునీటి కొరత పెరుగుతుంది. వాతావరణ అస్థిరత కొన్ని ప్రాంతాల్లో వర్షాలు లేకపోవడం, మరికొన్ని చోట్ల ఒక్కసారిగా భారీ వర్షాలు పడటం వంటి అసాధారణ పరిస్థితులు రావచ్చు. ఎల్‌నినో ప్రభావం ప్రతి సంవత్సరం ఒకేలా ఉండదు. కొన్ని సంవత్సరాల్లో ప్రభావం తక్కువగా ఉంటుంది. కొన్ని సంవత్సరాల్లో ఎక్కువగా ఉంటుంది. ఇది భారత మెట్రోలాజికల్ డిపార్ట్‌మెంట్ అంచనాలపై ఆధారపడి మారుతూ ఉంటుంది. రాబోయే కాలంలో ఎల్‌నినో ఉంటే వర్షాలు తగ్గే అవకాశం ఎండలు ఎక్కువ ఉండి వ్యవసాయానికి, నీటికి కష్టం పెరుగడమే కాకుండా అనేక ఇబ్బందులకు దారి తీస్తుంది. ఎల్‌నినో అనేది గతంలో కూడా భారతదేశంపై ప్రభావం చూపింది. ఇది కొత్త విషయం కాదు. చాలాసార్లు భారత్‌లో వాతావరణాన్ని మార్చింది. 1982-83బలమైన ఎల్‌నినో వచ్చింది. భారతదేశంలో వర్షాలు తగ్గిపోయాయి. పంటలకు నష్టం జరిగింది. 1987 ఇది ఒక పెద్ద కరువు సంవత్సరం. ఋతుపవనాలు బలహీనంగా ఉండి వ్యవసాయం దెబ్బ తింది. 1997-98బలమైన ఎల్‌నినో వలన కొన్ని ప్రాంతాల్లో తక్కువ వర్షాలు, కొన్ని చోట్ల అసాధారణ వాతావరణ మార్పులు ఏర్పడ్డాయి. 2002లోఋతుపవనాలు భారీగా విఫలమయ్యాయి. దేశవ్యాప్తంగా కరువు పరిస్థితులు వచ్చా



యి. 2009మళ్లీ వర్షాలు తక్కువగాపడ్డాయి. వ్యవసాయం, నీటి వనరులు ప్రభావితమయ్యాయి. 2015-16 అనేక రాష్ట్రాల్లో ఎండలు ఎక్కువయ్యాయి. 2026-27లో ఎల్‌నినో ప్రభావం భారత్‌పై గణనీయంగా ఉండే అవకాశం ఉంది. ప్రపంచ వాతావరణ సంస్థలు చెబుతున్నది మే, జూలై 2026 మధ్య ఎల్‌నినో అభివృద్ధి అయ్యే అవకాశం (60-70శాతం) ఉంది. ఇది 2026 చివరి వరకు, 2027 ప్రారంభం వరకు కొనసాగవచ్చు. భారత్‌లో ఋతుపవనాల పై ప్రభావం ఉంటుందని ఐఎండి అంచనా వేసింది. ఐఎండి చెప్పే వివరాలు ప్రకారం చూస్తే సాధారణం కంటే తక్కువ వర్షపాతం (92శాతం) నమోదయ్యే అవకాశంఉంది. ఋతుపవనాలు బలహీనపడి వర్షాలు ఒకచోట ఎక్కువ, ఇంకొకచోట తక్కువ కురుస్తాయి. మధ్య మధ్యలో డ్రైస్పెల్స్ ఎక్కువ. రైతులకు ఇది పెద్ద ప్రమాదం. 2026లోఎక్కువ కాలం వేడి తరంగాలు రాత్రిపూట కూడా ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. 2026లో వేడి గాడ్పులు పెరిగి భూగర్భ జలాల పరిస్థితులు అయోమయంగా తయారయ్యే అవకాశం ఉంది. వర్షాలు తక్కువైతే బియ్యం, పత్తి, సోయాబీన్ పంటలు తగ్గే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో సాగు ప్రాంతం తగ్గవచ్చు. భూగర్భ జలాల మీదఆధారపడే పరిస్థితి పెరుగుతుంది. ఆహారధరలు పెరిగే అవకాశంఉంది. నీటి, విద్యుత్ కొరత ఏర్పడుతుంది. జీడీపీ మీద కూడా చిన్న ప్రభావం ఉండొచ్చు. హిందూ మహాసముద్ర ద్విధ్రువం ధనాత్మకం అయితే కొంత వర్షం పొదుపు అయ్యే అవకాశం ఉంది. గతంలో ఎల్‌నినో ప్రభావం చూపిన సంవత్సరాల్లో కూడా సాధారణ వర్షపాతం వచ్చిన సందర్భాలు ఉన్నాయి. 2026లో ఎల్‌నినో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రంలోని ఈ జిల్లాల పైన ఎక్కువ ప్రభావం ఉంటుంది అని చెబుతున్నారు. రాయలసీమ ప్రాంతంలోని కర్నూలు, అనంతపురం కడప, చిత్తూరు, జిల్లాలో మరింత కరువు పరిస్థితి వచ్చే అవకాశం ఉంది. దక్షిణ కోస్తా, ఆంధ్రా, నెల్లూరు ప్రకాశం జిల్లాలో కూడా వర్షాలు తగ్గవచ్చు. ఉత్తర కోస్తా (విజాగ్, శ్రీకాకుళం, విజయనగరం) జిల్లాలో బంగాళాఖాతం ప్రభా వంవల్ల కొంతవరకు వర్షాలు కొనసాగుతాయి. తెలంగాణలో మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలో వర్షాభా వం ఎక్కువగా కనిపించొచ్చు. రంగారెడ్డి, మెదక్ నిజామా బాద్ జిల్లాలో, ఉత్తర తెలంగాణలో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం అడవులు, స్థానిక వాతావరణం వల్ల కొంత వర్షం ఉంటుంది. 2026లో మే నెలల్లో వర్షాలు ఎలా ఉంటాయి? జూన్ -జూలై నెలలో ఋతుపవనాలు (వర్షాలు) ఆలస్యంగా మొదలయ్యే అవకాశం ఉంది. తక్కువ వర్షపాతం నమోదు అయ్యే అవకాశం ఉంది. ఆగస్టు - సెప్టెంబర్ (పీక్ సీజన్)కొన్ని ప్రాంతాల్లో అకస్మాత్తుగా భారీ వర్షాలు కానీ మొత్తం వర్షపాతం మాత్రం సగటు కంటే తక్కువ ఉండొచ్చు. అక్టోబర్ - నవంబర్ తిరోగమిస్తున్న ఋతుపవనాలు కోస్తా ఆంధ్రలో మంచి వర్షాలు పడే అవకాశం ఉంది. తుఫాను ప్రభావం ఉండొచ్చు.

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి

ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# నేడు పార్లమెంట్ స్థాయీసంఘ భేటీలో మూసీ, మెట్రో రెండో దశపై చర్చ!

## హాజరుకానున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** మూసీ కాలుష్యరహితంగా సుందరీకరణ చేయాలనే ప్రభుత్వ ప్రాధాన్యత అంశం, మెట్రో రెండోదశ విస్తరణ వంటి ప్రధాన అంశాలతో శనివారం బిఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో పార్లమెంట్‌కు చెందిన గృహనిర్మాణం, పట్టణ వ్యవహారాల స్థాయీసంఘం సమావేశం జరుగబోతున్నది. పార్లమెంట్ హౌజింగ్ అండ్ అర్బన్ ఎఫైర్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భువనగిరి ఎంపి చామల కిరణ్ కుమార్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, అర్బన్ లోక్‌బాడీ ఇన్‌చార్జ్ శ్రీదేవి, కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అధికారులు,రాష్ట్ర హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొని అర్బన్ డబుల్ బెడ్ రూమ్ హౌసింగ్, గ్రామీణ గృహ నిర్మాణ పథకం ఇందిరమ్మ ఇళ్లపై సమీక్ష నిర్వహించనున్నారు. తెలంగాణ వేగంగా పెరుగుతున్న పట్టణీకరణ మౌలిక వసతులపై చర్చించే అవకాశం ఉంది. తెలంగాణ పట్టణాభివృద్ధి,గృహ నిర్మాణ పథకాల పురోగతి, అమలులో ఎదురవుతున్న సవాళ్లపై పార్ల మెంట్ కమిటీ సమగ్ర సమీక్ష నిర్వహించబోతుంది.

తెలంగాణ సచి వాలయంలో నిర్వహించనున్న సమీక్ష సమావేశంలో మెట్రో రైల్ ఫేజ్-2, మూసీ నది పునరుజ్జీవన ప్రాజెక్ట్, గృహ నిర్మాణ పథకాలు, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్, నల్లగొండ మహబూబ్‌నగర్, రామగుండం, మెదక్ వంటి నగరాలతోపాటు టైర్-3 పట్టణ స్థానిక సంస్థల సమస్యలు, అర్బన్ ఛాలెంజ్ ఫండ్ తదితర కీలక అంశాలపై స్టాండింగ్ కమిటీ చర్చించనుంది. శుక్రవారం తిరుపతిలో చామల కిరణ్ కుమార్ రెడ్డి భువనగిరి లోక్ సభ సభ్యులు, పార్లమెంట్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ స్టాండింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఒంగోలు ఎంపి మాగుంట శ్రీనివాసులు రెడ్డి అధ్యక్షత వహించారు. అటవీ శాఖ, హడ్కో, ఎన్.బి.సి.సి, సి.టి.డబ్ల్యు, టిటిడి, తుడా తిరుపతి మున్సిపల్ కార్పొ రేషన్‌తోపాటు యూనియన్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్ ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. తిరుపతి నుంచి శుక్రవారం సాయంత్రం వచ్చిన పార్లమెంట్ స్థాయిసంఘం సభ్యులు హైదరాబాద్‌లో పార్లమెంట్ స్థాయి సంఘం వివిధ ప్రాంతాల్లో పర్యటన చేసి పట్టణ సమస్యలపై అధ్యయనం కూడా చేసింది.

# తమిళనాడు గవర్నర్ వైఖరిపై సుప్రీంలో టివికె నేత పిటిషన్

**న్యూఢిల్లీ, మే 8:** మెజార్టీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ ఆహ్వానించకపోవడంపై తమిళ వెట్రి కజగం (టివికె) పార్టీ సుప్రీం కోర్టును ఆశ్రయించింది. గవర్నర్ ఆరవి ఆర్లేకర్ తమ పార్టీని ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించడంలో ఉద్దేశపూర్వక తాత్సారం చేసారని ఆరోపిస్తూ ఈ రిట్ పిటిషన్ దాఖలయింది. శుక్రవారం ఈ పిటిషన్ రిజిస్టరు చేసారు. డైయిరీ నంబరు 28509/2026కింద రిజిస్టరు అయిన ఈ పిటిషన్ వివరాలను సుప్రీంకోర్టు అధికారిక వెబ్‌సైట్‌లో కంప్యూటరైజ్డ్ కేస్ స్టేటస్‌లో చూపించింది. తమిలనాడులో టివికె ఏకైక అతిపెద్ద పార్టీగా అవతరించింది. 108 సీట్లు సాధించింది. మెజార్టీ మార్కు 118కి కొన్ని స్థానాలు తక్కువయింది. అయితే కాంగ్రెస్ పార్టీ, కమ్యూనిస్టుపార్టీ, సీపిఎంలు మద్దతిచ్చినప్పటికీ మెజార్టీ రాలేదని గవర్నర్ ప్రకటించడంపట్ల టివికె నేతలు నిరసన తెలిపారు. సిపిఐ, సిపిఎం రెండు పార్టీలుకూడా ప్రభుత్వంలో చేరమని, అయితే బయటినుంచే టివికెకు మద్దతిస్తామని రెండుపార్టీల కార్యదర్శులు షణ్ముగం, వీరపాండియన్‌లు ప్రకటించారు. ఈ రెండుపార్టీల మద్దతులో 116కు పెరిగింది. మొత్తం 118 మంది ఎమ్మెల్యేల జాబితా అందచేయాలని ఆ తర్వాతనే రాజ్యాంగప్రక్రియ మొదలవుతుందని లోక్‌భవన్ ప్రకటించింది. దీనితో రాష్ట్రంలో రాజకీయ అనిశ్చితి చోటుచేసుకుందని, గవర్నర్‌ను రెండుపర్యాయాలు కలిసి తమ అధినేత విజ్ఞప్తిచేసినా తాత్సారం జరిగిందంటూ టివికె తన పిటిషన్‌లో ఆరోపణలుచేసింది. అయితే ఈ అనిశ్చితికి కారణం గవర్నర్ ఆర్లేకర్ అని పేర్కొంటూ తక్షణమే సుప్రీంకోర్టు ఆదేశాలివ్వాలని అభ్యర్థిస్తూ కె.ఎఝిలారసి అనే టివికెనేత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలుచేసారు. అయితే ఈ పిటిషన్ విచారణకు రావాల్సి ఉంది.

# కరీంనగర్ ఘటనపై డిజిపికి బిఆర్ఎస్ నేతల ఫిర్యాదు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** కరీంనగర్‌లో బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంలో గురువారం పాడి కౌశిక్ రెడ్డిపై బిజెపి కార్యకర్తల దాడి, వాహనాల ధ్వంసంపై బిఆర్ఎస్ నేతలు శుక్రవారం డిజిపి సివి ఆనంద్‌కు ఫిర్యాదు చేశారు. గంగుల కమలాకర్ క్యాంప్ కార్యాలయంలో కౌశిక్ రెడ్డి మీడియా సమావేశం నిర్వహించడం చట్టబద్ధంగా జరిగిం దేనని, ఈ సందర్భంగా కేం ద్ర హోం శాఖ సహాయ మంత్రిగా వున్న బండి సంజయ్ గతంలో కెటిఆ ర్‌పై చేసిన విమర్శలకు కౌంటర్ మాత్రమే ఇచ్చారని బిఆర్ఎస్ నేతలు దాసోజు శ్రవణ్, వివేకానంద, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు డిజిపికి వివరించారు. తమ నేత కెటిఆర్‌ను బండి సంజయ్ ఇష్టానుసారం విమర్శిస్తే తాము చూస్తూ ఊరుకోవాలా...? అని బిఆర్ఎస్ నేతలు డిజిపిని అడిగారు. కౌశిక్ రెడ్డి మీడియా సమావేశం తరువాత బిజెపి నేత లు ఒక పథకం ప్రకారం రౌడీలతో కలిసి దాడులకు తెగపడ్డారని బిఆర్ఎస్ నేతలు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించి పో యాయన డానికి ఈ ఘటన నిదర్శమని వారు ఆరోపించారు. సిఎం రేవంత్ రెడ్డి, బండి సంజయ్‌ల మధ్య వున్న చీకటి ఒప్పందాలు అందరికి తెలిసిందేనని వారు తెలిపారు. సంజయ్ కేంద్రమంత్రి అయినా అహంకారం తగ్గలేదని వారు తెలిపారు. బిహార్ సహా వెనుకబడ్డ రాష్ట్రాలలో వున్నట్లుగా రాష్ట్రంలో శాంతి భద్రతలు నశించాయని, ఈ ఘటనపై విచారణ చేసి, సంజయ్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ బ్రాండ్ అంబాసిడర్‌గా మిస్ ఇండియా రష్మీ


**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** ఈ నెలలో నిర్వహించనున్న అంతర్జాతీయ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్-2026లో రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మిస్ ఇండియా స్టార్ యూనివర్స్-2018 రష్మీ ఠాగూర్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్రం దీనికి సంబంధించిన ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నెల 17 నుండి 21వ తేదీ వరకూ నిర్వహిస్తున్న అంతర్జాతీయ కేన్స్ ఫెస్టివల్‌లో తెలంగాణ చేనేత, భౌగోళిక గుర్తింపు పొందిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలను ప్రదర్శిస్తారు. భారత జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయం, హైదరాబాద్‌లోని చేనేత సేవా కేంద్రం సహకారంతో హౌస్ అఫ్ వెండోమ్ పారిస్ సంయుక్తంగా నిర్వహించే అంతర్జాతీయ ఫ్యాషన్ షోలలో రష్మీ ఠాగూర్ తెలంగాణ చేనేత ఉత్పత్తులు, పోచంపల్లి వస్త్రాలు ధరించి పాల్గొంటారని నిర్వహకులు డాక్టర్ ఎస్ అరుణ్‌కుమార్ తెలిపారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇ.టి.నర్సింహ, పల్లె నర్సింహ తదితరులు

# 25, 26 తేదీల్లో తెలంగాణ ప్రజా నాట్యమండలి 4వ రాష్ట్ర మహాసభలు

**హైదరాబాద్ (సైఫాబాద్), మే 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజా నాట్యమండలి రాష్ట్ర 4వ మహాసభలు ఈ నెల 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో జరుగుతాయని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఇ.టి.నర్సింహ, ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి పల్లె నర్సింహ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ మహా సభలను నారాయణగూడలోని మర్వేల్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వ హిస్తు న్నామని, 25వ తేదీ ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయం నుంచి వేలాది మంది కళాకారులతో ఫంక్షన్ హాల్ వరకు భారీగా ప్రదర్శన నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, ఎమ్మెల్యే, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివ రావు, ప్రముఖ నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ, ఎమ్మెల్సీ గోరటి వెంకన్న తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వారు వివరించారు. అన్ని జిల్లాల నుంచి 500 మంది కవులు, కళాకారులు ప్రతినిధులుగా పాల్గొంటారని, కళాకారులకు ఎదురవుతున్న ఆనేక సమస్యలపై ఈ మహాసభల్లో చర్చించి పలు తీర్మానాలను చేయడం జరుగుతుందన్నారు.



ఎస్పీఎం మిల్లులోని వివిధ విభాగాలను పరిశీలిస్తున్న మంత్రి జూపల్లి

# సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించిన మంత్రి జూపల్లి కృష్ణారావు

**కాగజ్‌నగర్ రూరల్, మే 8, ప్రభాతవార్త :** పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని సిర్పూర్ పేపర్ మిల్లును సందర్శించారు. ఈ సందర్భంగా మిల్లుసిబ్బంది ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మిల్లులోని వివిధ విభాగాలను మంత్రి క్షుణ్ణంగా పరిశీలించారు. కలప నుంచి కాగితం తయారయ్యే వివిధ దశలను మంత్రి ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. కలపను ముక్కలుగా చేయడం (చిప్పింగ్), ఆపై గుజ్జుగా మార్చడం, రసాయనాల వినియోగం నుంచి తుది దశలో పేపర్ రోల్స్ సిద్ధమయ్యే వరకు సాగే సంక్లిష్ట ప్రక్రి యను, యంత్రాల పనితీరును మిల్లు సాంకేతిక నిపుణులు ఆయనకు వివరించారు. ఉత్పత్తి, కార్మికుల సంక్షేమం తదితర అంశాలపై ఆయన చర్చించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె హరిత ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

# మూసీ నిర్వాసితులకు డిప్యూటీ సిఎం భట్టి భరోసా

## ప్రజాభవన్‌లో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ ప్రతినిధులతో మంత్రుల భేటీ

## మూసీ నది పునరుజ్జీవానికి సహకరించండి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 8:** మూసీ పునర్జీవన ప్రాజెక్టులో భాగంగా నిర్వాసితులయ్యే వారికి ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా తగిన సాయం అందిస్తామని ఉప ముఖ్య మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. శుక్రవారం ప్రజాభవన్‌లో మూసీ పునర్జీవన కేబినెట్ సబ్ కమిటీ చైర్మన్, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబులను మధుపార్క్ రిడ్జ్ (బిబ్లాక్) రెసిడెన్షియల్ అసోసి యేషన్ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు తమ వినతులను మంత్రులకు సమర్పించారు. నివాసితులు వ్యక్తం చేసిన సందేహాలు, అపోహాలను మంత్రులు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ మధుపార్క్ రిడ్జ్ బి బ్లాక్ నివాసితులందరి విషయంలో ప్రభుత్వం సానుకూల దృక్పథంతో ఉందన్నారు. ప్రజలందరూ సంతోషంగా ఉండాలని, వారికి మెరుగైన జీవన ప్రమా ణాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. నగర వాసు లకు స్వచ్ఛమైన గాలి, నీరు, పచ్చ దనం అందిం చేందుకు చేపట్టిన ఈ ప్రతి ష్టాత్మక ప్రాజెక్టులో భాగస్వాములు కావాలని వారిని డిప్యూటీ సిఎం కోరారు. ప్రభుత్వ హామీ పట్ల అసోసియేషన్ ప్రతినిధులు సానుకూలంగా స్పందించారు. మూసీ పునర్జీవనానికి తమ వంతు సహ కారం అందిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో మధుపార్క్ రిడ్జ్ అసోసియేషన్ అధ్యక్షులు దొడ్డ శ్రీనివాస్‌రెడ్డి, సెక్రటరీ జి.వి. శేఖర్, సభ్యులు సత్యనారాయణ, గౌతమ్‌రాయ్, రేణు ధల్, నబీ సాహెబ్, సాహిల్ ఖాన్ పాల్గొన్నారు. ప్రభుత్వ పక్షాన మూసీ ప్రాజెక్ట్ ఎండి ఇ.వి. నర్సింహారెడ్డి, జాయింట్ ఎండి గౌతమి, అడిషనల్ కలెక్టర్ చంద్రారెడ్డి తదితరులు హాజరయ్యారు.

# 'ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం' సందర్భంగా సిఎం రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, మే 8:** ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ, మానవత్వమే మహోన్నత సేవ అనే భావనతో నిరంతరం సేవలందిస్తున్న రెడ్‌క్రాస్ వాలంటీర్లకు 'ప్రపంచ రెడ్ క్రాస్ దినోత్స వం' సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వారికి హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. బాధలో ఉన్న ప్రతి మనిషికి ఆశా కిరణంగా నిలుస్తూ, మానవత్వపు విలువలను సజీవంగా కాపాడుతున్న రెడ్ క్రాస్ సేవకుల అవిశ్రాంత కృషి అనిర్వచనీయమని ప్రశంసించారు. మానవ సేవనే పరమ ధర్మంగా భావించి ప్రపంచవ్యాప్తంగా సేవలందిస్తున్న స్వచ్ఛంద సేవకుల త్యాగం, నిబద్ధత సమాజానికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. సంక్షోభ సమయాల్లో కరుణ, సంఘీభావం, సేవాభావం ఎంత ముఖ్యమో ప్రపంచానికి చాటిచెబుతున్న రెడ్‌క్రాస్ సంస్థ సేవలు అభినందనీయమన్నారు. మానవతా విలువలను మరింత బలోపేతం చేసే ఈ సేవా స్ఫూర్తి తరతరాలకు ఆదర్శంగా నిలవాలని ముఖ్యమంత్రి ఒక సందేశంలో పేర్కొన్నారు.

# పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో బోధనా, బోధనేతర సిబ్బంది విధుల్లో ఉండాలి

## పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నికోలస్ ఆదేశాలు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** పదోతరగతి సప్లిమెంటరీ పరీక్షల నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, క్లరికల్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది వేసవి సెలవుల సమయంలో కూడా విధుల్లో అందుబాటులో ఉండాలని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారి చేసింది. జూన్ 5 నుండి 12 వరకు ఎస్ఎస్‌సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం పాఠశాలల ప్రధానో పాధ్యాయులు, కార్యాలయ సిబ్బంది హాజరు తప్పనిసరి అని డైరెక్టర్ స్పష్టం చేశారు. విఫలమైన విద్యార్థుల నామినల్ రోల్స్ ఎక్స్‌ట్రాక్ట్ స్వీకరణ, ఫెయిల్ మెమోలు అందజేయడం, పరీక్షా ఫీజుల స్వీకరణ, చెల్లింపుల ప్రక్రియల కోసం పాఠశాలలు తెరిచి ఉంచాలని స్పష్టం చేశారు. ఈ మేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ ఆదేశించారు.

# విహెచ్ ఆమరణ నిరాహార దీక్ష నేడు మొదలు

## ఒబిసి జనగణన కోసం ఆందోళన

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** వెనుకబడిన తరగతుల జనాభా గణన చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, ఒబిసిఎంపి పోరం మాజీ కన్వీనర్, మాజీ రాజ్యసభ సభ్యులు వి.హనుమంతరావు ఆమరణ నిరాహాదీక్ష శనివారం నుంచి మొదలు పెడుతున్నారు. అంబర్ పేటలోని ఆయన నివాసంలో ఉదయం పదిన్నరకు కులగణన జరిపించే వరకు ఆమరణ ఉపవాసదీక్ష కొనసాగించాలని ఆయన నిర్ణయించు కొన్నారు.

రాజకీయ పార్టీలకు అతీతంగా బిసిల అభ్యున్నతికి విహెచ్‌కు సంఘీ భావం ప్రకటించడానికి ఒబిసిలు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. బిసి జనాభా ప్రాతిపదికన న్యాయంజరగాలంటే జనగణనలో బిసి జనాభాను లెక్కించాలని విహనుమంతరావు పలుమార్లు ప్రధానికి విన్నవించారు. అనేక పర్యాయాలు లేఖలు కూడా రాశారు.

కానీ ప్రధాని నుంచి స్పందనరాకపోవడంతో హనుమంతరావు తీవ్ర మనోవేదనకు గురై చివరకు నిరాహాదీక్ష చేయడానికి పూనుకొన్నారు. బిసి ప్రధానమంత్రిగా నరేంద్రమోడీ చెప్పుకోవడమేకానీ ఒబిసిలకు న్యాయం చేయాలని ఎన్ని పర్యాయాలు లేఖలు రాసినా, విన్నపాలు చేసినా ఉదాసీనంగా వ్యవహరించారనీ ఇక పోరాటం ద్వారానే బిసి గణన బిసిల వాటా సాధించడానికి నేను ఆమరణ నిరాహారదీక్షకు పూనుకొంటున్నానని తెలిపారు. దేశవ్యాప్తంగా ఒబిసిలను లెక్కించుడో హనుమంతరావు అమరుడు అవ డమో జరుగతుందనే అంత పట్టుదలగా వృద్ధనాయకుడు తన వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి పోరాటమార్గం ఎంచుకొన్నారు.

# ఇండియా కూటమికి డిఎంకె గుడ్‌బై

## పార్లమెంటులో తమకు ప్రత్యేక సీట్లు కేటాయించాలని స్పీకర్‌కు ఎంపి కనిమొళి లేఖ

**న్యూఢిల్లీ, మే 8:** తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య మార్పు చోటుచేసుకుంది. బలమైన రాజకీయ శక్తిగా ఉన్న డీఎంకే, కాంగ్రెస్ పార్టీతో తమ కున్న పొత్తు ముగిసిందని అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు డీఎంకే ఎంపీ కనిమొళి ఢిల్లీలో కీలక ప్రకటన చేశారు. దేశంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, సమీకరణాల దృష్ట్యా ఇకపై కాంగ్రెస్‌తో కలిసి నడవలేమని ఆమె స్పష్టం చేశారు. ఈ నిర్ణయం వెలువడిన వెంటనే పార్లమెంటరీ కార్యకలాపాల పరంగా కూడా డీఎంకే కీలక అడుగు వేసింది. లోక్‌సభలో తమ పార్టీ ఎంపీలకు ప్రత్యేక సీటింగ్ కేటాయించాలని కోరుతూ కనిమొళి స్పీకర్‌కు లేఖ రాశారు. ఇప్పటి వరకు సభలో కాంగ్రెస్ ఎంపీలతో కలిసి కూర్చున్న డీఎంకే సభ్యులు ప్రస్తుత పరిస్థితుల్లో వారితో కలిసి కూర్చోలేమని స్పష్టంగా పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన




ఎంపీలందరికీ సభలో వేర్వేరుగా సీట్లు కేటాయించి, స్వతంత్రతను గౌరవించాలని ఆమె స్పీకర్‌ను విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్‌తో పొత్తు ముగియడం అనేది కేవలం ఎన్నికలకే పరిమితం కాకుండా, పార్లమెంట్ లోపల కూడా ప్రతిబింబించాలని డీఎంకే భావిస్తోంది. ఈ పరిణామం అటు తమిళనాడు రాష్ట్ర రాజకీయాల్లోనూ, ఇటు కేంద్రంలోని విపక్ష కూటముల్లోనూ పెను సంచలనంగా మారింది. తమిళనాడులో తాజా అసెంబ్లీ ఎన్నికలు కొత్త రాజకీయ సమీకరణాలకు తెరతీస్తున్నాయి. 22 ఏళ్లుగా కలిసున్న డీఎంకే, కాంగ్రెస్ పార్టీలు విడిపోయాయి. ఇకపై కాంగ్రెస్ పార్టీతో తమకు ఎలాంటి పొత్తూ లేదని డీఎంకే ప్రకటించింది. కాంగ్రెస్ పార్టీతోనే కాకుండా ఆ పార్టీ కీలక భాగస్వామిగా ఉన్న ఇండీ కూటమి నుంచి కూడా బయటకు వస్తున్నట్లు డీఎంకే తెలిపింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకేతో కలిసి కాంగ్రెస్ పార్టీ కూటమిగా పోటీ చేశాయి. ఫలితాల అనంతరం కాంగ్రెస్ పార్టీ టీవీకేకు మద్దతు ప్రకటించింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌పై డీఎంకే ఆగ్రహం వ్యక్తం చేసింది. డీఎంకే కూటమికి కాంగ్రెస్ పార్టీ వెన్నుపోటు పొడిచిందని డీఎంకే నేతలు విమర్శించారు. కాంగ్రెస్ తన స్వభావాన్ని మార్చుకోలేదన్నారు. తమతో కూటమిలో ఉండటం వల్లే కాంగ్రెస్ పార్టీకి రాజ్యసభ ఎంపీలు దక్కారని డీఎంకే నేతలు గుర్తు చేశారు. తాజాగా డీఎంకే కూడా అవసరమైతే ఏఐఏడీఎంకేతో పొత్తు పెట్టుకుని ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. దీనిపై కాంగ్రెస్ మండిపడింది. ఈ కారణాలతో డీఎంకే, కాంగ్రెస్ మధ్య ఏళ్లుగా ఉన్న బంధానికి తెరపడింది.

# ధాన్యం కొనుగోళ్లు వేగవంతానికి చర్యలు తీసుకోండి

## సిఎంకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని లేఖ

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసేందుకు ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించాలని సిఎం రేవంత్‌రెడ్డిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఆ పార్టీ శాసనసభాపక్ష నేత కూనంనేని సాంబశివరావు కోరారు. రాష్ట్రంలో ప్రస్తుతం ధాన్యం సేకరణ ప్రక్రియ పూర్తిగా మందగించిందన్నారు. ఫలితంగా రైతులు ధాన్యంతో మార్కెట్ యార్డు లు, కొనుగోలు సెంటర్లలో పడిగాపులు గాస్తు న్నారని పేర్కొన్నారు. ఈ విషయమై సిఎం రేవంత్‌రెడ్డికి శుక్రవారం ఆయన బహిరంగ లేఖ రాశారు. ధాన్యంలో తాలు ఉందని, నాణ్యత లేదనే పేరుతో అనేక కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయకుండా నిలిపివేసినట్లు వార్తలు వస్తున్నాయన్నారు. ఫలితంగా రైతులు తీసుకెళ్ళిన ధాన్యం అకాల వర్షాలకు తడిసి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కొన్నిచోట్ల రాశులుగా పోసిన ధాన్యం వరదకు కొట్టుకపోయాయన్నారు. తడిసిన ధా న్యాన్ని కొనుగోలు చేసే విషయంలో అధికారులు పట్టించుకోకపోవడంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులకు తీవ్ర నష్టం వాటిల్లు తోందన్నారు. ధాన్యం, మొక్కజొన్న కొనుగోళ్లలో తలెత్తుత్తున్న సమస్యలను పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.



# లంచం తీసుకుంటూ సిబిఐకి చిక్కిన పోస్టల్ ఎస్ఐ

**వనపర్తి, మే 8, ప్రభాతవార్త :** సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగం వెలగబెడుతూ లక్షల్లో జీతాలు పొందుతూ అంతటితో సంతృప్తి చెందకుండా చేతి వాటం ప్రదర్శించిన వనపర్తి పోస్టల్ సబ్ ఇన్‌స్పెక్టర్ గోపీనాథ్‌ను సీబీఐ అధికారులు పట్టుకున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది.బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కిందిస్థాయి ఉద్యోగులు అదనంగా చేసే విధులకు రావాల్సిన అదనపు డబ్బులు గత మూడు సంవత్సరాలుగా నిలిచి పోయాయి. ఇటీవల ఉన్నతాధికారులు అదనంగా విధులు నిర్వహించిన ఉద్యోగులకు చెల్లించేందుకు వీలుగా నిధులు మంజూరి చేశారు. ఆ డబ్బులను ఎటువంటి ఆక్షేపణలు లేకుండా చిరు ఉద్యోగులకు చెల్లించవలసిన పోస్టల్ సబ్ ఇన్స్పెక్టర్, సూపరింటెండెంట్ డబ్బులు మంజూరు చేయాలి అంటే తమకు 30 శాతం డబ్బులు ఇవ్వాలి అని .. అలా అయితేనే డబ్బులు మీ ఖాతాలలో జమ అవుతాయని తెల్చి చెప్పారు."దాదాపుగా 40 మంది ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తూ వచ్చారు. తప్పని పరిస్థితిలో చిరు ఉద్యోగులు సంబంధిత సీబీఐ, పోస్టల్ డిపార్ట్మెంట్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు వనపర్తి పోస్టల్ ఇన్ స్పెక్టర్ గోపీనాథ్ ఒక ఉద్యోగి నుంచి రూ.30వేలు లంచం తీసుకుంటుండగా గురువారం సాయంత్రం దాదాపుగా 12 మంది సీబీఐ అధికారులు పట్టుకునే ప్రయత్నం చేశారు. ఈ పరిణామాలను పసి గట్టిన పోస్టల్ ఇన్ స్పెక్టర్ గోపినాథ్ తాను తీసుకున్న డబ్బులను ట్రెజరర్‌కు ఇచ్చి ఇవి లెక్కపెట్టమని చెప్పి కార్యాలయం గోడ దూకి ఆటోలో పరారయ్యాడు. ఫోన్ సిగ్నల్స్ ద్వారా గోపీనాథ్ కొత్తకోట మదనాపూర్ రోడ్డు వద్ద దూర ప్రాంతాలకు వెళ్లడానికి నిలిచి ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. తిరిగి వనపర్తి పోస్టల్ కార్యాలయానికి తీసుకు వచ్చారు. రాత్రి మొత్తం విచారణ జరిపి శుక్రవారం ఉదయం రిమాండ్ కు తరలించారు. పోస్టల్ సూపరింటెండెంట్ పరారీలో ఉన్నట్లు గుర్తించారు. పట్టుబడిన పోస్టల్ ఇన్ స్పెక్టర్ గోపీనాథ్ కు బినామీ పేర్ల మీద పెద్ద ఎత్తున ఆస్తులు ఉన్నట్లు గుర్తించినట్టు తెలుస్తోంది. మొత్తంపై పోస్టల్ డిపార్ట్‌మెంట్‌లో జరిగిన వ్యవహారం సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

# చిలకలగూడలో యువకుడి దారుణహత్య

## ప్రేమ వ్యవహారమే కారణమంటున్న పోలీసులు

## ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు

**హైదరాబాద్ (సికిందరాబాద్), మే 8, ప్రభాతవార్త:** సీతాఫల్‌మండి నామాల గుండు ప్రాంతానికి చెందిన బీటెక్ థర్డ్ ఇయర్ చదువుతున్న అఖిల్ (20) హత్య కేసు తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. పోలీసుల వివరాల ప్రకారం.. అఖిల్ కొన్ని సంవత్సరాలుగా సీతాఫల్‌మండికి చెందిన ఓ యువ తిని ప్రేమిస్తున్నాడు. ఈ విషయాన్ని యువతి కుటుంబ సభ్యులు, ఆమె బావ, బంధువులు తీవ్రంగా వ్యతిరేకించారు. కొంతకాలం క్రితం అఖిల్ తనను వేధిస్తున్నాడంటూ స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు కూడా నమోదైంది. ఆ ఫిర్యాదు కుటుంబసభ్యుల ఒత్తిడితో చేయించారని యువతి స్వయంగా అఖిల్‌కు ఫోన్‌లో తెలిపినట్లు సమాచారం. అనంతరం పెద్దల సమక్షంలో రాజీ కుదిరి విషయం ముగిసిందని భావించారు. కానీ ఇటీవల మళ్లీ ఇద్దరి మధ్య ప్రేమ వ్యవహారం కొనసాగుతున్నట్లు తెలుసు కున్న యువతి బావ తీవ్రఆగ్రహానికి గురైనట్లు తెలుస్తోంది. గురువారం సాయంత్రం నామాలగుండులో టీవీ చూస్తున్న అఖిల్‌ను బయటకు పిలిచి, నలుగురు స్నేహితులతో కలిసి దాడి చేసి అత్యంత దారుణంగా హత్య చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఘటన అనంతరం నిందితులు పరారయ్యారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని అఖిల్‌ను గాంధీ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. హత్యకు గురైన అఖిల్ తండ్రి శ్రీనివాస్‌తో పాటు బంధువులు, మిత్రులు పెద్ద ఎత్తున నిందితుల ఇంటి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. మా బిడ్డ ప్రాణం తీసిన నిందితులు దర్జాగా ఇంట్లో ఏసీల్లో కూర్చున్నారు.. మా కుమారుడి ప్రాణాన్ని ఎవరు తిరిగి తీసుకొస్తారు? అంటూ పోలీసులను ప్రశ్నించారు. నిందితులను వెం టనే తమకు అప్పగించాలని డిమాండ్ చేస్తూ ధర్నాకు దిగడంతో ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. భారీ సంఖ్యలో పోలీసులు మోహరించి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనపై అడిషనల్ డీసీపీ నరసయ్య స్పందిస్తూ కేసును అత్యంత ప్రాధాన్యంగా తీసుకున్నామని తెలిపారు. నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టామని చెప్పారు. నింది తులు ఎంతటి వారైనా వదిలిపెట్టం.. అతి త్వరలోనే అదుపులోకి తీసుకుం టామని చెప్పారు. అఖిల్ హత్య కేసులో ప్రధాన నిందితుడిగా భావిస్తున్న గిరిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకుని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని ఆమె డిమాండ్ చేశారు.ప్రస్తుతం ప్రాంతంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కేసు దర్యాప్తులో చిలకలగూడ ఏసీపీ శశాంక్ రెడ్డి, సీఐ ఒలేటి రామకృష్ణ, వారాసిగూడ సీఐ రాజేందర్ గౌడ్‌లు నిందితులను అదుపులోకి తీసుకో డానికి ప్రత్యేక బృందాలను పంపినట్లు తెలిపారు.





హత్యకు గురైన అఖిల్ (ఫైల్)


తెలంగాణ ప్రభుత్వం

**మహబూబాబాద్ మునిసిపాలిటీ కార్యాలయం**

E1/1616//RFP-01/QTN-03/2026-27, తేదీ: 09-05-2026

(1) మొత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల నం: (01) నం. (రూ.4.99 లక్షలు),

(2) మొత్తం ఇ-ప్రొక్యూర్‌మెంట్ RFP (01) నం ---(RFP ప్రతిపాదన కోసం అభ్యర్థన - (RFP): మహబూబాబాద్ మునిసిపాలిటీ పరిధిలోని సిగ్నల్ కాలనీలో 50 TPD మున్సిపల్ ఘన వ్యర్థాల ప్రాసెసింగ్, శుద్ధి మరియు నిర్వహణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం కోసం. EPC పనులకు 6 నెలలు మరియు నిర్వహణకు 5 సంవత్సరాల కాలపరిమితితో).

**బిడ్/RFP సమర్పణ ప్రారంభ తేదీ & సమయం నుండి స్వీకరణ ముగింపు తేదీ & సమయం వరకు:** 09-05-2026 ఉ.10.00 గం.నుండి 16-05-2026 సా.05.00 గం.ల వరకు, (3) బిడ్ల ప్రారంభ తేదీ & సమయం: 16-05-2026 సా.05.10 గం.లకు.

(3) మొత్తం UIDF ఇ-ప్రొక్యూర్‌మెంట్ పనుల నం.లు: (12) నం.లు (రూ. 2043.50 లక్షలు),

II. కోరబడిన ధరల కొటేషన్లు: (1) IS ప్రమాణాల ప్రకారం గుర్తించబడిన హ్యాండ్ పంప్ విడిభాగాల తయారీ, సరఫరా మరియు డెలివరీ - అవి: i) 32mm GI కప్లింగ్, ii) 12mm కనెక్టింగ్ రాడ్, iii) హ్యాండిల్స్, iv) చైన్ లాక్ నట్స్, v) ఎక్స్‌టెన్షన్ స్టాండ్స్ - 1 అడుగు, vi) ఎక్స్‌టెన్షన్ స్టాండ్స్ - 1.5 అడుగులు, vii) ఎగువ వాల్వ్ బకెట్ వాషర్లు, viii) సీలింగ్ రింగ్ రబ్బరు వాషర్, ix) సిలిండర్ అసెంబ్లీ, x) సిలిండర్ బారెల్, xi) (రెడ్యూసర్) సిలిండర్ క్యాప్స్, xii) టెలిస్కోపిక్ స్టాండ్, xiii) చైన్లు, xiv) 2 నట్స్ మరియు వాషర్‌తో కూడిన యాక్సిల్, xv) హ్యాక్ ఫ్రేమ్, xvi) వాటర్ ఛాంబర్, xvii) హెడ్ అసెంబ్లీ, xviii) హ్యాండిల్ అసెంబ్లీ (చైన్‌తో సహా) మరియు ఇతరాలు మొదలైనవి, (2) హ్యాండ్ పంప్ సెట్ల స్థాపన మరియు అమరిక ఛార్జీలు మొదలైనవి. వివిధ రకాల వాట్స్ కలిగిన లైట్ల సరఫరా మరియు అమరిక, కూలీ ఖర్చులతో సహా, పని పూర్తి అయిన దశకు సంబంధించిన సమస్త వివరాలతో కలిపి. (3) గ్రాస్ యంత్రం కొనుగోలు. (4) నీటి సరఫరాకు సంబంధించిన సామగ్రిని సరఫరా చేయడం మరియు డెలివరీ చేయడం, అవి: i) DI పైపు వెల్డింగ్ రాడ్లు, ii) 200mm వ్యాసం గల HDPE జాయింటింగ్ యంత్రం, iii) HDPE పైపు జాయింటింగ్ హీటర్, iv) HDPE పైపు కట్టర్లు, v) వివిధ వ్యాసాలలో GI క్లాంపులు పట్టీలు, vi) 3/4" GI ఫ్లాంజ్, vii) 2 1/2" GI ఫ్లాంజ్, ఓపెన్ ట్రెడ్ Dummy, viii) తెలుపు మరియు నలుపు రంగు రోలర్ రబ్బరు షీట్లు, ix) 1/2" FTA HSC, x) CID జాయింట్ రబ్బరు రింగులు 6 అంగుళాలు మరియు ఇతరాలు. (5) వివిధ వ్యాసాలలో CID జాయింట్ల తయారీ, సరఫరా మరియు డెలివరీ. (6) 5.00 HP ఓపెన్ వెల్ మోటారు సరఫరా మరియు డెలివరీ రిపేర్ ఐటమ్స్ అనగా i) 5.00 HP ఫిట్టింగ్స్ ప్యానెల్ బాక్స్, ii) 2" GI బెండ్, iii) 2" ఫ్లాంజ్, iv) ఫ్లాంజ్ వాషర్లు, v) 1/2"x1 1/2" నట్స్ మరియు బోల్టులు, vi) 1/2"x1 1/2" నట్స్ మరియు బోల్టులు, vii) SS HDPE నిపుల్, viii) 5/16x4 N2, ix) షల్లాక్ థరమ్, x) నట్స్ మరియు బోల్టులు ఇతరాలు మొదలైనవి. (B) ఇంజనీర్-ఇన్-ఛార్జ్ ఆదేశాల మేరకు, పని పూర్తి అయిన దశకు అవసరమైన అలమ్ మరియు బ్లీచింగ్ పౌడర్ మొదలైన వాటి సరఫరా మరియు డెలివరీ. **బిడ్/కొటేషన్ సమర్పణ ప్రారంభ మరియు చివరి తేదీ:** 11-05-2026 ఉ.10:00 నుండి 14-05-2026 ఉ.11:00 వరకు. **బిడ్/కొటేషన్ తెరిచే తేదీ:** 11-05-2026 ఉ.11:10 గం.లకు.

సంప్రదించాల్సిన పేరు & చిరునామా: Dy. E.E - 9849903602 మరియు http://tender.telangana.gov.in

సం/- కమిషనర్, మహబూబాబాద్ మునిసిపాలిటీ

DIPR.No.2171-PP/CL/Advt/1/2026-27, తేది: 08.05.2026

# మహిళా సాధికారతకు చిరునామాగా జిల్లా మహిళా సమాఖ్య భవనాలు

## జూన్ 2న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభానికి ఏర్పాట్లు

## 22 జిల్లాల్లో నిర్మాణాలు.. 17 జిల్లాల్లో పనులు పూర్తి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** గ్రామీణ మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతకు బలమైన వేదికగా నిలిచే జిల్లా మహిళా సమాఖ్య భవనాలు తెలంగాణలో రూపుదిద్దు కుంటున్నాయి. మహిళా సంఘాల కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడం, స్వయం సహాయక సంఘాల మహిళలకు శాశ్వత వేదిక కల్పించడం, మహిళా ఆర్థిక వ్యవస్థను గ్రామీణ స్థాయిలో మరింత విస్తరించడం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ భవనాలను నిర్మిస్తోంది. తెలంగాణ ఆడబిడ్డల ఆర్థిక ప్రగతికి చిరునామాగా నిలిచేలా జిల్లా మహిళా సమాఖ్య భవనాలు సిద్ధమవుతున్నాయి. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2న ఈ భవనాల ప్రారంభానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి సీతక్క కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్రంలోని మొత్తం 22 జిల్లాల్లో జిల్లా మహిళా సమాఖ్య భవనాల నిర్మాణ పనులు చేపట్టగా, ఇప్పటికే 17 జిల్లాల్లో పనులు తుది దశకు చేరుకున్నాయి. ఒక్కో భవనాన్ని సుమారు రూ.5 కోట్ల వ్యయంతో, 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఆధునిక నమూనాలో నిర్మిస్తున్నారు. ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు జిల్లాల్లో పర్యటిస్తూ సమాఖ్య భవన నిర్మాణ పనులను పరుగులు పెట్టిస్తున్నారు. ఇప్పటి వరకు మహిళా సంఘాలకు స్థిరమైన కార్యాలయాలు లేకపోవడంతో సమావేశాలు, శిక్షణా కార్యక్రమాలు, ఉత్పత్తుల ప్రదర్శనలు నిర్వహించడంలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ప్రస్తుతం నిర్మాణం పూర్తవుతున్న ఈ సమాఖ్య భవనాలు మహిళా సంఘాలకు ఒక శాశ్వత కేంద్రంగా మారనున్నాయి. జిల్లా స్థాయిలో మహిళా సంఘాల పరిపాలనా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతోపాటు గ్రామీణ మహిళలకు ఉపాధి, వ్యాపార, మార్కెటింగ్ అవకాశాలు కల్పించే కేంద్రాలుగా పనిచేయనున్నాయి. ఈ భవనాల్లో మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు, డిజిటల్ లిటరసీ కార్యక్రమాలు, బ్యాంకింగ్, ఆర్థిక నిర్వహణపై అవగాహన కార్యక్రమాలు, స్వయం ఉపాధి మార్గదర్శక శిక్షణలు నిర్వహించేందుకు ప్రత్యేక వసతులు కల్పిస్తున్నారు. మహిళా సంఘాలు తయారు చేసే ఉత్పత్తులను ప్రదర్శించి విక్రయించేందుకు ఎగ్జిబిషన్ హాళ్లు, మార్కెటింగ్ సపోర్ట్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా సమావేశ హాళ్లు, శిక్షణా కేంద్రాలు, కార్యాలయ గదులు, సకల సదుపాయాలతో కూడిన ఆధునిక నిర్మాణాలుగా ఈ భవనాలను అభివృద్ధి చేస్తున్నారు.

గ్రామీణ మహిళలు ఒకే వేదికపై చేరి తమ సమస్యలను చర్చించుకోవడం, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన పెంపొందించుకోవడం, కొత్తఉపాధి అవకాశాలను అన్వేషించడం, సంఘాల నిర్వహణలో నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడం వంటి అనేక అంశాలకు ఈ భవనాలు కేంద్ర బిందువుగా నిలవనున్నాయి.

**మహిళా ఆర్థిక స్వావలంబనలో కీలకంగా సమాఖ్య భవనాలు: మంత్రి సీతక్క**

స్వయం సహాయక సంఘాల మహిళలు తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలమైన శక్తి. మహిళలు మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగేందుకు, వారి కార్యకలాపాలకు ఒక శాశ్వత వేదిక అవసరమనే ఆలోచనతో జిల్లా మహిళా సమాఖ్య భవనాలను నిర్మిస్తున్నాం. మహిళలు సమావేశాలు నిర్వహించు కోవడం నుంచి స్వయం ఉపాధి అవకాశాలను విస్తరించుకునే వరకు అన్ని అవసరాలకు ఈ భవనాలు ఉపయోగపడతాయి. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెట్ అవకాశాలు పెరుగుతాయి. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత దిశగా ఇవి కీలక అడుగులు అవుతాయి. తెలంగాణ ఆడబిడ్డల ఆర్థిక ప్రగతికి చిరునామాగా నిలిచే భవనాలు దేశానికే ఆదర్శం కానున్నాయి.

# అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన ఆహారాన్ని పంపిణీ చేయాలి

## ఏమాత్రం నిర్లక్ష్యం చూపినా కఠినచర్యలు: మంత్రి సీతక్క

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** తెలంగాణ ఫుడ్స్ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసే ఆహార పదార్థాల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడొద్దని స్త్రీశిసంక్షేమశాఖ ఉన్నతాధికారులను ఆ శాఖమంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు తెలంగాణ ఫుడ్స్ విభాగం పనితీరులో లోపాలపై సచివాలయంలో శుక్రవారం ఆమె ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. తెలంగాణ ఫుడ్స్‌కు సరఫరా చేస్తున్న సరుకుల్లో నాణ్యత లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ వ్యవస్థ దాదాపు 50 సంవత్సరాల క్రితం 1975 లో ప్రారంభమైందని గుర్తుచేశారు. పేదల కడుపు తడిమి చూసే తల్లిగా పేరుగాంచిన అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ చేతుల మీదుగా ఈ వ్యవస్థ ప్రారంభమైందని తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్లకు టీజీ ఫుడ్స్ ద్వారా సరుకుల సప్లై జరుగు తోందని పేర్కొన్నారు. చిన్నారులకు, గర్భిణీ స్త్రీలకు అందించే ఆహార విషయంలో తప్పనిసరిగా నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు.

# వేసవి సాగునీటి అవసరాల కోసం 18 టిఎంసిలు కావాలి

## కెఆర్ఎంబికి తెలంగాణ నీటిపారుదల శాఖ వినతి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** వేసవి తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్, శ్రీశైలం జలాశయాల నుంచి 18 టీఎంసీల నీటిని విడుదల చేయాలని కృష్ణా నదీ యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి)ని తెలంగాణ నీటిపారుదలశాఖ కోరింది. మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల తాగునీటి అవసరాల కోసం శ్రీశైలం నుంచి 5 టీఎంసీలు, హైదరాబాద్ నగరం, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాల కోసం నాగార్జునసాగర్ నుంచి 13 టిఎం సిలు కలిపి మొత్తం 18 టీఎంసీల జలాలు జూలై చివరి నాటికి అవసరమని బోర్డుకు తెలిపింది. ఈ మేరకు నీటి విడుదలకు అనుమతించాలని కోరింది. ప్రస్తుతం సాగర్, శ్రీశైలం జలాశయాలు అడుగంటిన వేళ వేసవి తాగునీటికి కటకట ఏర్పడే ప్రమాద ముందని, తక్షణమే స్పందించితాగునీటిని విడుద లచేయాలని బోర్డును కోరింది. ఈ నేపథ్యంలో ఇరు రాష్ట్రాల తాగునీటి అవసరాలపై చర్చించి నిర్ణయం తీసుకోవడానికి త్రిసభ్య కమిటీ సమావేశాన్ని నిర్వహిస్తామని, ఇందుకు ఒక తేదీని సూచించాలని రెండు రాష్ట్రాలను కోరింది.

# రాహుల్, రేవంత్‌లను విమర్శిస్తే కెటిఆర్ సంగతి తేలుస్తాం

## ఎంపి బలరాం నాయక్

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలను మరోమారు కెటిఆర్ విమర్శిస్తే ఆయన సంగతి తేలుస్తానని ఎంపి బలరామ్ నాయక్ హెచ్చరించారు. గాంధీభవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ కెటిఆర్ నువ్వు రాజకీయాలకు ,ఈ రాష్ట్రానికి పనికి రావనీ హితవు చెప్పారు. జనాల కొంపలు ముందు బతికిన కెటిఆర్ నిజాయితీ మాకు తెల్వదా నీ బాగోతం మొత్తం బయటపెడుతామనీ హెచ్చరించారు. కెటిఆర్ ఇంకోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే నీ సంగతి చూస్తామనీతగిన మూల్యం చెల్లించుకోక తప్పదనీ హెచ్చరించారు. లాంబాడా లు అంటే కెసిఆర్‌కు చిన్నచూపు. లాంబాడా ను కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి గా నిలబడితే పట్టబట్టి ఓడగొట్టారనీ ఆరోపించారు. తెలంగాణ ఉద్యమం లో పోరాడింది మాత్రం ఎస్సీ, ఎస్టీ, బిసిలు పదవులు పొందింది కెసిఆర్ కుటుంబమనీ విమర్శించారు. రాష్ట్రాన్ని ఆర్థిక ఇబ్బందుల్లో నెట్టింది కెసిఆర్ మాత్రమే అని అని చెప్పారు.

# గ్రీవెన్స్ రిడ్రెస్సల్ అసెస్‌మెంట్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో బీమా విభాగం

## 5వ స్థానంలో బ్యాంకింగ్ రంగం

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** ఆర్థిక సేవల శాఖ యొక్క బీమా విభాగం గ్రీవెన్స్ రిడ్రెస్సల్ అసెస్‌మెంట్ అండ్ ఇండెక్స్ (జిఆర్ఎఐ) ర్యాంకింగ్స్‌లో గ్రూప్ ఎ కేటగిరీలో అగ్రస్థానంలో నిలిచింది. ఆర్థిక సేవల విభాగం (బ్యాంకింగ్, బీమా) ఒక ఆర్థిక సంవత్సరంలో 2.50 లక్షలకు పైగా ఫిర్యాదులను స్వీకరిస్తోంది. నవంబర్ 2025 నుండి, ఇది వివిధ మంత్రిత్వ శాఖలు, విభాగాలలో గ్రీవెన్స్ రిడ్రెస్సల్ అసెస్‌మెంట్ అండ్ ఇండెక్స్ ర్యాంకింగ్‌లలో మొదటి 10 స్థానాలలో స్థిరంగా నిలుస్తోంది. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం విడుదల చేసిన జిఆర్ఎఐ ర్యాంకింగ్‌లో మార్చి 2026 నెలకు గాను, బీమా విభాగం గ్రూప్ ఎ కేటగిరీలో (500 లేదా అంతకంటే ఎక్కువ ఫిర్యాదులను నమోదు చేసినవి) అగ్రస్థానంలో నిలిచింది. మరోవైపు, బ్యాంకింగ్ విభాగం వరుసగా రెండవ నెల కూడా తన 5 వ స్థానాన్ని నిలబెట్టుకుంది. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎఆర్‌పిజీ) అభివృద్ధి చేసిన జిఆర్ఎఐ ఫ్రేమ్‌వర్క్, కేంద్రీకృత ప్రజా ఫిర్యాదుల పరిష్కార, పర్యవేక్షణ వ్యవస్థ (సిపిజిఆర్ఎఎమ్మెస్) ద్వారా ఫిర్యాదుల పరిష్కారంలో మంత్రిత్వ శాఖలు, విభాగాల సమర్థతను, సకాలీనతను మూల్యాంకనం చేస్తుంది. నిరాటంకమైన, కాలపరిమితి, సానుభూతితో కూడిన పరిష్కారం పట్ల బీమా విభాగం నిబద్ధతను ప్రతిబింబిస్తుందని పేర్కొంది. కాగా ఒక ప్రత్యేక ఫిర్యాదుల పరిష్కార విభాగం ప్రతిరోజూ సిపిజిఆర్ఎఎమ్మెస్‌ను పర్యవేక్షి స్తుంది. సీనియర్ అధికారుల సమావేశంలో వారానికోసారి సమీక్షి స్తుంది.



సభలో ప్రసంగిస్తున్న వాణీదేవి, అలేఖ్య పుంజాల, రాంచందర్‌రావు

# సందేశాత్మక లఘు నాటికలే ప్రజల్ని చైతన్యపరుస్తాయి

## ఎమ్మెల్సీ సురభి వాణీదేవి

## ముగిసిన ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ యువ నాటకోత్సవాలు

**హైదరాబాద్ (రవీంద్రభారతి), మే 8, ప్రభాతవార్త :** కళకు సాధ్యం కానిదంటూ ఏదీ లేదని, కళ కళకోసమే కాదు సమాజ చైతన్య, మార్పునకు దోహదపడుతూ ప్రజల్ని చైతన్యపరుస్తుందని, అందులో ముందువరసలో నిలిచేవి నాటికలేనని శాసన మండలి సభ్యురాలు సురభి వాణీదేవి అన్నారు. ఆత్మీయతకు, మానవ త్వానికి, మంచితనం, అసలు మనిషి మనుగడకే ముప్పు తెచ్చిపెట్టిన రెండువైపులా పదునైన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, పనికివచ్చేదానికంటే నాశనమే ఎక్కువ చేస్తుందని అభిప్రాయపడ్డారు. సెల్ పోతే ప్రాణం పోయినంత దుస్థితి నెలకొందన్నారు. ఈనాటి వీధినాటికలో సెల్‌ఫోన్లతో జరుగుతున్న దుష్ప్రభావాలను ఎత్తిచూపుతూ వాటి నుంచి బయటపడాలన్న గొప్పసందేశాన్ని యువత తమ ప్రదర్శనతో అందించడం హర్షదాయకమన్నారు. పాఠ్యాంశాలలో కళలను సబ్జెక్ట్‌గా ప్రవేశపెడితే సమాజచైతన్యానికి ఇతోధికంగా ఉపయుక్తమౌ తుందని అకాడమీ అధ్యక్షురాలు అలేఖ్య పుంజాల కోరారు. తెలంగాణ ప్రజాప్రభుత్వ ప్రజాపాలన ఉత్సవాల్లో భాగంగా తెలంగాణ రాష్ట్ర సంగీత నాటక అకాడమీ ఆధ్వర్యంలో కళారంగంలో యువత ప్రతిభను ప్రోత్సహిస్తూ 3రోజుల యువనాటకోత్సవాల చివరి 3వరోజు ప్రదర్శనలకు ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు ఆచార్య అలేఖ్య పుంజాల, తడకమళ్ల రాంచందర్‌రావు తదితరులతో కలిసి జ్యోతి వెలిగించి ప్రసంగించారు. సభకు ముందు అలీ అహ్మద్ రచన దర్శకత్వంలో నేడు సమాజాన్ని శాసిస్తున్న సెట్‌ఫోన్ మాయాజాలాన్ని కళ్లకు కడుతూ మాయాజాలం.కామ్ దర్పణ్ థియేటర్ వారి నిర్వహణలో వీధినాటకం సందేశాత్మకంగా సాగింది. సభానంతరం గోవాడ క్రియేషన్స్, హైదరాబాద్ వారిచే జ్యోతిరాజ్ భీశెట్టి రచన, డా. వెంకట్ గోవాడ దర్శకత్వంలో అమ్మచెక్కిన బొమ్మ సామాజిక నాటిక; సుమిత్ర యూత్ అసోసియేషన్ మధిర ఖమ్మం వారిచే శారదా ప్రసన్న రచన, డా. నిభానుపూడి సుబ్బరాజు దర్శకత్వంలో రూపొందిన యయాతి పద్య నాటికలు అద్భుతంగా ప్రదర్శితమయ్యాయి. అనంతరం నాటక ప్రదర్శనల్లో పాల్గొన్న యువకళాకారులను ఘనంగా సత్కరించారు. నేటితో మూడురోజుల యువనాటకోత్సవాలు విజయవంతంగా ముగిశాయి.

# మొక్కజొన్న కొనుగోళ్లలో వేగం పెంచాలి



## జిల్లా కలెక్టర్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలి

## ఉమ్మడి జిల్లాల వారీగా ప్రత్యేకాధికారుల నియామకం: మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** మొక్కజొన్న కొనుగోలు ప్రక్రియను వేగంగా, సజావుగా నిర్వహించడం ద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈ యేడాది యాసంగిలో రాష్ట్ర వ్యాప్తంగా మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరగడంతోపాటు అధిక దిగుబడి వచ్చింది. ఇప్పటికే ప్రభుత్వం 1650 కోట్లతో 1.22 లక్షల మంది రైతుల నుండి 6.74 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసింది. అయితే మొక్కజొన్న కొనుగోళ్లలో గోదాముల లభ్యత, హమాలీల కొరత, గన్నీబ్యాగుల లభ్యత, రవాణా వంటి అంశాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి వచ్చింది. ఈ నేపథ్యంలో మక్కల కొనుగోలు ప్రక్రియపై సచివాలయంలో వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి సురేంద్ర మోహన్‌తో మంత్రి తుమ్మల చర్చించారు. మొక్కజొన్న కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి పలు సూచనలు చేశారు. ఆయా జిల్లాల కలెక్టర్లు మొక్కజొన్న కొనుగోళ్లలో కూడా బాధ్యత తీసుకొని కొనుగోళ్లలో వేగం పెంచాలన్నారు. మొక్క జొన్న కొనుగోళ్లలో కలెక్టర్లు పూర్తి బాధ్యత తీసుకోవాలని, మార్క్‌ఫెడ్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ కొనుగోళ్లు, రవాణా సజావుగా జరిగేట్టు చూడాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా రాష్ట్రస్థాయి అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు.

వరంగల్, కరీంనగర్‌కు వ్యవసాయ శాఖ డైరెక్టర్ బి. గోపిని, రాహుల్ రాజ్‌ను మెదక్, ఖమ్మం, యాస్మీన్ బాషాను మహబూబ్‌నగర్, రంగారెడ్డి, కె. చంద్రశేఖర్‌రెడ్డిని ఆదిలాబాద్, డా. కొర్ర లక్ష్మి ని నిజామాబాద్‌కు ప్రభుత్వం ప్రత్యేక అధికారులుగా నియమించింది.

అదేవిధంగా.. కొనుగోలు కేంద్రాల నుండి గోదాముల వరకు రవాణాలో ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ కమిషనర్ ఇలంబర్తిని మంత్రి ఆదేశించారు. రవాణాశాఖ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్‌గౌడ్‌ను నోడల్ అధికారిగా నియమిస్తున్నామని, జిల్లాలో మొక్కజొన్న రవాణాలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా కలెక్టర్లు నోడల్ అధికారితో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అదే విధంగా.. రాష్ట్ర చేనేత, జౌళిశాఖ నిర్వహిస్తున్న స్టేట్ లెవల్ హ్యాండ్లూమ్ ఎగ్జిబీషన్‌ను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని శ్రీనగర్ కాలనీ సత్యసాయి నిగమాగమంలో శుక్రవారం ఎగ్జిబిషన్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను మంత్రి తుమ్మల పరిశీలించారు. స్టాల్స్ నిర్వాహకులతో మాట్లాడారు. ఈ నెల 17 వరకు ఎగ్జిబీషన్ కొనసాగనుంది.

# విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద సోలార్ ప్లాంట్లు

## 9 ఉమ్మడి జిల్లాల్లో 18 ప్లాంట్లు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** తెలంగాణలో గ్రీన్ ఎనర్జీ పాలసీలో భాగంగా, విద్యుత్ సబ్‌స్టేషన్ల సమీపంలో సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ నిర్ణయించింది. రాష్ట్రంలో నూతన పారిశ్రామిక వాడలు, హైస్పీడ్ రైల్ కారిడార్లు, ట్రిపుల్ ఆర్ వంటి అభివృద్ధి ప్రాజెక్టులు రానున్న నేపథ్యంలో డిమాండ్‌కు తగిన విద్యుత్ సరఫరాకు అవసరమైన సబ్‌స్టేషన్లు, అలాగే నూతన సోలార్ పవర్ ప్లాంట్ల నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. ప్రధానంగా విద్యుత్ సబ్ స్టేషన్ల పక్కన సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం ద్వారా సమయం, నిధులు ఖదాతో పాటు, పంపిణీ నష్టాలు కూడా తగ్గుతాయని ప్రతిపాదించారు.

ఈ సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు నిమిత్తం పైలట్ ప్రాజెక్టుగా 9 ఉమ్మడి జిల్లాల్లో, సబ్‌స్టేషన్ల పక్కన ఖాళీ భూమి ఉన్న చోట 18 సోలార్ ప్లాంట్లను నిర్మించనున్నారు. దీని వల్ల పగటిపూట నిరంతరాయంగా 9 గంటల విద్యుత్ సరఫరాకు అవకాశం కలుగుతుందని అధికారవర్గాలు వెల్లడించాయి. అలాగే విద్యుత్ సరఫరాలో ఖర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ (ఎఐ) సాంకేతికత వినియోగానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నారు. హరిత ఇంధన విధానంలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఇందువల్ల నష్టాలు కూడా తగ్గనున్నాయి. సబ్‌స్టేషన్ల పక్కన ఉండటం వల్ల సోలార్ ప్లాంట్లలో ఉత్పత్తి అయిన విద్యుత్ దూరంగా లేకుండా పక్కనే ఉండటంతో ప్రసార నష్టాలు తగ్గుతాయి.

అలాగే సోలార్ ప్లాంట్ నుండి ఉత్పత్తి అయిన విద్యుత్, వెంటనే సబ్‌స్టేషన్ ద్వారా గ్రిడ్‌కు కనెక్ట్ అవుతుందని విద్యుత్ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు. ఇక సోలార్ ప్లాంట్లకు అవసరమైన స్థలానికి సంబంధించిన సమస్యలను కూడా అధిగమించవచ్చని పేర్కొంటున్నారు. సబ్‌స్టేషన్ల పక్కన ఖాళీ భూమిని ఉపయోగించుకోవడం ద్వారా ఈ సోలార్ ప్లాంట్లకు ప్రత్యేకంగా భూమిని సేకరించే పని ఉండదని చెబుతున్నారు. ఈ ప్రతిపాదన సౌర విద్యుత్ ఉత్పాదనను పెంచి, తెలంగాణలో విద్యుత్ గ్రిడ్‌ను మరింత బలోపేతం చేస్తుందని విద్యుత్ శాఖ అధికారులు భావిస్తున్నారు.

# తెలంగాణ ప్రజల పది ప్రశ్నలకు సమాధానం చెప్పి మోడీ పర్యటనకు రావాలి: ప్రభుత్వ విప్ ఆదిశ్రీనివాస్

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** తెలంగాణ ను పాకిస్తాన్ తో పోల్చుతూ బిజెపి ఎంపి తెలంగాణ ప్రజల మనోభావాలను గాయపర్చారనీ భారత ప్రధానమంత్రి తెలంగాణ పర్యటనకు వస్తున్న సందర్భంగా తెలంగాణీయులకు క్షమాపణ చెప్పి ఈగడ్డమీద పాదం మోపాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిఎల్‌పి కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడుతూ దక్షణ భారతదేశంలో ప్రజలు బిజెపి తిరస్కరించారనీ, ఉత్తర భారతదేశంలో కూడా బిజెపికి బుద్ధి చెప్పడం గత లోక్‌సభ ఎన్నికల్లోనే మొదలైందని తెలిపారు. తెలంగాణ లో బిజెపి కి స్థానమే లేదనీ అన్నారు. వచ్చే ఎన్నికలలో తెలంగాణ లో, కేంద్రంలో కాంగ్రెస్ గెలుస్తుందనీ ధీమా వ్యక్తంచేశారు. తెలంగాణలో రాబోయే రోజుల్లో డబల్ ఇంజన్ సర్కార్ ఉంటుందనీ జోస్యం చెప్పారు. తెలంగాణకు ఏం ఒరగబెట్టారని బీజేపీ ప్రజలు గెలిపిస్తారనీ ఆయన ప్రశ్నించారు. హైదరాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రికి ఆది శ్రీనివాస్ పది ప్రశ్నలను సందించారు.

# బిజెపి, బిఆర్ఎస్ వీధుల్లో కొట్లాడుకున్నా చాటుగా బంధం విడదీయరానిదే

జాతీయ జనాభా గణనలో భాగంగా సమగ్ర కుల గణన చేస్తామని హామీ ఇస్తూ, 2025 ఏప్రిల్ 1న ఢిల్లీలో తీసుకున్న కేంద్ర మంత్రివర్గ నిర్ణయానికి ఏమైంది? అని ప్రశ్నించారు. ఏప్రిల్ 1,2026 నుండి ప్రారంభమయ్యే దేశవ్యాప్త గృహ గణన మొదటి దశలో ఒబిసికుటుంబాలను ఎందుకు లెక్కించడం లేదు? అని ప్రశ్నించారు. దేశ వ్యాప్తంగా ఎస్‌సి,ఎస్‌టి,బిసి రిజర్వేషన్లపై ఉన్న 50 పరిమితిని ఎందుకు తొలగించడం లేదు? మీ 11 ఏళ్ల పాలనలో, భారతదేశంలోని 80 కోట్ల మంది వెనుకబడిన ప్రజల సంక్షేమం కోసం ప్రత్యేక ఒబిసి మంత్రిత్వ శాఖను ఎందుకు ఏర్పాటు చేయలేదు?.80 లక్షల కోట్ల కేంద్ర బడ్జెట్‌లో, జనాభాలో దాదాపు 60 శాతం ఉన్న ఒబిసి సంక్షేమానికి కేవలం 2,000 కోట్లు మాత్రమే కేటాయించడం ఎలా సమర్థనీయం? ఎస్సీ, ఎస్టీలకు వారి జనాభాకు అనుపాతంగా రిజర్వేషన్లు ఉన్నాయి, అగ్రవర్ణాలకు కూడా 10శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు ఇచ్చారు. అలాంటప్పుడు ఒబిసి జనాభా నిష్పత్తి ప్రకారం వారికి రిజర్వేషన్లను ఎందుకు పెంచడం లేదు?. జనాభా నిష్పత్తి ప్రకారం ఒబిసిలకు శాసన సభలలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో బీసీ బిల్లును ఎందుకు ప్రవేశపెట్టడం లేదు?. మండల్ కమిషన్ సిఫార్సులను ఇప్పటికీ ఎందుకు పూర్తిగా అమలు చేయడం లేదు? వీటికి ప్రధానమంత్రి సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. బిజెపి, బిఆర్ఎస్ వీధుల్లో కొట్లాడుకున్నా చాటుగా వారి బంధం విడదీయరానిదే అని ఆది శ్రీనివాస్ ఎద్దేవా చేశారు, బిజెపి, బిఆర్ఎస్ ఎన్ని కుప్పిగంతలు వేసినా, వీధి కొట్లాటలు చేసినా ఇద్దరు కలిసే ఉంటారనీరెండు పార్టీలకు తెలంగాణలో స్థానం లేదనీ చెప్పారు. వేములవాడ రాజన్న ఆలయం అభివృద్ధి చేస్తున్నామనీ. భద్రాచలం టెంపుల్ కు నిధులు ఇచ్చామనీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. కరీంనగర్ దోపిడి పైన దర్యాప్తు జరుగుతోందనీ పోలీసులు దొంగలను పట్టుకుంటారనీ తెలిపారు. గన్ కల్చర్, డ్రగ్స్ కల్చర్ పైన కఠిన చర్యలు తీసుకుంటామనీ అన్నారు. తెలంగాణ లో పోలీసులు సమర్థవంతంగా పనిచేస్తున్నారనీ కితాబు ఇచ్చారు.

# వ్యక్తికి మానవత్వం, క్రమశిక్షణే ప్రధానం

## వ్యవసాయ కళాశాల దినోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలదేవి

## విశ్వవిద్యాలయాలు విజ్ఞాన, పరివర్తన కేంద్రాలు: విసి అల్దాస్ జానయ్య

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** మొబైల్ కారణంగా ప్రపంచమే మనిషి చేతిలో ఉంటున్న ఈ కాలంలో మానవత్వం, క్రమ శిక్షణతో సమాజంలో ఉత్తమ మనుషులుగా గుర్తింపు పొందాలని వ్యవసాయ విద్యార్థులకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ తిరుమలాదేవి సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాల 80వ కాలేజీ డే ఉత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి రాష్ట్ర హైకోర్టు జడ్జి జస్టిస్ తిరుమలాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 40 ఏళ్ల క్రితం తాను కమ్యూనిటీ సైన్స్,బిఎస్సి, ఎంఎస్సి కోర్సులను ఇక్కడే చదివానన్నారు. క్రమశిక్షణ, విలువలు ఇక్కడే నేర్చుకున్నానని తెలిపారు. పౌష్టికాహారం, వంటలు, టెక్స్ టైల్స్ వంటి కీలక సబ్జెక్టులు తాము ఆనాడు హోమ్ సైన్స్ కోర్సులో చదివామని వివరించారు. నేడు ప్రతి ఒక్కరూ శారీరక సౌష్టవం గురించి మాట్లాడుతున్న తరుణాన ఆ కోర్సు ఎంత ఉపయుక్తం గా ఉంటుందన్న విషయాన్ని గుర్తించాలన్నారు. విశ్వ విద్యాలయంలో వృద్ధులకు వెల్‌నెస్ సెంటర్ ప్రారంభించడం వంటి మంచి కార్యక్రమాలు చేపట్టినందుకు విసిని అభినందించారు. ఈ సందర్భంగా విసి జానయ్య మాట్లాడుతూ... ముగ్గురు ప్రధాన మంత్రులు, ఒక ఉప రాష్ట్రపతి చేతుల మీదుగా ప్రారంభమైన ఈ విశ్వవిద్యాలయం అనేక రంగాలకు ఎందరో ప్రముఖులని ఆందించిందన్నారు. తాను విసిగా అమలు చేసే నిబంధనల్లో కొన్ని కఠినంగా అనిపించినా విద్యార్థుల కోసమే ఆ నిర్ణయాలు తీసుకున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ డాక్టర్ విద్యాసాగర్, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె. ఝాన్సీ రాణి, డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్స్ డాక్టర్ సీ. హెచ్. వేణుగోపాలరెడ్డి, డీన్ ఆఫ్ పీజీ స్టడీస్ డాక్టర్ ఈశ్వరి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సి. నరేంద్రరెడ్డి, కళాశాల విద్యార్థి వ్యవహారాల ఇంచార్జి డాక్టర్ వి. రామ్‌రెడ్డి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని తక్షణమే కొనుగోలు చేయాలి

## తెలంగాణ రైతు ఐక్య వేదిక విజ్ఞప్తి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని, అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని ఏలాంటి ఆంక్షలు లేకుండా తక్షణమే కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ రైతు ఐక్యవేదిక విజ్ఞప్తి చేసింది. కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో గన్నీ సంచులను, లారీలను, హమాలీలను సమకూర్చడంలో తీవ్ర జాప్యం జరుగుతోందని పేర్కొంది. ఈ విషయమై తెలంగాణ రైతు ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శేర్ నర్సా రెడ్డి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం తూకం వేసిన వెంటనే రైతులకు తక్ పట్టి కొనుగోలు రసీదును తప్పనిసరిగా ఇచ్చేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. తప్ప, తాలు పేరిట తరుగును తీస్తూ రైతులను నిట్టనిలువునా దోపిడీకి గురి చేస్తున్న రైస్ మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన, రంగు మారిన వరి ధాన్యాన్ని తరుగు లేకుండా ఎలాంటి ఆంక్షలు విధించకుండా కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేయాలన్నారు.

# అమెజాన్ ఆఫీసుకు కెజిబివి విద్యార్థులు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వపాఠశాల సంచాలకులు ఆధ్వర్యంలో శుక్రవారం అమెజన్ కార్యాలయంకు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంకు చెందిన 50 విద్యార్థులకు కొత్త నైపుణ్యవిద్య నేర్చుకొనే కార్యక్రమం నిర్వహించారు. టీమ్‌వర్క్, లాజికల్‌రీజినింగ్ గణన ఆలోచనలు టెక్నికల్ కెరియర్ వంటి అంశాలను అక్కడ వివరించారు. విద్యార్థులకు క్లాస్ రూమ్ లెర్నింగ్ ప్రాక్టికల్ భవిష్యత్ కెరియర్ అనుసంధానంతో ఈ ఎక్స్ పోజర్ నిర్వహించారు. విద్యార్థులకు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ కంప్యూటేషనల్ థింకింగ్ కమ్యూనికేషన్ సహకారం సమస్యపరిష్కారం వంటి భవిష్యత్ సన్నద్ధమైన నైపుణ్యాలను అక్కడ విద్యార్థులకు వివరించారు, విద్యార్థులకు విలువైన వాస్తవ ప్రపంచ సాంకేతిక అభ్యాస అవకాశాలను పొందడానికి పట్టుదలవుంటే ఎలా అభివృద్ధి చెందాలో వివరించారు.

# కెటిఆర్‌ను, పాడి కౌశిక్‌రెడ్డిని నియంత్రించే బాధ్యత కెసిఆర్‌దే

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి తెలంగాణ హీరోలమని అనుకుం టున్నారు కాని వారి భాషతో జీరోలు అవుతున్నారని, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ వారిని నియంత్రించే బాధ్యత తీసుకోవాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం విన్నవించారు. సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ కరీంనగర్ లో బిజెపి,బిఆర్ఎస్ రెండు పార్టీల నాయకులు వీధి రౌడీల్లా కొట్టుకున్నారనీ ఇలాంటి దాడులను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండించడంతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం గుండాయిజంను ఉపేక్షి ంచదనీ అన్నారు. శనివారం కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో తలపెట్టిన బిఆర్ఎస్ బంద్ లో ఎట్టి పరిస్థితుల్లో ఎవరూ పాల్గొనవద్దని ఆయన కోరారు. వరంగల్ సభలో కెటిఆర్ అసనహంతో మా సిఎం పైన తీవ్ర పదజాలంతో దూషించాడనీ కౌషిక్ రెడ్డి అసెంబ్లీలో సిఎం, సీనియర్ ఎమ్మెల్యే , దళిత నేత కడియం శ్రీహరి పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో ఎథిక్స్ కమిటీకి ఫిర్యాదు చేశామనీ తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఆరోగ్యవంతమైన చర్చలు ఉండాలనీ మాజీ సిఎం కెసిఆర్ తన కొడుకు ను, కౌషిక్ రెడ్డి లాంటి వాళ్లను కంట్రోల్ చేయాలనీ లేకుంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనీ హెచ్చరించారు. కౌషిక్ రెడ్డి శాసనసభ్యత్వాన్ని రద్దు చేయాలి. బిజెపి చేస్తున్న హింసను తెలంగాణ ప్రజలు ఒప్పుకోరనీ అన్నారు. బిఆర్ఎస్ వాళ్ళు కూడా ఒళ్లు, నోరు దగ్గర పెట్టుకుంటే మంచిదనీ,భాష అదుపులో పెట్టుకోవాలి. హుందాగా ఉండాలనీ ఆయన కోరారు. మాపై అసభ్యపదాలతో విమర్శలు చేస్తున్నా సంయమనం పాటించాలని మా ముఖ్యమంత్రి మాకు చెపుతున్నారనీ భాష మార్చుకోకపోతే తెలంగాణ ప్రజలు తిరగబడ తారనీ ఆయన హెచ్చరించారు. తెలంగాణ ప్రజలు తిరగబడి కొట్టే పరిస్థితిని బిఆర్ఎస్ నాయకులు తెచ్చుకోవద్దనీ కోరారు. కెటిఆర్ డ్రగ్స్, పబ్ కల్చర్ తెచ్చారనీ ఆరోపించారు. నేరెళ్లలో ఇసుక దందాకు అడ్డు వస్తున్నారని దళితులను సంసారాలకు పనికి రాకుండా చేశారనీ ఆవేదన చెందారు. బిజెపి బిఆర్ఎస్ నాయకుల కల్చర్ ను ప్రజలు సహించరనీ చెప్పారు. పశ్చిమబెంగాల్ లో గెలిచామన్న ఆలోచనతో బిజెపి నేతలు హింసా రాజకీయాలు చేస్తున్నారనీ ఆరోపించారు. బిఆర్ఎస్ హయాంలో ఎన్నో నిర్భందాలను చూశామనీ హిట్లర్ ను తలపించే విధంగా జరిగిన పరిపాలనను తెలంగాణ ప్రజలు మరిచిపోలేదనీ ఆయన చెప్పారు. తెలంగాణ ప్రజలు ఆకలినైనా సహిస్తారు కాని ఆత్మాభిమానాన్ని వదులుకోరనీ బిజెపి ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని తెలంగాణ ఏర్పాటుపై అవాకులు చెవాకులు పేలుతున్న బిజెపి నాయకులు ఏముఖంతో ఓట్లకోసం ఈ గడ్డపై కాలుమోపుతారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పోవాలని మీరు తప్ప తెలంగాణ ప్రజలు కోరుకోవడం లేదనీ రేవంత్‌రెడ్డి మరో పదేళ్లు రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు.

## ఆదాయపు పన్నుపై అవగాహన సదస్సులు

### టిజి, ఏపిల్లో 22 చోట్ల కార్యక్రమాలు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** ఆదాయపు పన్ను శాఖ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో పన్ను చెల్లింపులపై అవగాహన సదస్సులను ప్రారంభించింది. హైదరాబాద్‌తో పాటు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లోని మరో 22 ప్రాంతాల్లో కూడా ప్రారంభ్ 2026 పేరుతో ఒకేసారి శుక్రవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖ అధికారులు మెగా పన్ను చెల్లింపుదారుల అవగాహన కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్‌లోని అమరావతి ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఆదాయపు పన్ను చట్టం 2025పై ప్రజల్లో అవగాహన కల్పించడమే లక్ష్యంగా నిర్వహించారు. ఇందులో కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి (సీబీడీటీ) సభ్యుడు సంజయ్ బహదూర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సరళీకృత ఆదాయపు పన్ను చట్టం-2025 అమలులోకి వచ్చిన నేపథ్యంలో దేశవ్యాప్తంగా చేపట్టిన అవగాహన కార్యక్రమాల్లో భాగంగా ప్రారంభ్ 2026 నిర్వహిస్తున్నారు. ఈ కొత్త చట్టం 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఈ అవగాహనా కార్యక్రమాల్లో ఆదాయపు పన్ను శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ ప్రదీప్, డా.కిరణ్‌కుమార్, డా.చేతన్‌రెడ్డి తదితరులు

## వైద్యుల పట్ల సుప్రీం తీర్పును పునఃసమీక్షించాలి

### తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** ఓవైద్యుని నిరక్ష్యం పట్ల ఇటీవల సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పును పునసమిక్షించుకోవాలని తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ కోరింది. ఒక్క వైద్యుని నిరక్ష్యాన్ని దేశవ్యాప్తంగాసేవలు చేసే వైద్యులకు ఆపాదించడం ఈ తీర్పు వల్ల స్పష్టమవుతోందని, దీంతో నూతనంగా వైద్య రంగంలోకి వచ్చే వైద్యులు ఆందోళన చెందుతున్నారని ఫెడరేషన్ ఆవేదన వ్యక్తం చేసింది. ఈమేరకు శుక్రవారం హైదరాబాద్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డాక్టర్స్ లీగల్ హెయిర్స్ లయబుల్ ఫర్ మెడికల్ నెగ్లిజియన్స్ అండర్ కన్స్యూమర్ ప్రొటక్షన్ యాక్ట్ అన్న అంశం పై వారు మాట్లాడుతూ మాట్లాడుతూ కుముద్ లాల్ వర్సెస్ సురేష్ చంద్ర రాయ్ కేసులో సుప్రింకోర్టు ఇచ్చిన తీర్పును ప్రస్తావించారు. సదరు కేసులో వైద్యుడు మరణించినప్పటికీ అతని వారసులను భాద్యులుగా చేయడమైందని తెలిపారు. వైద్యులు ఉద్దేశ పూర్వకంగా రోగికి అన్యాయం చేయాలని చూడరని, వైద్యుని నిరక్ష్యం కారణంగా అతని కుటుంభ సభ్యులను భలిచేయడం అన్యాయమన్నారు. టీడీఎస్ అద్వర్యంలో తాము కోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, ఈ తీర్పు వల్ల దేశ వ్యాప్తంగా వైద్యులు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకోవాలని కోరారు. తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ అద్వర్యంలో తాము ప్రజా సంక్షేమం కోసం పాటు పడుతున్నామని, అర్హత లేని వైద్యులు చేసే సేవలను నిరోధించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అర్హత లేని వైద్యుల కారణంగా అసలు వైద్యులు అప్రతిష్టకు గురి కావల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈసమావేశంలో తెలంగాణ డాక్టర్స్ ఫెడరేషన్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ చేతన్‌రెడ్డి, ట్రెజరర్, డా.ప్రదీప్, డా. అన్వేష్, డా.సురేష్, డా.కిరణ్‌కుమార్ పాల్గొన్నారు. చేతన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతలను ఛీత్కరిస్తున్న తెలంగాణ ప్రజలు

### బిజెపిఎల్‌పి ఉపనేత పాయల్ శంకర్

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ నేతలను తెలంగాణ ప్రజలు ఛీత్కరిస్తున్నారని బిజెపిఎల్‌పి ఉప నేత పాయల శంకర్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిఆర్ఎస్ నేతలను చీత్కరిస్తున్న వారిలో మార్పు రాకపోవడం సిగ్గు చేటు అన్నారు. ఏ ప్రజా సమస్యల పరిష్కారం కోసం బిఆర్ఎస్ నేతలు కరీంనగర్ బంద్‌కు పిలుపు ఇచ్చారు? అంటూ ప్రశ్నించారు. బిజెపి కార్యకర్తల ఆగ్రహానికి కారణం పాడి కౌశిక్ రెడ్డి నోటి దురుసు ఫలితమే అన్నారు. ఇందులో ప్రజా కోణం ఏముంది? అంటూ ప్రశ్నించారు. కరీంనగర్ బంద్ పేరుతో బిఆర్ఎస్ నేతలు అరాచకం చేయాలనుకుంటున్నారా? అన్నారు. ప్రజా సంగ్రామ యాత్రలో బిజెపి కార్యకర్తల తలలు పగలకొట్టినప్పుడు దాడులు చేయడం తప్పని గుర్తుకు రాలేదా? అని, వడ్ల కొనుగోలు కేంద్రాల పరిశీలనకు వెళ్లినప్పుడు బిజెపి నాయకుల వాహనాలను ధ్వంసం చేసినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకు రాలేదా? అన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజా సమస్యలపై నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి కార్యకర్తలపై లాఠీఛార్జ్ చేయించి అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపినప్పుడు తప్పని గుర్తుకు రాలేదా? అన్నారు. బిఆర్ఎస్ బంద్ పిలుపులో ప్రజా శ్రేయస్సు ఎక్కడుందో బిఆర్ఎస్ నేతలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిజెపి కార్యకర్తల, కరీంనగర్ ప్రజల మంచి తనాన్ని, సహనాన్ని చేతగాని తనంగా చూస్తూ ఊరుకోవాలా? అని, అసలు ఈ వివాదానికి మూల కారకుడు కెటిఆర్ కాదా? అన్నారు. కాందిశీకుల భూముల వ్యవహారంలో సిఎంతో, బండి సంజయ్ కుమ్మక్కయ్యారని, ఆధారాలను బయట పెడతామని అడ్డగోలు ఆరోపణలు చేసింది కెటిఆర్ కాదా? అని ప్రశ్నిం చారు. 48 గంటల్లో ఆ ఆధారాలను బయటపెట్టాలని డిమాండ్ చేస్తే తోకముడించింది కెటిఆర్ కాదా? అన్నారు. ఆధారాల్లేక పోవడంతో ప్రజల దృష్టిని దారి మళ్లించేందుకు బిఆర్ఎస్ చెంచాలతో బూతులు తిట్టిస్తూ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతుంది కెటిఆర్ కాదా? అన్నారు. బిఆర్ఎస్ నేతలు ఇకనైనా బుద్ధి తెచ్చుకుని ప్రజాసమస్యలపై పోరాడాలని, లేనిపక్షంలో ఈసారి ప్రతిపక్ష హోదా కూడా దక్కదన్నారు.

## ఉజ్జయిని సన్వార్ రోడ్డుపై చెట్టుకింద రూ.2.83 కోట్ల కరెన్సీనోట్లు

### సంచుల్లో ఎక్కువశాతం నకిలీ కరెన్సీయే ఉందని గుర్తింపు

**భోపాల్, మే 8:** రాష్ట్రంలోని సన్వార్ ఉజ్జయిని రోడ్డులో 2.83 కోట్ల విలువయిన కరెన్సీ నోట్లు ఉన్న మూడు సంచులను పోలీసులు స్వాధీనంచేసుకున్నారు. స్థానిక రైతు ఒకరు ఈమూడు సంచులను గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. భుట్టా స్క్వేర్‌సమీపంలో ఒక చెట్టుకింద ఈ సంచులు ఉన్నట్లు చూసి పోలీసులకు తెలిపాడు. వెంటనే పోలీస్ ప్రత్యేక బృందం ఆ ప్రాంతానికి వెళ్లి ఈ మూడు సంచులను స్వాధీనం చేసుకుని అక్కడే తెరిచి చూసిం ది. రూ.500 నోట్లు ఉన్న వందలాది కట్టలు ఈ సంచుల్లో బయటపడ్డాయి. మొత్తం కరెన్సీ విలువ రూ.2.83 కోట్లవరకూ ఉంటుందని తేలింది. అయితే పోలీసుల సమగ్ర పరిశీలనలో కొన్ని చెలామణిలో ఉన్న కరెన్సీ నోట్లతోపాటు ఎక్కువ నోట్లకట్టలు బోగస్ కరెన్సీ మాత్రమే ఉందని తెలిపారు. మరికొన్ని సంచుల్లో కేవలం రంగుల పేపర్ నోట్లకట్టలు మాదిరిగా కట్టి ఉన్నట్లు తేలింది. అక్రమ ఆర్థిక లావాదేవీలకోసం ఈ కరెన్సీని సిద్ధంచేస్తున్నట్లుగా పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ప్రాంతం మొత్తం తమ అదుపులోకి తీసుకున్న పోలీసులు సమగ్ర దర్యాప్తులోకి దిగారు. హైవే సిసిటివి ఫుటేజి, సమీపంలోని ప్రాంతాల సిసిటివి ఫుటేజిని పరిశీలిస్తున్నారు. ముందు ఎవరు ఈ ప్రాంతంలో ఈసంచులను ఎందుకు ఉంచారన్న అంశంపై పరిశీలిస్తున్నారు.



# దేశవ్యాప్తంగా 212 ఖనిజ బ్లాక్‌ల వేలం

### అందుబాటులోకి 101 బ్లాక్‌లు

### రాష్ట్రాల సమన్వయం, సంస్కరణలతో సాధ్యం

### కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వెల్లడి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా 2025-26 ఆర్థిక సంవత్సరంలో వివిధ ప్రాంతాల్లో 212 ఖనిజ బ్లాక్‌లు వేలం వేసినట్లు కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. 2015లో వేలం విధానం ప్రవేశపెట్టినప్పటి నుండి, వేలం వేయబడిన 101 ఖనిజ బ్లాక్‌లను విజయవంతంగా కార్యాచరణలోకి తీసుకు రావడంతో దేశం ఖనిజ రంగం ఒక చారిత్రాత్మక మైలురాయిని సాధించినట్లు ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ఈ ముఖ్యమైన విజయం, రాష్ట్ర ప్రభుత్వాలతో సన్నిహిత సమన్వయంతో గనుల మంత్రిత్వ శాఖ చేపట్టిన సంస్కరణల పరివర్తనాత్మక ప్రభావాన్ని నొక్కి చెబుతోంది. ఇది విక్సిత్ భారత్ 2047 మరియు ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు దోహదపడుతోందని తెలిపింది. వేలం విధానాన్ని ప్రవేశపెట్టినప్పటి నుండి, భారతదేశం పారదర్శకమైన మరియు పోటీతత్వంతో కూడిన ఖనిజ వనరుల కేటాయింపులో అపూర్వమైన పురోగతిని సాధించినట్లు వెల్లడించింది. 101 బ్లాక్‌లను వినియోగంలోకి తీసుకు రావడం అనేది, ఖనిజ వనరులను వేలం వేయడంపైనే కాకుండా, వాటిని సకాలంలో ఉత్పత్తిలోకి తీసుకు రావడంపై కూడా మంత్రిత్వ శాఖకు ఉన్న నిరంతర దృష్టిని స్పష్టం చేస్తుందని పేర్కొంది. నిరంతర విధానపరమైన మద్దతు, ప్రక్రియల సరళీకరణ, మరియు చురుకైన పర్యవేక్షణ ద్వారా, చట్టబద్ధమైన అనుమతులను వేగవంతం చేయడానికి, ఆమోదాలను సులభతరం చేయడానికి, వాటి అమలులో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించడానికి గనుల మంత్రిత్వ శాఖ రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి పనిచేసిందని తెలియచేసింది. ఈ సమన్వయ కేంద్రరాష్ట్ర విధానం, వేలం వేయబడిన ఖనిజ బ్లాక్‌లను కేటాయింపు నుండి ఉత్పత్తి దశకు మార్చే ప్రక్రియను గణనీయంగా వేగవంతం చేసిందని వెల్లడించింది. కార్యాచరణలోకి వచ్చిన ఈ బ్లాక్‌లు దేశీయ ఖనిజ ఉత్పత్తిని పెంచడానికి, కీలక పరిశ్రమలకు ముడి పదార్థాల భద్రతను బలోపేతం చేయడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి మరియు మొత్తం ఆర్థిక వృద్ధికి మద్దతు ఇవ్వడానికి గణనీయంగా దోహదపడుతున్నాయని పేర్కొంది. ఇక రాష్ట్రాలలో ఒడిశా 34 కార్యాచరణలో ఉన్న బ్లాక్‌లతో అగ్రస్థానంలో ఉండగా, ఆ తర్వాత కర్ణాటక 18 బ్లాక్‌లతో, గుజరాత్ 11 బ్లాక్‌లతో ఉన్నాయి. అలాగే మధ్యప్రదేశ్ (10), రాజస్థాన్ (8), గోవా (6), ఆంధ్రప్రదేశ్ (5), ఛత్తీస్‌గఢ్ (5), మహారాష్ట్ర (3), మరియు అస్సాం (1). ముఖ్యంగా, అస్సాం లెటర్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసిన కేవలం తొమ్మిది నెలల్లోనే తన బ్లాక్‌ను కార్యాచరణలోకి తెచ్చింది. ఇది పరిపాలనా సామర్థ్యాన్ని మరియు సమర్థవంతమైన సమన్వయాన్ని ప్రదర్శిస్తుందని స్పష్టం చేసింది. వినియోగంలోకి వచ్చిన బ్లాక్‌ల్లో ఇనుప ఖనిజం 47 బ్లాక్‌లలో ఉండగా, దాని తర్వాత సున్నపురాయి 29 బ్లాక్‌లలో ఉంది. ఈ పోర్ట్‌ఫోలియోలో బాక్సైట్, మాంగనీస్ ఖనిజం, క్రోమైట్, ఉక్కు, సిమెంట్, అల్యూమినియం, మౌలిక సదుపాయాలు వంటి కీలక రంగాలకు మద్దతు ఇచ్చే ఇతర అనుబంధ ఖనిజాలు కూడా ఉన్నాయని గనుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

# సంక్షేమ కిచెన్‌లో నిఘా నేత్రాలు

### ఫుడ్‌పాయిజన్‌కు చెక్.. సేఫ్టీ అధికారుల తనిఖీలు

### ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ గురుకులాలపై ఫోకస్

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని సంక్షేమ గురుకులాల్లో తరచూ ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు జరుగుతున్న నేపథ్యంలో సర్కార్ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఫుడ్ పాయిజనింగ్‌పై ప్రత్యేక నిఘా పెట్టాలని సంక్షేమ శాఖ అధికారులు ఇప్పటికే ప్రతిపాదించారు. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని సంక్షేమ గురుకులాల కిచెన్‌లలో ఇక నుంచి అత్యాధునికమైన సీసీకెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ గురుకులాల్లో ఈ కెమెరాలను ఫిట్ చేయనున్నారు. ఇప్పటికే గురుకులాల సెఫ్టీలో భాగంగా ప్రాంగణంలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ, నేరుగా కిచెన్ లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉన్నదని భావిస్తోంది. దీంతో పాటు అడిషనల్ కలెక్టర్లు, స్థానిక నేతలు, అధికారులతో వేసిన కమిటీలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించుతాయి. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే కలెక్టర్లకు జారీచేయనున్నది. వానాకాలం సీజన్ షురూ కాగానే రెగ్యులర్‌గా గురుకులాల్లో ఫుడ్ పాయిజన్ ఘటనలు ప్రభుత్వాన్ని ఇరకాటంలో పడేస్తున్నాయి. దీంతో ఫుడ్ పాయిజన్ ఘటనలను సీరియస్‌గా తీసుకున్న సర్కార్ స్పష్టమైన యాక్షన్ ప్లాన్, సెక్యూరిటీ మెజర్స్‌తో ముందుకెళ్లాలని భావిస్తోంది. కాగా ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా ఏ గురుకులాల్లోని కిచెన్ లలోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయలేదు. అయితే ఈ దఫా తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిందేనని ప్రభుత్వం ఆదేశాలున్నాయి. ఈ కెమెరాలు ఏర్పాటు వెనక బలమైన కారణం ఉన్నదనే విషయాన్ని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు ప్రభుత్వానికి ప్రత్యేక రిపోర్టు కూడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. గత ఏడాదిలోనూ ఎక్కువగానే సంభవించాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఘటనలపై వివిధ రూపాల్లో రహస్య విచారణ చేయించినట్లు తెలియవచ్చింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ఒక వేళ చేసిన స్పష్టమైన ఆధారాలను పసిగట్టేందుకు సంక్షేమ గురుకులాల కిచెన్లలోనూ సీసీకెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు సంక్షేమ శాఖల అధికారుల ద్వారా వెల్లడవుతోంది. ఈ సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానించనున్నారు. అక్కడ్నుంచి ప్రత్యేక టీమ్ సంక్షేమ గురుకులాలను మానిటరింగ్ చేయనున్నాయి. దీనితో పాటు, ఇక ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్లు కూడా రహస్య తనిఖీలు చేయనున్నారు. ఎప్పటికప్పుడు శాంపిల్స్ సేకరించి టెస్టులు నిర్వహించనున్నారు. నిరక్ష్యం వహించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకునేలా యాక్షన్ ప్లాన్ కూడా రెడీ అవుతున్నట్లు తెలుస్తోంది.

## వాట్సాప్ ద్వారా మద్దతు కోరడమేమిటి?

### టివికె తీరును తప్పు పట్టిన సింథనై సెల్వన్

**చెన్నై, మే 8:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో భారీ విజయం సాధించిన విజయ్ నేతృత్వంలోని టీవీకే కొత్త ప్రభుత్వం ఏర్పాటు కోసం చిన్న పార్టీల మద్దతు కోరిన వివాదమే ఇపుడు జాప్యానికి కారణం అయింది. వాట్సాప్ ద్వారా మద్దతు కోరడాన్ని వీకేసీ తప్పుపట్టింది. టీవీకే వైఖరి అహంకా రమని విమర్శించింది. వీసీకే ప్రధాన కార్యదర్శి సింథనై సెల్వన్ శుక్రవారం ఎక్స్‌లో ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి స్పష్టమైన మెజారిటీ సాధించని పరిస్థితుల్లో, విజయ్ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించి ఉండాల్సింది. ఆయన మద్దతు కోరుతున్న పార్టీల నాయకులను వెంటనే ముఖాముఖిగా కలవాలి కదా అని పేర్కొన్నారు. టీవీకేలోని ద్వితీయ శ్రేణి నాయకులు విజయ్‌ను తప్పుదారి పట్టిస్తున్నారని సింథనై సెల్వన్ ఆరోపించారు. గవర్నర్ ద్వారా తమిళనాడులోకి ప్రవేశించ కుండా బీజేపీని నిరోధించాల్సిన ప్రాముఖ్యత గురించి ఆయన (విజయ్) బహిరంగంగా చర్చించి ఉండాల్సింది కాదా ఒక వాట్సాప్ సందేశం ద్వారా మద్దతు కోరి, కేవలం తిరిగి సమాధానం ఇవ్వమని అడగడాన్ని మేమెలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. మరోవైపు ఎన్నికల ఫలితాల తర్వాత టీవీకేలోని కొన్ని వర్గాలు అహంకారం ప్రదర్శిస్తున్నాయని వీసీకే ప్రధాన కార్యదర్శి ఆరోపించారు. కూటమి నిర్మాణానికి అవసరమైన రాజీ ధోరణిని అవలంబించకుండా డీఎంకేపై దాడి చేస్తూ, ప్రతీకార ధోరణిలో మాట్లాడటాన్ని కూడా ఆయన విమర్శించారు. డీఎంకేను రాచరిక రాజకీయాలు అని పిలుస్తూ, ఆ తర్వాత ఏమాత్రం సంకోచం లేకుండా దాని మిత్రపక్షాల మద్దతు కోరడంలో తర్కం ఏమిటి అని సింథనై సెల్వన్ ప్రశ్నించారు. వీసీకే నేతలు ఆ పార్టీలో స్లీపర్ సెల్స్‌గా వ్యవహరిస్తున్నారని టీవీకే నేతలు చేసిన వ్యాఖ్యలను కూడా తీవ్రంగా వ్యతిరేకించారు. ఎన్నికల తర్వాత తమ ఎమ్మెల్యేలను రిసార్ట్‌లకు తరలించాలన్న టీవీకే నిర్ణయాన్ని సింథనై సెల్వన్ తప్పుపట్టారు. తమిళనాడులో రిసార్ట్ రాజకీయాలను టీవీకే తిరిగి ప్రవేశపెట్టిందన్నారు. రాష్ట్రంలో పెద్ద రాజ్యాంగ సంక్షోభం తలెత్తవచ్చని ఆయన హెచ్చరించారు. తమిళనాడులో గవర్నర్ పాలన విధించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని సెల్వన్ ఆరోపించారు. ప్రజాస్వామ్య నియమాలను అతిక్రమించే ఏ చర్య పట్ల అయినా తమిళనాడు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు.



# రక్షణ రంగంలో హైదరాబాద్‌ది సుస్థిర స్థానం

### నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** భారత రక్షణ రంగంలో సంభవిస్తున్న విప్లవాత్మక మార్పులకు తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ కేంద్ర బిందువుగా మారిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా ఏరోస్పెస్, డిఫెన్స్ రంగాలు రాష్ట్ర రాజధానిలో శరవేగంగా పురోగమనం వైపు పయనిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సి.ఏ.జి.ఆర్ ఎగుమతులలో తెలంగాణా రాష్ట్రం 103శాతం సంయుక్త వార్షిక వృద్ధి రేటు నమోదు చేసుకోవడమే ఇందుకు నిదర్శనమన్నారు.

అటు ఏరోస్పెస్ ఇటు డిఫెన్స్ రంగాల్లో ఇప్పటికే తెలంగాణా రాష్ట్రంలో 1500 కు పైగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలలో కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఎం.ఎస్.ఎం.ఇ స్పార్క్ 3.0 కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రపంచం లోనే అతిపెద్ద ఆయుధ దిగుమతి దారులలో ఒకటిగా ఉన్న భారతదేశం ఇప్పుడు 100కు పైగా దేశాలకు రక్షణ సామగ్రిని ఎగుమతి చేసే స్థితికి ఎదగడం చారిత్రాత్మక పరిణామంగా అభివర్ణిం చారు. స్వాతంత్ర్యం సిద్ధించాక అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాల హయాంలోనే దేశ రక్షణ రంగానికి బలమైన పునాదులు నిర్మించడం వల్లనే ఇప్పుడు భారతదేశం ప్రపంచదేశాలకు మార్గదర్శనంగా నిలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు రక్షణ రంగంపై నిర్ణయాత్మక నిర్ణయాలు తీసుకున్నందునే దేశ రక్షణకు అవసరమైన ఆయుధ సంపత్తిలో 60శాతానికి మించి సమకూర్చుకుందని ఆయన పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో ప్రపంచ మార్కెట్ లో 10 లక్షల కోట్ల మేర మార్కెట్ అవకాశాలు రక్షణ రంగానికి లభించే అవకాశాలు ఉన్నాయన్నారు.




# ప్రభుత్వ బడి.. ప్రగతికి అద్దం

### తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు సిఎం రేవంత్‌రెడ్డి కలల ప్రాజెక్టు

### ఆరుట్ల పాఠశాల తెలంగాణ విద్యా విధానానికి రోల్‌మోడల్

### రాష్ట్ర విద్యాకమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** తెలంగాణ విద్యావ్యవస్థలో సరికొత్త విప్లవానికి నాంది పలుకుతున్న తెలంగాణ పబ్లిక్ స్కూల్ (ఆరుట్ల)ను రాష్ట్ర ప్రభుత్వ విప్‌ల బృందం సందర్శించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రీమ్ ప్రాజెక్ట్‌లో భాగంగా పైలెట్ ప్రాజెక్టుగా రూపు దిద్దుకున్న ఈ పాఠశాల పనితీరును, అక్కడ అందుతున్న విద్యా సౌకర్యాలను విప్‌లు స్వయంగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, బీర్ల ఐలయ్య, బల్మూరి వెంకట్, విజయరమణా రావు, రామచంద్ర నాయక్, అద్దంకి దయాకర్, వేముల వీరేశంతో పాటు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి పాల్గొన్నారు. ఇక తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళి, కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ చారకొండ వెంకటేష్, ప్రొఫెసర్ పి.ఎల్. విశ్వేశ్వర్‌రావు విప్‌లకు పాఠశాల విశేషాలను వివరించారు.


ప్రభుత్వ విప్‌ల బృందానికి తెలంగాణ విద్యా కమిషన్ ఛైర్ పర్సన్ ఆకునూరి మురళీ ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గత ప్రభుత్వం విద్యారంగాన్ని నిరక్ష్యం చేసిందని.. అందుకే ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేసిందన్నారు. ఈ పాఠశాలలో బోధన పద్ధతులు, మౌలిక సదుపాయాలు కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ నిర్వ హణలో సరికొత్త ఒరవడితో ముందుకు వెళుతు న్నామన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఆ కమిటీలు ప్రతీరోజూ పాఠశాల నిర్వహణను పర్యవేక్షిస్తుంటాయన్నారు. ముఖ్యమంత్రి ఆలోచన మేరకు రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ అందుబాటులోకి వస్తే విద్యా రంగంలో అద్భుతాలు జరుగు తాయన్నారు. పేద విద్యార్థులకు నాణ్యమైన ఇంగ్లీష్ మీడియం విద్య చేరువవుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం విద్యా,వైద్య రంగాలను ప్రాధాన్యతగా భావిస్తుందన్నారు. ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ రాష్ట్రానికే ఆదర్శంగా నిలవడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల సర్పంచ్ శోభా కుమారి, స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటి సభ్యులు స్థానిక నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మోడీ ద్వారానే చట్టసభల్లో రిజర్వేషన్లు సాధ్యం

### రాజ్యసభ సభ్యుడు కృష్ణయ్య

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** దేశ వ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన జనగణన పూర్తయిన తర్వాత ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో చట్టసభలలో రిజర్వేషన్లు సాధ్యమవుతాయని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య అన్నారు. శుక్రవారం బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నీల వెంకటేష్ ఆధ్యక్షతన జరిగిన 13 బీసీ సంఘాల ప్రతినిధుల సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ జనగణనలో కులగణన చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించారని, దీంతో బీసీల జనాభా తెలుస్తుందని, ఆ తర్వాత జనాభా ప్రకారం అన్నిరంగాల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం చరిత్రలో నిలిచిపోయే నిర్ణయాలు తీసుకుంటుందని ఆయన పేర్కొన్నారు. జనగణన రెండు దశల్లో జరుగుతుందని, మొదటి దశలో ఇళ్ళు లెక్కించడం జరుగుతుందని, రెండవ దశలో జనగణనతో పాటు కులగణన చేయడం జరుగుతుందని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పార్లమెంట్‌లో ప్రకటించారని ఆయన పేర్కొన్నారు. పార్ల మెంట్‌లో బీసీ బిల్లు పెట్టి అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసి 2లక్షల కోట్లతో ప్రత్యేక అభివృద్ధి పథకం ప్రకటించాలని కోరారు. బీసీల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను 25 శాతం నుంచి 50 శాతంకు పెంచాలని అన్నారు. బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు రాజ్యాంగ సవరణ చేయాలని అన్నారు. బిసిల విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లపై ఉన్న క్రిమిలేయర్‌ను తొలగించాలన్నారు. ఈ సమా వేశంలో బీసీ సంఘాల ప్రతినిధులు నీల వెంకటేష్, సి.రాజేందర్, పర్లగోర్ల మోడీ రాందేవ్, మల్లేష్ యాదవ్, రాము, అంజిగౌడ్, నిఖిల్ పటేల్, తిరుమలగిరి అశోక్, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



13 బిసి సంఘాల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఆర్.కృష్ణయ్య, చిత్రంలో నీల వెంకటేష్ తదితరులు

## బిసి కులాల్లో పేర్లు మార్పు, చేర్పులు

### రాష్ట్ర ప్రభుత్వ ఆమోదముద్ర

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త :** వెనుకబడిన తరగతుల్లోని పలు కులాల పేర్లను మార్చుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బీసీ కమిషన్ సమర్పించిన సిఫార్సులకు రాష్ట్ర కేబినెట్ ఆమోద ముద్ర వేయడంతో ఈ నిర్ణయం తీసుకుంది. పలు కులాల పేర్లను మారుస్తూ, మరికొన్ని కులాలకు గౌరవప్రదమైన పర్యాయపదాలను జోడించింది. బీసీ జాబితాలోని గ్రూప్ ఎ , గ్రూప్ డీ విభాగాల్లో ఈ మార్పులు చేపట్టింది. ఈ క్రమంలో గ్రూప్ ఏ లోని వరుస సంఖ్య 7లో ఇప్పటి వరకు ఉన్న దొమ్మర అనే పదాన్ని తొలగించి, దాని స్థానంలో గడ వంశీయ అనే పేరును అధికారికంగా ఖరారు చేసింది. అలాగే, వరుస సంఖ్య 18లో ఉన్న పిచ్చకుంట్ల అనే పదాన్ని మారుస్తూ, ఇకపై ఆ కులాన్ని వంశ రాజ్ గా వ్యవహరించాలని నిర్ణయించింది. వరుస సంఖ్య 4లో ఉన్న బుడబుక్కల కులానికి శివ క్షత్రియ అనే పదాన్ని పర్యాయపదంగా చేర్చడం ద్వారా, రికార్డుల్లో వీరిని ఇకపై బుడబుక్కల, శివ క్షత్రియగా నమోదు చేయనున్నారు. అదేవిధంగా వరుస సంఖ్య 5లో ఉన్న వన్నార్ అనే పదాన్ని తొలగించి, ఆ స్థానంలో ధోబీ అనే పదాన్ని చేర్చడం ద్వారా మొత్తంగా వీరిని రజక, చాకలి, ధోబీగా పేర్కొంటారు. వీటితోపాటు సీ గ్రూప్ డి విభాగంలో కూడా ప్రభుత్వం పలు మార్పులు చేపట్టింది. ముఖ్యంగా వరుస సంఖ్య 29లో ఉన్న శూద్ర కులం అనే పదాన్ని ప్రభుత్వం రికార్డుల నుంచి పూర్తిగా తొలగించి, దాని స్థానంలో తమ్మలి (బ్రాహ్మణేతర)గా పేరు మార్చింది. అలాగే వరుససంఖ్య 5లో ఉన్న కులానికి మేరు అనే పదాన్ని అదనంగా జోడించి, ఇకపై వీరిని మేర, మేరు, చిప్పోలుగా గుర్తించాలని నిర్ణయించింది.


## ప్రధాని మోడీ బహిరంగ సభ ఏర్పాట్లను సమీక్షించిన బిజెపి రాష్ట్ర చీఫ్ ఎన్. రాంచందర్‌రావు

**హైదరాబాద్, మే 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రూ. 8 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను కానుకగా ఇచ్చేందుకు ప్రధాని నరేంద్ర మోడీ మే 10వ తేదీన తెలంగాణకు విచ్చేస్తున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు తెలిపారు. సికింద్రాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌లో మే 10వ తేదీ సాయంత్రం 4.30 గంటలకు జరగనున్న భారత ప్రధాని నరేంద్ర మోడీ భారీ బహిరంగ సభ ఏర్పాట్లను బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు శుక్రవారం క్షేత్రస్థాయిలో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, బిజెపి రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ ఎన్.వి.సుభాష్, పార్టీ సీనియర్ నాయకులు చింతల రామచంద్రారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సభా వేదిక నిర్మాణం, బారికేడ్ల ఏర్పాటు, జనసమీకరణ, వసతి సౌకర్యాలపై పార్టీ శ్రేణులు, అధికారులతో చర్చించిన ఆయన, ఎండలు వాతావరణ పరిస్థితుల దృష్ట్యా సభా వేదికతో పాటు గ్రౌండ్ మొత్తాన్ని కవర్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. గురువారం పార్టీ నాయకులతో కలిసి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సైతం ఈ ఏర్పాట్లను పర్యవేక్షించారని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. దేశంలో మూడోసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నరేంద్ర మోడీ తొలిసారిగా తెలంగాణకు రావడం, అదేవిధంగా తాను రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధాని రాక ఇదే మొదటిసారి కావడం విశేషమని హర్షం వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో భాగంగా రాష్ట్రానికి సుమారు రూ. 8 వేల కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని జాతికి అంకితం చేయనున్నారని వెల్లడించారు. ఇప్పటికే కేంద్రం తెలంగాణకు సుమారు రూ. 13 లక్షల కోట్ల నిధులను కేటాయించిందని గుర్తు చేస్తూ, రాష్ట్ర ప్రజలు ప్రధానికి ఘనస్వాగతం పలకాలని పిలుపునిచ్చారు. ఇటీవల జరిగిన 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అస్సాం, పుదుచ్చేరితో పాటు జనసంఘ్ వ్యవస్థాపకులు శ్యామాప్రసాద్ ముఖర్జీ స్వస్థలమైన పశ్చిమ బెంగాల్‌లో బిజెపి సాధించిన విజయం చారిత్రాత్మకమని ఆయన పేర్కొన్నారు. పశ్చిమ బెంగాల్‌లో గతంలో ఒక్క సీటు కూడా లేని పరిస్థితి నుంచి గత ఎన్నికల్లో బిజెపి 78 సీట్లు సాధించి ప్రధాన ప్రతిపక్షంగా నిలిచి కమ్యూనిస్టులను, కాంగ్రెస్ పార్టీల అరాచకాలను ధీటుగా ఎదుర్కొందన్నారు.



## ఐపిఎల్‌లో గేమ్ ఛేంజర్లు

# తెలుగు తేజాలు




**సన్‌రైజర్స్ హైదరాబాద్... పేరులోనే హైదరాబాద్ ఉన్నా పూర్తిగా ఓన్ చేసుకోలేని పరిస్థితి తెలుగు రాష్ట్రాలది. ఈ జట్టులో నితీష్ కుమార్ రెడ్డి ఒక్కడే తెలంగాణ వాడు. అలాగే పలువురు తెలుగు క్రికెటర్లు వివిధ జట్లకు ఆడుతూ సత్తా చాటుతున్నారు. వారిలో ముఖ్యులు హైదరాబాద్‌కు చెందిన తిలక్ వర్మ, మహ్మద్ సిరాజ్. ఇంకా కొందరు ప్లేయర్లు ఐపీఎల్‌లో ఉన్నా వారికి ఆ జట్ల తరుపున ఆడే ఛాన్స్ రావడం లేదు. వీరిలో కొందరు భారీ విలువ కలిగిన కాంట్రాక్టులను దక్కించుకున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఈ ఆటగాళ్లు తమదైన ముద్ర వేస్తున్నారు.ఈ ఐపీఎల్ సీజన్‌లో తెలుగు తేజాలు గేమ్ ఛేంజర్లుగా ఆవిర్భవిస్తున్నారు.**

(వార్త క్రీడా విభాగం)

ఐపీఎల్‌లో తెలుగు కుర్రాళ్ల సత్తా చాటుతున్నారు. ముఖ్యంగా నితీష్ కుమార్ రెడ్డి సూపర్ ఆల్‌రౌండర్‌గా మారాడు. నితీష్ (ఆంధ్ర)ను సన్‌రైజర్స్ హైదరాబాద్ 6 కోట్లకు అట్టిపెట్టుకుంది. దానికి తగినట్లే ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో కీలకంగా రాణిస్తూ జట్టుకు విజ యాలు అందిస్తున్నాడు. రెండు విభాగాలకు బలం తీసుకొస్తున్న నితీష్ ఆల్‌రౌండర్ పదానికి అసలైన అర్థం చెబుతున్నాడు. హేమాహేమీలు ఉన్న ఈ జట్టులో నితీష్ ఓ గేమ్ ఛేంజర్‌గా మారి జట్టును విజయ తీరాల వైపు నడిపిస్తున్నాడు. ఈ సీజన్‌లో నితీష్ సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు నిలకడైన ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. నితీష్ 10మ్యాచ్‌ల్లో 166.9 స్ట్రయిక్ రేట్‌తో 222 పరుగులు సాధించాడు. అందులో ఓ అర్ధసెంచరీ ఉంది. ఇక పవర్ ప్లేలో వికెట్లు అందిస్తున్నాడు. ఓ మ్యాచ్‌లో రెండు వికెట్లు సహా కీలక సమయాల్లో మొత్తం ఏడు వికెట్లు పడగొట్టాడు. ఓ మ్యాచ్‌కు నితీష్ దూరమైతే సన్‌రైజర్స్ బ్యాటింగ్ కుప్పకూలింది. ఇది ఒక్కటి చాటు ఆరేంజ్ ఆర్మీ టీమ్ మిడిల్ ఆర్డర్‌కు ఎంతటి మూలస్థంభంగా ఉన్నాడో చాటిచెప్పడానికి.

### సెంచరీ హీరో తిలక్

నిలకడైన మిడిల్‌ఆర్డర్ బ్యాట్స్‌మెన్ అయిన తిలక్‌వర్మ(తెలంగాణ)ను ముంబై ఇండియన్స్ 8 కోట్లకు అట్టిపెట్టుకుంది. టీట్వంటీ ప్రపంచకప్ అందించడంలో తనదైన రోల్ పోషించిన తిలక్ వర్మ ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోతున్నాడు. గుజరాత్ టైటాన్స్‌పై ఆహ్మదాబాద్‌లో సెంచరీతో మెరిసి ముంబైకు ఒంటిచేత్తో విజయాన్ని అందించాడు. 50లోపే సగం వికెట్లు కోల్పోయిన ఆ మ్యాచ్‌లో 45 బంతుల్లోనే 8 ఫోర్లు, ఏడు సిక్స్‌లతో అదరగొట్టాడు. మరో మ్యాచ్‌లో చెన్నైపై 37 రన్స్ చేశాడు. ఈ రెండు మ్యాచ్‌లు మినహాయిస్తే తిలక్ మిగతా మ్యాచ్‌ల్లో తన స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేకపోయాడు. 2025 సీజన్‌లో 343 రన్స్, 2024 సీజన్‌లో 416 రన్స్ సాధించాడు.




### హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ సిరాజ్

టీమిండియాలో ఓపెనింగ్ బౌలరైన మహ్మద్ సిరాజ్(హైదరాబాద్)ను 12.25 కోట్లకు గుజరాత్ టైటాన్స్ అట్టిపెట్టుకుంది. గుజరాత్ టీమ్ నమ్మకాన్ని నిలబెట్టేలా సిరాజ్ బౌలింగ్‌లో చెలరేగుతున్నాడు. ఈ ఐపీఎల్ సీజన్‌లో బ్యాట్స్‌మెన్ గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్నాడు. జెట్ స్పీడ్‌తో తీసుకువచ్చే సిరాజ్ ఇన్ స్వింగ్, అవుట్ స్వింగ్, యార్కర్లను ఆడడం బ్యాట్స్‌మెన్‌కు కష్టతరంగా మారుతోంది. ఆరంభంలోనే గుజరాత్‌కు వికెట్ పడగొడుతూ బ్రేక్ త్రూలు అందిస్తున్న సిరాజ్... ఇప్పటివరకు పది మ్యాచ్‌ల్లో 8 ఎకానమీతో 11 వికెట్లు పడగొట్టాడు. గత సీజన్‌లో గుజరాత్‌కే ఆడిన సిరాజ్ 16 వికెట్లు తీసుకుని ప్లే ఆఫ్‌కు చేర్చాడు. అంతకుముందు ఆర్సీబీకి ఆడాడు.

### ఛాన్స్ దక్కని తెలుగు ప్లేయర్లు

ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో పలువురు తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లు ఆయా జట్లలో ఉన్నా ఆడే ఛాన్స్ రావడం లేదు. అందులో సత్యనారాయణ రాజు(ఆంధ్ర) గత ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్‌కు 30 లక్షల బేస్ ప్రైస్‌కు వెళ్లాడు. ఓ రెండు మ్యాచ్‌ల్లో ఆడే అవకాశం వచ్చినా పెద్దగా ఆకట్టుకోలేకపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో ఒకే ఒక వికెట్ తీసుకున్నాడు. ఈసారి అయితే తుది జట్టులో ఆడే అవకాశమే రాలేదు. షేక్ రషీద్(ఆంధ్ర) సీఎస్‌కే జట్టులో ఉన్నాడు. 2025 సీజన్‌లో అయిదు మ్యాచ్‌లు ఆడాడు. మొత్తం 71 పరుగులు చేశాడు. ఈసారి రషీద్‌కు ఆడే ఛాన్స్ రాలేదు. ఇక పైల అవినాష్ (ఆంధ్ర)ను పంజాబ్ కింగ్స్ ఎంపిక చేసుకుంది. త్రిపుర్ణ విజయ్(ఆంధ్ర)ఢిల్లీ క్యాపిటల్స్‌తో కాంట్రాక్టును దక్కించుకున్నాడు. ఎర్ర పృథ్వీరాజ్ (ఆంధ్ర)ను ఈ సీజన్ కోసం గుజరాత్ టైటాన్స్ 30 లక్షలకు కొనుగోలు చేసింది. పేరాల అమన్ రావు (తెలంగాణ)తో 2026 సీజన్ కోసం రాజస్థాన్ రాయల్స్ 30 లక్షలకు ఒప్పందం చేసుకుంది. వీరెవరికి ఆడే అవకాశం రాలేదు.




## అపోలో స్పోర్ట్స్ ఇంజురీస్ సెంటర్ ప్రారంభం

**హైదరాబాద్, మే 8(క్రీడా ప్రతినిధి):** క్రీడా గాయాల చికిత్స కోసం అత్యాధునిక సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను అపోలో హాస్పిటల్స్ ప్రారంభించింది. ప్రొఫెషనల్ క్రీడాకారులు మాత్రమే కాకుండా ఫిటనెస్‌పై ఆసక్తి ఉన్న ప్రతి ఒక్కరికీ క్రీడా గాయాల చికిత్సను సమగ్రంగా అందించేందుకు ఈ అత్యాధునిక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఒకే చోట అడ్వాన్స్‌డ్ డయాగ్నస్టిక్, శస్త్రచికిత్స, రీహాబిలిటేషన్ సేవలను అందించే విధంగా ఈ కేంద్రాన్ని తీర్చిదిద్దారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు సభ్యులు కొత్తగా ప్రారంభించిన స్పోర్ట్స్ ఇంజూరీస్ సెంటర్‌ను సందర్శించారు. కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు ప్రజుల్ హింగే, సాకిబ్ హుస్సేన్‌కు ఈ కేంద్రంలోని అత్యాధునిక సదుపాయాలు, చికిత్సా విధానాలను వివరించారు. ఈ సందర్భంగా ఆటగాళ్లు మాట్లాడుతూ.. క్రీడాకారుల రికవరీ, పనితీరును మెరుగుపరచడంలో ఈ సదుపాయాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అభిప్రాయపడ్డారు.

## ఫైనల్లో భారత్ ఆర్చర్లు

**షాంఘై:** భారత ఆర్చరీ మహిళల టీమ్ సంచలనం సృష్టించింది.ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్-2 టోర్నమెంట్‌లో ఫైనల్లోకి దూసుకెళ్లింది. దీపిక కుమారి, అంకిత, కుంకుమ్‌లతో కూడిన భారత్.. ఒలింపిక్స్ స్వర్ణ విజేత దక్షిణ కొరియాను సెమీస్‌లో బోల్తా కొట్టించింది. 58-55, 56-56, 58-56 స్కోరుతో ఓడించి ఫైనల్లోకి దూసుకెళ్లింది.ఫైనల్లో చైనాతో భారత్ తలపడుతుంది. తొలి రౌండ్‌లో భారత్ 6-2(53-56, 57-54, 55-54, 55-51) స్కోరుతో ఉజ్బెకిస్తాన్ జట్టుపై, క్వార్టర్ ఫైనల్లో 5-4(53-54, 54-49, 58-56, 55-56, 28-25) స్కోరుతో వియత్నాం జట్టుపై విజయం సాధించింది. మరోవైపు పురుషుల రికర్వ్ టీమ్‌విభాగంలో ధీరజ్, తరుణ్‌దీప్ రాయ్, యశ్‌దీప్‌లతో కూడిన భారత జట్టు పేలవ ప్రదర్శన కనబరిచింది. తొలి రౌండ్‌లో బై పొందిన భారత జట్టు రెండో రౌండ్‌లో 2-6 స్కోరుతో బంగ్లాదేశ్ జట్టు చేతిలో ఓడింది.

## సెంచరీతో చెలరేగిన ఫిన్

# కోల్‌కతా నాలుగో విక్టరీ




**ఢిల్లీ:** ఆరంభంలో వరుస ఓటములు పొందినా... ఆ తర్వాత కోల్‌కతా నైట్ రైడర్స్ జైత్రయాత్ర కొనసాగిస్తోంది. మరుసగా నాలుగో విజయాన్ని అందుకుని ప్లే ఆఫ్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్ ఉంచిన 143 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని కేకేఆర్ 14.2 ఓవర్లలోనే 2 వికెట్లు కోల్పోయి అందుకుంది. లక్ష్యచేధనలో రహానే(13), రఘువంశీ(1) రూపంలో తొందరగానే వికెట్లు కోల్పోయినా... కామెరూన్(27 బంతుల్లో 33) అండగా ఓపెనర్ అలెన్ ఫిన్ విరుచుకుపడ్డారు. ఢిల్లీ బౌలర్లపై చెలరేగుతూ కేవలం 47 బంతుల్లోనే సెంచరీ సాధించాడు. అతని స్కోరులో 5 ఫోర్లు, పది సిక్స్‌లు ఉన్నాయి. అలాగే మూడో వికెట్‌కు 116పరుగులు జోడించి కోల్‌కతాకు విజయాన్ని అందించాడు. ఈ నాలుగో విక్టరీతో మొత్తం9పాయింట్లతో కోల్‌కతా తన స్థానాన్ని మెరుగుపర్చుకుంది.

టాస్ ఓడి బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ ఇన్నింగ్స్‌కు ఓపెనర్లు రాహుల్(14 బంతుల్లో 23), నిస్సాంక(29 బంతుల్లో 50) అయిదు ఓవర్లలోనే 49 పరుగుల ఫ్లయింగ్ స్టార్ట్ ఇచ్చారు. ఈ దశలో రాహుల్‌ను కార్తీక్ త్యాగి బోల్తా కొట్టించాడు. ఆతర్వాత నుంచి వికెట్ల వేగం పుంజుకుంది. మరో ఎండ్‌లో నితీష్ రాణా(8)ను గ్రీన్, సమీజర్ రిజ్వీ(3)ను నరైన్ అవుట్ చేశారు.టాప్ ఆర్డర్ కుప్పకూలటంతో ఢిల్లీ పీకల్లోతు కష్టాల్లో పడింది.11వ ఓవర్లో హాఫ్ సెంచరీ చేసిన నిస్సాంక, ట్రిస్టన్ స్టబ్(2) వెంటవెంటనే అనుకుల్ రాయ్ అవుట్ చేసి మరింత దెబ్బతీశాడు. నిస్సాంక ఔటయ్యాక ఢిల్లీ పూర్తిగా ఢీలా పడిపోయింది. 15 ఓవర్లకు ఢిల్లీ స్కోర్ 5 వికెట్ల నష్టానికి 98 రన్స్ చేయగలిగింది. స్లాగ్ ఓవర్లలో అశుతోష్ (28 బంతుల్లో 39) దాటిగా ఆడడంతో ఢిల్లీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 142 రన్స్ సాధించగలిగింది. ఢిల్లీ బౌలర్లలో అనుకుల్ రాయ్, కార్తీక్ త్యాగి రెండేసి వికెట్లు తీసుకున్నారు. వైభవ్ అరోరా, సునీల్ నరైన్, క్యామెరాన్ గ్రీన్ ఒక్కో వికెట్ పడగొట్టారు. ఈ ఓటమితో ఢిల్లీ ప్లేఆఫ్ ఆశలు మరింత క్లిష్టంగా మారాయి. 11 మ్యాచ్‌ల్లో 8 పాయింట్లతో ఉంది. మరోవైపు కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లే ఆఫ్ రేసులోకి దూసుకొచ్చింది. ఇంకా నాలుగు మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. కనీసం మూడు మ్యాచ్‌ల్లో నెగ్గినా ప్లే ఆఫ్ ఛాన్సెస్ ఉంటాయి.

# వారాంతంలో నష్టాల్లో సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబయి, మే 8:** దేశీయ మార్కెట్లు వారాంతంలో నష్టాల్లో ముగిశాయి. పశ్చిమాసియాలో ఇరాన్ అమెరికా మధ్య ఉద్రిక్తతలు మళ్లీ భగ్గుమనడంతో భారత మార్కెట్లపై ప్రతికూల ప్రభావం పడింది. దేశీయ సూచీలు నష్టాల్లో కదలాడాయి. అంతర్జాతీయ మార్కెట్లలోని ప్రతికూల సంకేతాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అలాగే నాలుగో త్రైమాసిక ఫలితాల ప్రకటనలకు ముందు ఇన్వెస్టర్లు అమ్మకాలకు ప్రాధాన్యం ఇచ్చారు. ఎస్‌బీఐ సహా కీలక బ్యాంకింగ్ షేర్లు భారీ నష్టాల్లో ముగిశాయి. ఇన్వెస్టర్లకు భారీ నష్టాలు ఇచ్చాయి. ఈరోజు ఉదయం బాంబే స్టాక్ ఎక్స్ఛేంజీ సూచీ సెన్సెక్స్ 77,631 పాయింట్ల వద్ద ట్రేడింగ్ మొదలు పెట్టింది.

ఒక దశలో సూచీలు స్వల్ప లాభాల్లో కదలాడాయి. ఆ తర్వాత పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరగడం వంటి వార్తలతో నష్టాల్లోకి జారుకున్నాయి. నాలుగో త్రైమాసిక ఫలితాల్లో కంపెనీలు అంచనాలను అందుకోలేవన్న సంకేతాలూ ఇన్వెస్టర్లను అప్రమత్తం చేయడంతో చివరకు సెన్సెక్స్ 516 పాయింట్ల మేర నష్టపోయింది. దీంతో సెన్సెక్స్ 77,328 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇక నిఫ్టీ 150 పాయింట్లు నష్టపోయి 24,176 వద్ద ముగిసింది. ఇక డాలర్ తో రూపాయి మారకం విలువ కాస్త కోలుకుని 94.47 వద్ద ట్రేడ్ అయింది. ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 50 ఇండెక్స్‌లో టైటాన్ కంపెనీ, అపోలో హాస్పిటల్, ఏషియన్ పెయింట్స్, టాటా న్యూమర్ ప్రోడక్ట్స్, అదానీ పోర్ట్స్ షేర్లు లాభపడ్డాయి. బ్యాంకింగ్, ఫైనాన్స్ రంగంలోని స్టాక్స్ నష్టాలతో ముగిసాయి. ముఖ్యంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లుభారీగా నష్టపోయింది. 6.66 శాతం మేర నష్టంతో రూ.1019 వద్ద ముగిసింది. ఆ తర్వాత కోల్ ఇండియా స్టాక్ 2.20 శాతం పడిపోయి రూ.456 వద్ద ముగిసింది. బ్యాంకింగ్ రంగంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.91 శాతం నష్టంతో రూ.780 వద్ద ముగియగా యాక్సిస్ బ్యాంక్ స్టాక్ 1.89 శాతం నష్టంతో రూ. 1268 వద్ద స్థిరపడింది. బజాజ్ ఫైనాన్స్ షేరు 1.79 శాతం పడిపోయి రూ.955 వద్ద స్థిరపడింది.

బిఎస్ఇ మిడ్‌క్యాప్ సూచీ 0.05శాతందిగజారింది. అదే స్మాల్‌క్యాప్‌సూచీ 0.15శాతం పెరిగింది. బిఎస్ఇలో 2608 కంపెనీలు పెరిగితే 2148 షేర్లు క్షీణించాయి. 206 షేర్లుమాత్రం స్థిరంగా కొనసాగాయి. ఎంసిఎక్స్‌లో గోల్డ్ ఫ్యూచర్స్ రూ.1,52,757కిచేరింది. పదేళ్ల అమెరికా బాండ్లు 4.368శాతం ఏట్‌తో ఉన్నాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్‌ముడిచమురుజులై సెటిల్‌మెంట్ల ధరలు 0.57 సెంట్లుపెరిగి బ్యారెల్‌కు 100.63 డాలర్లుగా కొనసాగింది.

## రూ.800 కోట్లకు తగ్గిన స్విగ్గీ నష్టాలు



**ముంబయి, మే 8:** ఫుడ్ డెలివరీ సంస్థ స్విగ్గీ నాలుగో త్రైమాసికంలో కొంతవరకూ నష్టాలను తగ్గించుకోగలిగింది. గత ఏడాది ఇదే కాలంలోరూ.1081 కోట్లు ఉన్న నష్టాలు ఈఏడాది రూ.800 కోట్లకు తగ్గాయి. క్విక్ కామర్స్ విభాగంలో మంచి వృద్ధి ఉందని, ఇన్‌స్టామార్ట్ కూడా నష్టాల తగ్గింపులోకీలకంగా పనిచేసిందన్నాడు. మొత్తం రాబడులు రూ.6383 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదేకాలంలో కేవలం రూ.4410 కోట్లు మాత్రమే ఆర్జించింది. మూడో త్రైమాసికంలో కంపెనీ నికరంగా రూ.6148 కోట్లు రాబడులు ఆర్జించింది. 2025లో మొత్తం నష్టం 3117కోట్లు వస్తే మొత్తం పూర్తి సంవత్సరానికి 2026లో 4154 కోట్లు చవిచూసింది.పూర్తికాలానికి గాను రాబడులు రూ.23,053 కోట్లు ఉంది. అదే గత ఏడాదిచూస్తే కేవలం రూ.15,227 కోట్లవరకూ ఉంటుంది. తమ ఫుడ్‌డెలివరీ బిజినెస్ 15 త్రైమాసికాల్లో అత్యధికంగా వృద్ధిని నమోదుచేసింది. స్థూల ఆర్డర్ విలువలు 22.6శాతం వార్షికవృద్ధితో ఉందని, ఎబిడిటా కూడా 39.8శాతంపెరిగి రూ.297 కోట్లకు చేరిందని వివరించింది. స్థూల ఆర్డర్ విలువలు రూ.7881 కోట్లు వరకూ ఉన్నట్లు తెలిపింది. కంపెనీ నెలవారీ కస్టమర్లు 27.2శాతంపెరిగి 25.2 మిలియన్లకు చేరిందని వివరించింది. గడచిన నాలుగేళ్లతోపోలిస్తే ఫుడ్ డెలివరీ భారీ వృద్ధిని నమోదుచేసిందని కంపెనీ ఎండి సిఇఒ శ్రీహర్ష మాజేటి వెల్లడించారు.2027లో కూడా కంపెనీ నష్టాలు మరింతగా తగ్గి లాభాల్లోకి రాగలమని త్రైమాసికం వారీగా వృద్ధినమోదవుతుందని, కొత్త ఆర్డర్లు, కస్టమర్లు కూడా పెరుగుతున్నట్లు ఆయన చెప్పారు. ఆర్థిక ఫలితాల్లో బ్రేక్‌ఈవెన్ సాధిస్తామన్నారు.

## ఎస్‌బిఐ నికరలాభం 19,864 కోట్లు




**ముంబయి, మే 8:** ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బిఐ నాలుగో త్రైమాసికంలో ఏకీకృత నికరలాభం రూ.19684 కోట్లుగా ఉన్నట్లు ప్రకటించింది. రానిబాకీల్లో భారీగా తగ్గుదల నమోదు చేయడంవల్లనే నికర లాభాలు పెరిగాయి. గత ఏడాది ఇదేకాలంలో రూ. 18,643కోట్లు లాభాలు ఆర్జిస్తే ఈ ఏడాది 5.6శాతం పెరిగాయి. మొత్తం రాబడులు మాత్రం కొంతమేర తగ్గాయి. రూ.1,40,412 కోట్లుగా ఉంది. అంతకుముందు ఏడాది ఇదేకాలంలో రూ.1,43,876కోట్లు అని ప్రకటించింది. ఈత్రైమాసికంలో బ్యాంకు వడ్డీ రూపేణా రాబడులు రూ.1,23,098కోట్లు ఆర్జించిందని తెలిపింది. అలాగే ఏడాది క్రితం ఇదేకాలంలో రూ.1,19,666కోట్లు ఆర్జించింది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు 1.49 శాతానికి తగ్గాయి. అలాగేనికర నిరర్థక ఆస్తులు కూడా మొత్తం అడ్వాన్సుల్లో 0.47నుంచి 0.39శాతానికి తగ్గాయి. ఎస్‌బిఐ పూర్తి ఆర్థికసంవత్సరానికి గాను లాభాల్లో 13శాతం వృద్ధిని నమోదుచేసింది. రూ.70,901 కోట్ల నుంచి రూ.80,032 కోట్లకు పెంచుకోగలిగింది. నికర లాభాలు పెరగడంతో బ్యాంకుప్రతివాటాకు రూ.17.35 చొప్పున డివిడెండ్‌ప్రకటించింది. ప్రతి ఒక రూపాయి ముఖవిలువ ఉన్న షేరుకు ఈ డివిడెండ్ వర్తిస్తుంది. అర్హత కలిగిన వాటాదారులకు ఈ డివిడెండ్ ఈనెల 16 నుంచి అందుతుంది. డివిడెండ్ చెల్లింపు తేదీని మాత్రం జూన్ నాల్గవ తేదీగా ప్రకటించింది. నికరలాభాలు పెరిగినప్పటికీ బ్యాంకు షేర్లు ఆరుశాతం దిగువన అంటే రూ.1027.5గా బిఎస్ఇలో ట్రేడ్ అయ్యాయి. బ్యాంకు రిటైల్, వ్యక్తిగత రుణాలు, బంగారం తనఖా రుణాల్లో అడ్వాన్సులు భారీగా కేటాయించినట్లుప్రకటించింది. ఎంఎస్ఎంఇ రంగానికి కూడా రూ.80 వేల కోట్లకుపైగా రుణపరపతి అందించినట్లు ప్రకటించింది. కేంద్రం ప్రకటించిన రుణపరపతి హామీ పథకం కింద 40శాతం ఎంఎస్ఎంఇలు ఇప్పటివరకూ లబ్ధిపొందేందుకు అర్హత సాధించాయని కూడా తెలిపింది.

## ఎంఎస్ఎంఇ రంగానికి ఎస్‌బిఐ

# 80వేల కోట్ల రుణపరపతి



**ముంబయి, మే 8:** పశ్చిమాసియా ఉద్రిక్తతల్లో దెబ్బతిన్న సూక్ష్మచిన్నమధ్య తరహా పరిశ్రమలకు ప్రభుత్వరంగ బ్యాంకింగ్ దిగ్గజం భారతీయ స్టేట్ బ్యాంకు రూ.75 వేలనుంచి 80వేల కోట్లవరకూ రుణపరపతిని అందించినట్లు బ్యాంకు ఛైర్మన్ సిఎష్ షెట్టి తెలిపారు. కేంద్రప్రభుత్వం ప్రకటించిన అత్యవసర రుణలైన్ గ్యారంటీ స్కీం 5.0 కింద ఈ సాయం అందుకున్నట్లు శెట్టి తెలిపారు. ఈ రుణాలకు ఎగువపరిమితి కూడా ఉందని చెపుతూ సుమారు 30 నుంచి 40శాతం మంది ఈ స్కీం ఇప్పటివరకూ వినియోగించుకున్నట్లు తెలిపారు. తమ రికార్డుల ప్రకారం అర్హులైన ఎంఎస్ఎంఇ యజమానులకు ఇసిఎల్‌జిఎస్ 5.0 ప్రకారం రుణపరపతి అందుతుందని అన్నారు. సుమారు 80 వేల కోట్లు ఈ సాయం పొందవచ్చని అంచనావేసిన సిఎస్‌శెట్టి ప్రభుత్వం 2.55 లక్షలకోట్లుగా ఈ స్కీం పరిధిని నిర్ణయించిందన్నారు. అయితే బ్యాంకు మాత్రం 30 నుంచి 40శాతం ఎంఎస్ఎంఇలు మాత్రమే ఈసౌకర్యం వినియోగించుకుంటాయన్నారు.ఇండియన్ బ్యాంక్స్ అసోసియషన్‌కు ఛైర్‌పర్సన్‌కూడా అయిన శెట్టి ఈ స్కీం అమలుకోసం బ్యాంకర్లు, ప్రభుత్వ సంస్థలు వివిధ ఏజెన్సీలను సమన్వయం చేసుకుంటూ ముందుకువెళుతున్నాయన్నారు. ఎఐ, మైథోస్ వంటి వాటి రిస్కులను కూడా అధిగమించే ప్రణాళికలపై శెట్టి బ్యాంకర్లతో భేటీ అయ్యారు. రిటైల్ విభాగంలో రుణాల వృద్ధి ఉందని, హోమ్‌లోన్, వ్యక్తిగత రుణాలు, బంగారం రుణాల్లో కూడా వృద్ధి ఉందన్నారు. 2027 ఆర్థిక సంవత్సరంలో కూడా ఈదే తీరు ఉంటుందని, 13-15 శాతం వార్షిక రుణవృదిద ఉంటుందని ఆయన తెలిపారు. బంగారం ధరలు పెరుగుతుండటంతో రుణగ్రస్తులు ఎక్కువ విలువలతో రుణాలు పొందుతున్నారని,బంగారం తనఖారుణాలకు ఎక్కువ గిరాకీ ఉందన్నారు. డిపాజిట్లు కూడా 2027లో 11నుంచి 12శాతంపెంచే లక్ష్యంతో ఉన్నా మన్నారు. నికరవడ్డీ మార్జిన్‌కూడా కొత్త ఏడాదిలో 3శాతంగావృద్ధినమోదవుతుందన్నారు.



## భారత్‌లో అడోబ్ కొత్త కార్యాలయం

**ముంబయి, మే 8:** అమెరికన్ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్ భారత్‌లో కార్యకలాపాలను విస్తరించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఆధారిత ఆవిష్కరణలపై దృష్టి సారిస్తున్న ఈ టెక్ దిగ్గజం, ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాలో శుక్రవారం కొత్త కార్యాలయాన్ని ప్రారంభించింది. నోయిడా సెక్టార్ 129లో ఏర్పాటు చేసిన ఈ కొత్త ఆఫీసు, భారత్‌లో అడోబ్‌కు ఏడో కార్యాలయం కాగా, ఉత్తరప్రదేశ్‌లో మూడోది.ప్రస్తుతం ఈ క్యాంపస్‌లో ఇంజినీరింగ్, కస్టమర్ విభాగాలకు చెందిన 700 మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఏఐ టెక్నాలజీ ప్రపంచాన్ని మారుస్తున్న ఈ తరుణంలో, ఆవిష్కరణలను పునర్నిర్వచించడంలో అడోబ్ ముందుంది. భారత్ నుంచి ఆవిష్కరణలను ప్రోత్సహించాలన్న మా లక్ష్యంలో ఈ కొత్త ఆఫీస్ ప్రారంభం ఒక ముఖ్యమైన మైలురాయి అని అడోబ్ ఇండియా కంట్రీ మేనేజర్ అభిగ్యాన్ మోదీ తెలిపారు. మారుతున్న టెక్నాలజీ రంగంలో ఉద్యోగులు మరింత సమర్థవంతంగా కలిసి పనిచేసేందుకు ఈ కార్యాలయం దోహదపడుతుందని అడోబ్ ఇండియా ఎంప్లాయి ఎక్స్‌పీరియన్స్ హెడ్ స్వాతి రుస్తాగీ అన్నారు. 1997లో భారత్‌లో కార్యకలాపాలు ప్రారంభించిన అడోబ్‌కు,ప్రస్తుతం దేశవ్యాప్తంగా 8వేల మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు.అమెరికా తర్వాత అత్యధిక ఉద్యోగులున్న దేశం భారత్ కావడం విశేషం.కంపెనీ గ్లోబల్ ఇన్నోవేషన్‌లో మూడింట ఒక వంతు వాటా భారత్ నుంచే వస్తోంది. ఏఐ నైపుణ్యాలను పెంపొందించే లక్ష్యంతో ఫైర్‌ఫ్లై, ఫొటోషాప్ వంటి టూల్స్‌ను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నట్లు అడోబ్ ఈ ఏడాది ప్రారంభంలో ప్రకటించింది.

## ఎఐ క్లౌడ్‌షేర్‌లో 1100 మందికి ఉద్వాసన

**న్యూఢిల్లీ,మే 8:** సైబర్ సెక్యూరిటీ సంస్థ క్లౌడ్‌ఫ్లేర్ సంచలన నిర్ణయం తీసుకుంది. "ఏజెంటెక్ ఏఐ" యుగానికి సిద్ధమయ్యే క్రమంలో భాగంగా, ప్రపంచవ్యాప్తంగా 1,100 మందికి పైగా ఉద్యోగులను తొలగిస్తున్నట్లు ప్రకటించింది. ఇది కంపెనీ మొత్తం సిబ్బందిలో 20 శాతానికి సమానం. కంపెనీ మొదటి త్రైమాసిక ఆదాయ వివరాలు వెల్లడించిన అనంతరం, ఉద్యోగులకు ఈ విషయం తెలియజేసింది. ఇది ఖర్చుల నియంత్రణ కోసం తీసుకున్న నిర్ణయం కాదని, ఏఐ యుగంలో కంపెనీని పునర్నిర్మించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు క్లౌడ్‌ఫ్లేర్ సహ వ్యవస్థాపకులు మాథ్యూ ప్రిన్స్, మిషెల్ జాట్లిన్ ఉద్యోగులకు పంపిన మెమోలో స్పష్టం చేశారు. గత మూడు నెలల్లోనే కంపెనీలో ఏఐ వినియోగం 600 శాతానికి పైగా పెరిగిందని వారు తెలిపారు. ఇంజినీరింగ్, హెచ్ఆర్, ఫైనాన్స్‌తో సహా అన్ని విభాగాల్లో వేలకొద్దీ ఏఐ ఏజెంట్ సెషన్లు నడుస్తున్నాయని, అందుకే కంపెనీ నిర్మాణాన్ని మార్చాల్సి వస్తోందని వివరించారు. ప్రస్తుతానికి ఈ తొలగింపుల ప్రక్రియ ఒక్కసారికే పరిమితమని, భవిష్యత్తులో మళ్లీ ఇలాంటి కోతలు ఉండవని యాజమాన్యం హామీ ఇచ్చింది. పదే పదే చిన్న కోతలు విధించడం వల్ల ఉద్యోగుల్లో అనిశ్చితి నెలకొంటుందని, అందుకే ఒకేసారి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామని పేర్కొంది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., IslamiaJr.College Compound, MGM Road, Warangal-506002. RNI No.64849 Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act.